ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 208 పేజీలు: 12 వెల: 6.50


## పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!

9లో

## ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా

# జనవరి 1 నుంచి 'సంజీవని'

### ఎఐ ఆధారిత వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం

### వైద్య సేవల్లో ఎపిని మోడల్‌గా 'సంజీవన్ని' విజయవంతం చేయాలి

### కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ చేపట్టండి

### వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

### వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఉన్నత సమీక్ష



బుధవారం విజయవాడలో 'సంజీవని' ప్రాజెక్ట్‌పై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఎపిని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని' ప్రాజెక్టును విజయవంతం చేయాలని సిఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని' ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరి కొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఎఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం**

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తు >>2



## సాగర్ నీళ్ల కోసం

# జలజగడం

### ఎన్ఎస్‌పి కుడి కాలువకు నీటి విడుదల

### అనుమతి లేదంటూ అడ్డుకున్న తెలంగాణ

### ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాదనలు

### ఎడమ కాలువకు నీరు వదిలిన తెలంగాణ

### సెప్టెంబర్ 4న కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నాగార్జున సాగర్ కుడి కాలువకు బుధవారం ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి జల జగడానికి తెరలేచింది. కెఆర్ఎంబి అనుమతి లేకుండా ఆంధ్ర ప్రదేశ్ అధికారులు నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడాన్ని తెలంగాణ అధికారులు అడ్డుకోవడంతో సాగర్ డ్యామ్ వద్ద ఉద్రికత్త పరిస్థితులు తలెత్తాయి. ఎన్ఎస్‌పి కుడికాలువకు 2 వేల క్యూసెక్కులు ఎపి ప్రభుత్వం విడుదల చేయడంతో తెలంగాణ కూడా ఎడమకాలువకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఆ జలాశయాన్ని నింపడం కోసం ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదట 5వందల క్యూసెక్కులు విడుదల చేసి క్రమంగాపెంచుతున్నారు. పెద్దదేవుల పల్లి రిజర్వాయర్ నిండిన తరు వాత ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరిలించి >>2

### 23రోజుల తర్వాత శుభవార్త

2లో

## మత్స్యకారులు క్షేమం!

● పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితం ● బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన ● స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారికుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ >>2

### హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తూ

# తెల్లారిన బతుకులు

### కంటైనర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

### ఆరుగురు మృతి, 20 మందికి గాయాలు

### మృతులు, క్షతగాత్రులంతా ఎపి వాసులే

### సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, విచారం




ప్రమాదంలో ధ్వంసమైన ప్రైవేటు బస్సు

**సూర్యాపేట/కోదాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త:** హైదరాబాద్- విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ పిల్లర్లతో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం నుంచి వరుసగా నాలుగు రోజుల సెలవులు ఉండటంతో కుటుంబాలతో కలిసి సంతోషంగా గడిపేందుకు వెళ్తున్నవారిని ఈ ప్రమాదంరూపంలో మృత్యువు కబళించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. >>2

### వరద కల్లోలం

# నేపాల్ అతలాకుతలం



నేపాల్‌లో పలు గ్రామాలను వరదలు ముంచెత్తిన దృశ్యం

### భోటేకోశి నది పొంగిపొర్లడంతో తుడిచిపెట్టుకు పోయిన పలు గ్రామాలు

### 400 మంది పైగా మానస్ సరోవర్ యాత్రికుల గల్లంతు

### 133 మంది భారతీయుల కోసం అన్వేషణ

### ఆకస్మిక వరదలకు ముందు భూకంపం కూడా..

### మృతులు 98 మంది పైనే..

### నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్, అండగా ఉంటామని భరోసా

3లో

### భారతీయుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్లు



బుధవారం అమరావతిలో నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక జరుపుతున్న అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు, మంత్రులు పి.నారాయణ,నాదెండ్ల మనోహర్

### ఆ దిశగా నిర్మాణమే సిఎం చంద్రబాబు లక్ష్యం

### అసెంబ్లీ భవన రూపకల్పనపై కీలక చర్చలు

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన మంత్రులు నారాయణ, మనోహర్, నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్ట్‌నర్స్‌తో సమాలోచనలు

### వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్

### ప్రపంచస్థాయి రాజధానిగా

# అమరావతి

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష ్యమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా రాజధానిలోని శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించేందుకు రూపకల్పనపై కీలక చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఆర్కిటెక్చర్‌సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతోమాట్లాడుతూ అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న శాసనసభ భవనానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో పలు అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. శాసనసభ భవనం పైన ప్రత్యేక టవర్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి అమరావతి రాజధాని మొత్తాన్ని వీక్షి ంచేలా >>2

## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

### డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ

### రూ.30.66 కోట్లు నిధులు కేటాయింపు

### 24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు

### టిటిడి కల్యాణ మండపానికి రూ.2 కోట్లు

3లో



పిఠాపురంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్న దృశ్యం




ఇంటరాక్టివ్ సెషన్‌లో శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు బదులిస్తున్నమంత్రి లోకేష్

### పెట్టుబడులకు

# '3-ఎస్' మంత్రం

### స్పీడ్... సర్వీస్... స్టెబిలిటీ

● వేగంగా వ్యాపార అనుమతులు, పెట్టుబడిదారులకు నిరంతర సేవలు ● పాలసీ స్థిరత్వంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచుతున్నాం ● పెట్టుబడుల పురోగతిపై ఇన్వెస్టర్లతో నేరుగా సంప్రదింపులు ● ప్రతి శనివారం పెట్టుబడిదారులకు వ్యక్తిగతంగా మెసేజ్ చేస్తున్నా ● చంద్రబాబు బ్రాండ్... ఆయన ట్రాక్ రికార్డే ఎపికి బలం ● రేపటితరం గర్వపడేలా అమరావతి చరిత్ర సృష్టించబోతోంది ● ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఎపిలో సృష్టించాలనేది మా లక్ష్యం ● ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' కార్యక్రమంలో మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో అత్యంత ప్రతిభావంతులైన యువనాయకులు, చేంజ్ మేకర్లు, బిజినెస్ మైండ్స్‌కు ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' పేరిట ముంబైలో అవార్డులను ప్రదానంచేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. దేశంలో డైరీ వాల్యూయాడెడ్ ఉత్పత్తుల్లో ప్రత్యేకత సాధించిన హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నారా బ్రాహ్మణికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఆర్‌పిఎస్‌జి గ్రూప్ వైస్ ఛైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగినప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వేగంగా పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలను మంత్రి లోకేష్ తెలిపారు. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ తమ విజయ రహస్యమని తెలిపారు. 'వ్యాపారం అయినా, రాజకీయాలు అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేఅని నేనునమ్ముతాను. అదే విధానాన్ని రాజకీయాల్లో కూడా అవలంబిస్తున్నాం. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యా శాఖకు సంరక్షకుడిగా మాత్రమే. నాకు అప్పగించిన >>2



నేపాల్‌లో సంభవించిన వరదల దృశ్యం

## జనవరి 1 నుంచి 'సంజీవని'

>> న్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం, హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఎఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


## నీళ్లకోసం జలజగడం

>> నింపే అవకాశం ఉంది. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉంది. సెప్టెంబర్ 4న కెఆర్ఎంబి సమావేశమై నీటి వాటాలు నిర్ణయించే అవకాశం ఉంది. తెలంగాణ 50శాతం చొప్పున ఉన్ననీటిని పంచుకోవాలని వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం అక్టోబర్ వరకు తమకు 47 టిఎంసిలు కావాలని కోరింది. అంతేకాదు 50:50 చొప్పున పంచుకోమని 64:36 చొప్పున నీటి వాటా ఉండాలని అంటున్నది. దీనితో ఏ నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. శ్రీశైలం నాగార్జునసాగర్ నీటిని తాగునీటికి మాత్రమే వాడాలని నిర్ణయించినా కుడకాల్వకు ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో ఆందోళన చెలరేగింది.

## కోనసీమ మత్స్యకారుల ఆచూకీ లభ్యతపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఒడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై సిఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఒడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై సిఎం మూడు సార్లు సమీక్షించి రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఏమాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్ గార్డ్, సెంట్రల్ మెరైన్ విభాగాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు జరిపింది. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తంచేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

## తెలంగాణలో కొత్త పూలమొక్క 'అమ్మానియా తెలంగానెన్సిస్'



**హైదరాబాద్, అగస్టు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఒక కొత్త పుష్పించే మొక్క జాతిని కనుగొన్నారు. పరిశోధకులు దీనికి రాష్ట్ర పేరును కలుపుతూ 'అమ్మానియా తెలంగానెన్సిస్' అని నామకరణం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని జలాశయాలు, తడి ప్రాంతాలతో పాటు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఈ మందిలినీ మొక్కను గుర్తించారు. లైథ్రేసియే కుటుంబానికి చెందినదిగా ఈ జాతి గుర్తించారు. హైదరాబాద్‌లోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా దక్కన్ రీజనల్ సెంటర్‌కు చెందిన అర్కిష్టన్ పాల్ఖన్, లదన్ రసింగం, హైదరాబాద్ విశ్వ విద్యాలయానికి చెందిన సిద్దార్థ్ సర్వేశ్వరన్, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన దేవర సంధ్యా దీపిక దీనిపై అధ్యయనం చేశారు. క్షేత్ర సర్వేలు, సంబంధిత జాతులు, హెర్బేరియం నమూనాలతో పోలికలను సమీక్షించిన తరువాత ఈ అధ్యయనం జరిగింది. ఈ సేకరణలు, తెలిసిన ఏ అమ్మానియా జాతితోనూ సరిపోలడం లేదని ఆ అధ్యయనంలో తేలింది. టైప్ నమూనాను 2025 జనవరి 4న అమ్రాబాద్‌లోని పల్లాపల్లె సమీపంలో సేకరించారు, ఇతర నమూనాలు రంగారెడ్డి జిల్లాలోని నర్సింగి, గచ్చిబౌలి నుండి లభించాయి.

అమ్మానియా ప్రజాతి తడి, జల ఆవాసాలతో సంబంధం ఉన్న గుల్మ జాతి మొక్కలను కలిగి ఉంటుంది. తెలంగాణ నమూనాలు అమ్మానియా కార్డాటా, అమ్మానియా ప్రోస్ట్రాటాలను పోలి ఉన్నాయి, కానీ కాడలతో కూడిన పుష్పగుచ్ఛాలు, ముదురు గులాబీ రంగు రేకులు, విలక్షణమైన ఆకులు, రక్షక పత్రాలు, అసాధారణమైన విత్తన కవచ నమూనా వంటి విలక్షణమైన లక్షణాలను కలిగి ఉన్నాయి. ఈ మొక్క కాలానుగుణంగా ప్రవహించే వాగుల వెంబడి, నీటి వనరుల అంచులలో, తడి ఇసుక నేలల్లో, అమ్మానియా మల్టిఫ్లోరా, రోటాలా జాతుల వంటి తడి నేల మొక్కలతో పాటు పెరుగుతుంది. ఇది నవంబర్, ఫిబ్రవరి నెలల మధ్య పూలు పూసి, ఫలాలను ఇస్తుందని పరిశోధకులు తెలిపారు.

# మత్స్యకారులు క్షేమం!

>> నెల 3న ఒడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.

మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చున్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ కృషి ఫలితంగానే శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి, అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని చెప్పారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో క్షేమంగా ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ఈ గాలింపు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ఎపి ఆర్‌టిజిఎస్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేశాయని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, జాయింట్ డైరెక్టర్, అల్లవరం ఎఫ్‌డిఒతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషిని మంత్రి అభినందించారు. "మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధకు ధన్యవాదాలు. మత్స్యకారుల ఆచూకీ కోసం మొదటి నుంచి చివరి వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించింది. ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారనే శుభవార్త రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని మంత్రి అన్నారు. "మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మత్స్యకారులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ఇకడాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఒడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 3న సముద్రంలో వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు గంట తర్వాత నుంచి స్థానికులకు అందుబాటులోకి రాలేదు. వేట ముగించుకుని 10 రోజుల్లో రావాల్సి న వారు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం దాదాపు 10 రోజులు గాలింపు చర్యలు చేపట్టారు. ఏడుగురు మత్స్యకారులు బెంగాల్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులంతా సురక్షి తంగా ఉన్నారని వెల్లడించారు. బోటులో సాంకేతిక సమస్య ఏర్పడడంతో బెంగాల్ తీరానికి చేరినట్లు పేర్కొన్నారు.

## మరో ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

**సఖినేటిపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు వారం రోజుల తరువాత ప్రమాదం నుంచి బయట పడి అంతర్వేది పల్లెపాలెం హార్బర్‌కు చేరుకున్న ఘటన ఇది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం కాకినాడలో చేపల వేటకు ఏడుగురు మత్స్యకారులతో, ఇండియా ఎపి ఇ2 యం.యం 78 నెంబర్ గల బోటు బయలుదేరింది. చేపల వేట అనంతరం అంతర్వేది హార్బర్‌లో చేపల అమ్మే ప్రయత్నంలో గట్టుకు రావడానికి ప్రయత్నించగా సముద్రంలో ఆటుపోటులకు ఇసుక దిబ్బలు ఎక్కువగా ఉండటంతో బోటు ఇసుకకు తగిలి ఇరుక్కొని పోయింది. దాంతో చేసింది లేక లంగరు వేసి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజు మళ్లీ ఆటు పోటులకు బోటు తేలింది. కానీ పంఖా ఇరిగటం వల్ల ఆరోజు కూడా లంగారు సాయంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మంగళవారం ఒక బోటు వేటకు వెళ్లే సమయంలో నిలిచిపోయిన బోటును చూసి ఆగి వాళ్లతో మాట్లాడి వేటాడు సమయం కావటంతో అక్కడే ఉండమని చెప్పి బోటులో ఉన్నవాళ్లు వేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆగిపోయిన బోటును తమ బోటుకు కట్టుకొని వచ్చే సమయంలో మళ్లీ బోటు ఇసుకలో చిక్కుకుంది. పడవకు రంధ్రం పడింది. వెంటనే మెరైన్ స్టేషన్‌కు సమాచారం అందించారు. రాత్రి 7 గంటల సమయంలో విషయం తెలుసుకున్న మెరైన్ పోలీస్ సిబ్బంది మరో బోటుతో అక్కడికి చేరుకున్నారు. ఆ బోటు సాయంతో రంధ్రం పడిన బోటును అంతర్వేది హార్బర్‌కు తీసుకు తరలించారు. సిఐ నవీన్ నరసింహమూర్తి ఆదేశాలతో మాత్యకారులను వేములదివి ఒడ్డుకు తరలించి నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు అనంతరం వారి గృహాలకు తరలించారు. ఇలా కాకినాడ హార్బర్ నుండి వేటకు వెళ్లిన మత్యకారులు సంగాని సూర్యచంద్ర, మేసు కామేశ్వరరావు, వాసుపల్లి శ్రీనివాసు, దున్నా రాజు, పెదసింగు జగ్గారావు, పెమ్మడి స్వామి, కర్రి శ్రీనులు ప్రమాదం నుండి బయట పడి వారం రోజులకు తమ ఇళ్లకు చేరటంతో కథ సుఖాంతమైంది.

## అమరావతి శాసనసభ భవనానికి ప్రపంచస్థాయి రూపకల్పన
## నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక చర్చలు

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక వాస్తుశిల్పం- తెలుగు సంస్కృతి సమ్మేళనంగా, రాష్ట్ర ప్రజాస్వామ్య వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసనసభ భవన డిజైన్, నిర్మాణ ప్రణాళిక, ఇంటీరియర్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, సుస్థిర నిర్మాణ విధానాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్, సంస్థ ప్రతినిధులతో పాటు సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, సిఆర్‌డిఎ చీఫ్ ఇంజనీర్ ఏ.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ భవనం ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపకల్పన చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక వాస్తుశిల్ప సౌందర్యంతో పాటు, భవనం వినియోగించే ప్రతి వర్గానికి సౌకర్యవంతంగా, సమర్థవంతంగా ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ సముదాయంలో ముఖ్యమంత్రి ఛాంబర్, స్పీకర్ ఛాంబర్, డిప్యూటీ స్పీకర్ ఛాంబర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్‌కార్యాలయం, బిజినెస్ అడ్వైజరీ కమిటీసమావేశ మందిరం, మంత్రులు, శాసనసభ్యుల కార్యాలయాలు, వివిధ శాసనసభ కమిటీల సమావేశ మందిరాలు తదితర విభాగాలను సమగ్రంగా ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. అదేవిధంగా ప్రధాన సభా మందిరం, కమిటీ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్స్, శాసనసభ్యుల లాబీలు, ప్రోటోకాల్ ప్రాంతాలు, మీడియా సెంటర్, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, మీడియా వర్క్‌స్టేషన్లు, మీడియా బ్రీఫింగ్ సదుపాయాలు, సందర్శకుల గ్యాలరీలు, పబ్లిక్ లాంజ్‌లు, విజిటర్స్ రిసెప్షన్ ప్రాంతాలు వంటి కీలక సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంపై ప్రతినిధులతో అభిప్రాయాలు పంచుకున్నారు. శాసనసభ కార్యకలాపాలను ఆధునిక పద్ధతుల్లో నిర్వహించేందుకు ఆడియో-విజువల్ వ్యవస్థలు, డిజిటల్ ఓటింగ్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్, లైవ్ టెలికాస్ట్, బ్రాడ్‌కాస్టింగ్ సదుపాయాలు, డిజిటల్ శాసన వ్యవస్థలు వంటి సాంకేతిక మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రోటోకాల్ మూవ్‌మెంట్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా జోన్లు, పార్కింగ్, డ్రాప్-ఆఫ్, పికప్ ప్రాంతాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వ్యవస్థలు వంటి అంశాలను డిజైన్‌లో సమర్థవంతంగా సమన్వయం చేయాలని చర్చించారు. అంతర్గత రూపకల్పనలో సభా మందిరం, ముఖ్యమంత్రి, స్పీకర్ ఛాంబర్లు, మంత్రులు-శాసనసభ్యుల కార్యాలయాలు, బిఎసి సమావేశ మందిరం, ఇతర కమిటీ హాళ్లు, మీడియా సెంటర్ తదితర విభాగాలకు తగిన గౌరవం, సౌకర్యం, కార్యాచరణ సామర్థ్యం కల్పించడంతో పాటు, తెలుగు సంస్కృతి, కళలు, శిల్పకళ, చారిత్రక వారసత్వాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో మేళవించేలా ఇంటీరియర్ డిజైన్ రూపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు. అన్ని వర్గాల ప్రజలకు సులభమైన వినియోగాన్ని కల్పించేలా యూనివర్సల్ యాక్సెస్‌బులిటీ ప్రమాణాలు, ర్యాంపులు, లిఫ్టులు, ఆధునిక శానిటేషన్ సదుపాయాలు, సులభమైన అంతర్గత రాకపోకల మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సహజ కాంతి-గాలి ప్రసరణ, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిర్వహణ, పర్యావరణహిత నిర్మాణ విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు వంటి సుస్థిరత అంశాలను కూడా డిజైన్‌లో అంతర్భాగం చేయాలని చర్చించారు.

భద్రతకు సంబంధించి సిసిటివి నిఘా, యాక్సెస్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర ఆధునిక వ్యవస్థలను సమగ్రంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించారు. శాసనసభ భవనం కేవలం పరిపాలనా నిర్మాణంగా కాకుండా రాష్ట్ర ప్రజాస్వామ్య స్ఫూర్తికి, తెలుగు సంస్కృతి-వారసత్వానికి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలకు చిరస్థాయి ప్రతీకగా నిలిచేలా నిర్మాణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో దృష్టి సారించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా.. తెలుగు సంస్కృతికి అద్దంగా.. ఆధునిక ఆంధ్రప్రదేశ్ ప్రగతికి చిరునామాగా.. అమరావతి శాసనసభ భవనం రూపుదిద్దుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

### వారం - వర్జ్యం

27-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ముఖకార్తె
తి.చతుర్దశి ఉ.9.07
న.ధనిష్ఠ రా.2.13
వ. లేదు
దు1. ఉ.10.03-ఉ.10.53
దు2. మ.3.04-మ.3.54
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు

### వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం :** మీకు ఇష్టం లేని పనిని ఇతరుల ఒత్తిడి మేరకు గత్యంతరం లేక చేయవలసి వస్తుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**మిథునం :** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది.

**కర్కాటకం :** మంచి ఫలితాలను సాధించాలంటే, మంచి పరిచయాలు కూడా అవసరమేనని భావిస్తారు. ఆభరణాలు కొనుగోలు.

**సింహం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్యాయాలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యం జాగ్రత్త. కొత్త ఋణం తీసుకుంటారు.

**కన్య :** స్త్రీల, వృద్ధుల సహకారంతో కొంత ఊరట చెందుతారు. కోర్ట్ కేస్‌ల నుండి క్షేమంగా బయటపడతారు.

**తుల :** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో లాభం.

**వృశ్చికం :** మంచి చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. ఆస్తులు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**ధనుస్సు :** వృత్తిఉద్యోగాల పరంగా ఒడిదుడుకులేవీ ఏర్పడవు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. క్రొత్త బ్రాంచీల ఏర్పాటు.

**మకరం :** కళలు, రాజకీయ, రంగాలలోని వాడి సన్మానయోగం. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం :** వివాహాది శుభకార్యాలు సానుకూల పడతాయి. జీవితాశయం నెరవేరుతుంది. కుటుంబ సభ్యుల నుండి సహాయం.

**మీనం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. పేయింటింగ్, ఆర్ట్, డిజైనింగ్‌లో మంచి పేరు ప్రఖ్యాతి సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఫార్చ్యూన్ఇండియా 40 అండర్ 40 అవార్డును అందుకుంటున్న నారా బ్రాహ్మణి

## పెట్టుబడులకు '3-ఎస్' మంత్రం

>> బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లాలన్నదే నా ఆలోచన. గతంలో వ్యాపారంలోనూ ఇదే విధానాన్ని అనుసరించాను. ఇప్పుడు అధికారిక బాధ్యతలోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్తున్నాను. మనందరం, ముఖ్యంగా రాజకీయ నాయకులు సంస్థలను నిర్మించే వ్యక్తులుగా ఉండాలి అని నేను బలంగా నమ్ముతున్నాను. ఎపి అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది మేము అనుసరిస్తున్న '3-ఎస్'ల విధానం.. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే విధానాలు. మొదటిది వేగం, మేము ఎంత వేగంగా పని చేస్తున్నామో ఇక్కడ ఉన్న అనేక పరిశ్రమల ప్రతినిధులు స్వయంగా చూశారు. రెండోది సర్వీస్, చాలా మంది పెట్టుబడిదారులకు వారి పెట్టుబడుల ప్రస్తుతస్థితిపై నేను స్వయంగా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటాను. దాదాపు ప్రతి శనివారం రాత్రి వారికి వ్యక్తిగతంగా మెసేజ్ పంపుతాను. పెట్టుబడిదారులు కోరుకునేది ఇదే అని నేను నమ్ముతున్నాను. మూడోది పాలసీ స్థిరత్వం అంటే విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ పెట్టుబడిదారులు కోరుకునేది స్థిరమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్. మా నాయకత్వం గతంలో తీసుకొచ్చిన విధానాలు రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడ్డాయి. ప్రభుత్వాలు మారవచ్చు, కానీ మా విధానాలు మాత్రం కొనసాగుతాయి.

రెండో కారణం సిఎం చంద్రబాబు నాయుడు. సిబిఎన్ అంటే ఒక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడుల కోసం అవసరమైన తలుపులు తెరవగలిగే ముఖ్యమంత్రి ఉండటం వల్ల మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం నేను సమావేశ మందిరంలోకి వెళ్లినపుడు ఒప్పందాన్ని ఖరారు చేస్తాను. మేమిద్దరం కలిసి ఈవిధంగా పనిచేస్తున్నాం. ఈ భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది. సిఎం చంద్రబాబు మంత్రివర్గంలో తాను పనిచేస్తున్నానంటే ఆయన దగ్గర నేను నేర్చుకోవాల్సి ఉంది. తండ్రిగా ఆయన చూసి చాలా నేర్చుకున్నాను. మంత్రిగా ఆయన మాకు సిఎం, ఆయనది దూరదృష్టి, ఆ దిశలో ఆయన మా అభిప్రాయాలు చెబుతామన్నారు. అన్నింటిని ఆయన వింటారు. ఆచరణకు అవకాశం కల్పిస్తారు. ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల విషయంలో మనం మన తల్లిదండ్రులతో విభేదించే సందర్భాలు ఉంటాయి. అయితే నా అభిప్రాయం కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. కొత్త రంగాల్లో, కొత్త వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలి. పరిశోధనపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి న అవసరం ఉంది. ప్రస్తుతం ఇది చాలా కీలకం. ఇక్కడే విద్య ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వివిధ ఖండాల్లో ఉన్న సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య అనుసంధానం కల్పించి, పరిశోధన, కొత్త రంగాల్లో మరింత దృష్టి పెట్టవచ్చు. అది అంతరిక్ష రంగం కావచ్చు, క్వాంటమ్ టెక్నాలజీ కావచ్చు, మెటీరియల్ సైన్సె స్ కావచ్చు భారతదేశం చేయగలిగేది ఎంతో ఉంది. మనమంతా కలిసి దీన్ని సాధించగలం. ఇక రాష్ట్రం తరఫున నేను కోరేది ఒక్కటే ఈ మార్పులో మీరు కూడా భాగస్వాములు కండి. మనం వివిధ దేశాలు, వివిధ నగరాల గురించి, అక్కడ జరుగుతున్న మార్పుల గురించి మాట్లాడుతుంటాం. నేను మీకు అందిస్తున్న వేదిక ఆంధ్రప్రదేశ్. మేము పూర్తిగా పరిపూర్ణంగా ఉన్నామని చెప్పడం లేదు. కానీ మేము చేసే ప్రతి తప్పునుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా ఎలా తీర్చిదిద్దాలి? అనే విషయంలో మీ అభిప్రాయాలను స్వీకరించడానికి, మీతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రేపటి భారతదేశం, మన తర్వాత తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి అనే నగరం మరోసారి చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించాలనేది మా లక్ష్యం. ఈరోజు ఇక్కడ ఉన్న 40 ఏళ్ల లోపు యువత నుంచి నేను కోరేది కూడా ఇదే" అని నారా లోకేష్ వివరించారు.

# తెల్లారిన బతుకులు

>> మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సు అతివేగంగా కంటైనర్‌ను ఢీకొనడంతో కంటైనర్‌లోని ఐరన్ పిల్లర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో పాటు కొన్ని పిల్లర్లు బస్సు లోకి చొచ్చుకుపోయాయి. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా ఆరుగురు మృతి చెందారు. ఘటనా స్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో భయానక వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ, రూరల్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కృష్ణా జిల్లా వంగటూరు మండలం తెలప్రోలు గ్రామానికి చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడ కానూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బొల్లిపోగు మేరీ జోష్ణ (29), పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన సురావరపు శకిన (24), కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం పడమటి లంకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెన్నకేశవుల నాగేంద్రబాబు (31), విజయవాడ జయప్రకాష్ నగర్‌కు చెందిన పిడికిటి లక్ష్మి (30), విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కొండూరు భావన వర్ష (25) ఉన్నారు. కంటైనర్ డ్రైవర్, బస్సు డ్రైవర్ల ఆచూకీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## కోదాడ బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** కోదాడ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి**

సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఎపి యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ దగ్గర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి మండిపల్లి**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

>> కల్పన చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా భవన డిజైన్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా శాసనసభభవనాన్ని డిజైన్ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రజలు శాసనసభను సందర్శించినప్పుడు రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసన ప్రక్రియపై అవగాహన కలిగేలా, వారికి మంచి అనుభూతిని అందించే విధంగా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సందర్భాల్లో శాసనసభ, శాసనమండలి ఉభయ సభల సభ్యులందరూ ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేసేవిధంగా డిజైన్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శాసనసభ ప్రాంగణం పూర్తిగా ఆధునిక సౌకర్యాలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉండాలని సిఎం సూచించారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్ తరహా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలన్నది సిఎం ఆలోచనగా మంత్రి వెల్లడించారు.



## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** "చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృఢ సంకల్పం. లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు, ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి అన్నదే ఆయన లక్ష్యం. ఈ మేరకు డి.సిఎం కార్యాలయం కీలక ప్రకటన విడుదల చేసింది. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోందని తెలిపింది.. పవన్ కల్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ.30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి.

### భక్తుల రద్దీకి తగ్గట్టు ఆలయాల ఆధునీకరణ

పిఠాపురం నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. శ్రీకుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.

### అత్యాధునిక వసతులతో టిటిడి కల్యాణ మండపం

పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని టిటిడి కల్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు.

### భజన మందిరాలతో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ



కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతోపాటు ఆలయాల ఆధునీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు ప్రత్యేక చర్యలు

- ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక
- 20.35 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు, పప్పుధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి
- పంటల బీమా పరిధి 108శాతం పెరుగుదల
- రైతుల కోసం ఇంతటి ముందస్తు ప్రణాళిక జగన్ పాలనలో ఎక్కడుంది?: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎక్కడా విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంటే, వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తగదని అన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. 2026 జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25వరకు రాష్ట్రంలో 192.8మి.మీ. వర్షపాతం నమోదైందని, ఇదే కాలానికి సాధారణ వర్షపాతం 393.7మి.మీ. కాగా, సాధారణంతో పోలిస్తే 51శాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పప్పు ధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి నమోదు కావడం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు నిదర్శనమని మంత్రి అన్నారు. గత ఏడాది ఆగస్టు 25 నాటికి పప్పుధాన్యాల సాగు 2.16 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2.66 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపారు. పంటల వారీగా కంది 1.92 లక్షల హెక్టార్ల నుంచి 2.30 లక్షల హెక్టార్లకు, మినుము / బ్లాక్‌గ్రామ్ 0.17 లక్షల హెక్టార్ల నుంచి 0.30 లక్షల హెక్టార్లకు, పెసలు 0.041 లక్షల హెక్టార్ల నుంచి 0.061 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ 0.048 లక్షల హెక్టార్ల నుంచి 0.100 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం వరి 10.37 లక్షల హెక్టార్లు, కంది 2.30 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.37 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.00 లక్షల హెక్టార్లు, మినుము 0.30 లక్షల హెక్టార్లు, పెసలు 0.061 లక్షల హెక్టార్లుగా ఉందని తెలిపారు. పత్తి సాగు కూడా గత ఏడాది 25.08.2025 నాటికి 3.96 లక్షల హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 3.97 లక్షల హెక్టార్లకు చేరిందని, స్వల్ప పెరుగుదల నమోదైందని మంత్రి చెప్పారు. సాధారణ సీజన్ లక్ష్యం 5.15 లక్షల హెక్టార్లు అని తెలిపారు. నెల్లూరు, తిరుపతి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే అధిక స్థాయిలో నమోదైందన్నారు.




**ఫిబ్రవరి నుంచే ఎల్‌నినోపై అప్రమత్తం:** ఎల్‌నినో గురించి కేంద్రం అలర్ట్ చేసినప్పటి నుంచే, అంటే ఫిబ్రవరి 2026 నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నీటిని ఎక్కువగా వినియోగించే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఖరీఫ్ 2026కు సంబంధించి జిల్లాల వారీగా కరువు నివారణ ప్రణాళికలు రూపొందించామని మంత్రి చెప్పారు.

**పేరుకే ఉచిత పంటల బీమా.. కానీ రైతులకు చేసింది అంతా మోసం:** "జగన్ హయాంలో ఐదేళ్లలో ఒక్క రబీ సీజన్‌లో కూడా ఒక్క రైతుకు ఒక్క పైసా పంటల బీమా పరిహారం ఇవ్వలేదు. ఖరీఫ్‌లో కూడా ఐదేళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే ప్రీమియం చెల్లించి, మూడు సంవత్సరాలు ప్రభుత్వం తన వాటా ప్రీమియం కూడా చెల్లించలేదు. రైతులకు ఉచిత పంటల బీమా అని ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో రైతులకు బీమా భరోసా కల్పించలేదు. ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి జగన్ ?. రైతులపై పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటూ తమ ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులపై భారం మోపడం తమ ప్రభుత్వ విధానం కాదని, అత్యల్ప ప్రీమియంతో స్వచ్ఛందంగా పంటల బీమాలో చేరేలా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జగన్ నీ హయాంలో రైతుల పంటలకు బీమా భరోసా ఏమైంది? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయడమే తప్ప, ప్రభుత్వం తన వాటా ప్రీమియాన్ని సక్రమంగా చెల్లించని పరిస్థితి మీ పాలనలో ఎందుకు ఏర్పడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుపై భారం వేయడం మా విధానం కాదు... రైతుకు భరోసా ఇవ్వడం మా విధానం. రైతుల పంటకు బీమా రక్షణ, రైతు కుటుంబానికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం

# రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

## భారత్ సహా ఆసియా దేశాల్లో కనిపించదు..

### అదే రోజు రక్షాబంధన్ వేడుక



చంద్ర గ్రహణంపై నాసా విడుదల చేసిన ఫోటో


**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన ఆకాశంలో మరో ఖగోళ అద్భుతం ఆవిష్కృతం కానుంది. హైందవ సాంప్రదాయంలో ఎంతో ముఖ్యమైన రక్షా బంధన్, శ్రావణ శుక్రవారం సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్ప డనున్నది. అయితే ఉదయం వేళ చంద్ర గ్రహ ణం ఏర్ప డనుండడంతో భారత్ సహా ఆసియా దేశాల్లో ఇది కనిపించదు. ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగానూ యూరప్, ఆఫ్రికాలో దేశాల్లో పాక్షికంగానూ ఈ గ్రహణం కనువిందు చేయనుంది. ప్రపంచ వ్యాప్తంగా 44 శాతం మంది ప్రజలు ఈ గ్రహణాన్ని వీక్షించే అవకాశం వుందని అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది రెండవ సంపూర్ణ చంద్ర గ్రహణం శుక్రవారం ఏర్పడనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం ఆరుగంటల 53 నిమిషాలకు గ్రహణం మొదలై మధ్యాహ్నం 12.32 గంటలకు ముగుస్తుంది. పాక్షికంగా కనిపించడం ఉదయం 8.04గం టలకు మొదలవుతుంది. ఉదయం 9.43 గంటలకు పూర్తిగా కనిపిస్తుంది. ఉదయం వేళ అయినందున భారత్ సహా ఆసియా దేశాల్లో ఈ గ్రహణం కనిపించదు. ఈ గ్రహణం ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగా కనిపించనుంది. న్యూయార్క్‌తో పాటు అట్లాంటా, మియామీ, చికాగో, డల్లాస్, హో స్టన్, లాస్‌ఎంజిల్స్, సీటల్ నగరాలలో పూర్తిగా కనిపించనుండడంతో గ్రహణాన్ని అన్ని కోణాల్లో వీక్షించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఇదే సమయంలో యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్ సహా ఆఫ్రికా దేశాలలో చంద్ర గ్రహణం పాక్షికంగా కనిపించనుంది. భార త్‌లో చంద్రగ్రహణం కనిపించనందున ఇక్కడ సూతక్ కాలం వుండదని ఆగమన పం డితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కుంభ రాశిలో శతబిషా, ధనిష్టా నక్షత్రాల పరిధిలో ఏర్పతుం దని, ఈ నక్షత్రాల వారు ఆలయాల్లో పూజలు చేయించడం మం చిదని పండితులు చెబుతున్నారు. సూతక్ కాలం భారత్‌లో లేనం దున శ్రావణ శుక్రవారం పూజలు చేయవచ్చని, రక్షాబంధన్ పండగ జరుపుకోవచ్చని వారు తెలి పారు. గ్రహణం రోజున మనకు ఎలాంటి భద్రకా లంవుండబోదని పండితులు తెలిపారు. ఈ ఏడాది మార్చి మూడవ తేదీన సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణం భారత్‌లో ముగింపు సమ యం లో పాక్షికంగా కనిపించడం తెలిసిందే. దీని తరు వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుండగా ఇది కూడా భారత్‌లో కనిపించబోదు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు తెలంగాణ యువకుల మృతి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** అమెరికా లోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు దుర్మరణం చె ందారు. భారత కాలమానం ప్రకారం మంగళ వారం అర్ధరాత్రి దాటిన తరువాత (అమెరికాలో ఉదయం పది గంటల సమయం) ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఒకరిని నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన రాహుల్ (30)గా గుర్తించగా మిగతా ఇద్దరిని ఇంకా గుర్తించలేదు. వివరా లు ఇలావున్నాయి. ఫ్లోరిడాలోని ట్రెవార్ట్ కౌంటిలో ఇంటర్‌స్టేట్ 95 (ఐ..95) జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు తాము పనిచేస్తున్న ప్రాం తం నుంచి కారులో మరోచోటికి వెళుతుండగా పామ్ టీ ప్రాంతంలో 172 మైలురాయి వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టు ను ఢీకొంది. ఈ ఘటనలో కారుకు మంటలు అంటుకోగా అందులో చిక్కుకున్న ముగ్గురిలో ఇద్దరు ఘటనా స్థలంలోనే మరణించగా మూడవ వ్యక్తి ఆసుపత్రిలో చనిపోయాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికులు బాధితులను ఆసు పత్రికి తరలించేందుకు పోలీసులకు సహాయం అందించారు. మృతుల్లో ఒకరైన రాహుల్ నిజా మాబాద్ జిల్లా నవీపేట మండలం నారాయణ పూర్ (నాడాపూర్) గ్రామానికి చెందినవాడు. హరిబాబు, నాగమణి దంపతుల కుమారుడైన రాహుల్ మూడు నెలల క్రితమే ఉన్నత చదు వులకోసం అమెరికాకు వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున తనకు ప్రమాదం గురించి ఫోన్ వచ్చిందని రాహుల్ తండ్రి హరిబాబు మీడి యాకు తెలిపారు. కాగా మిగతా ఇద్దరిని గుర్తిం చేందుకు అమెరికాలోని తెలుగు సాంస్కృతిక సంస్థ తానా సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు ముగ్గురి మృతదేహాలను భారత్‌కు పంపేందుకు వారు దౌత్య అధికారులతో సంప్రదింపులుజరుపుతున్నారు.కాగా ఈఘటన రాష్ట్రం లోని ఆయా ప్రాంతాలలో విషాదం నింపింది.

## మంగళగిరిలో అధునాతన మోడల్ రైతు బజార్

- రూ.18.కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం
- నేడు మంత్రి లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామిక పురోగతికి, మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా మంగళగిరి మారుతోంది. ప్రజాదరణతో పాటు పరిపాలనా దక్షత తోడవడంతో మంగళగిరి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ వద్ద మోడల్ రైతు బజార్ నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఆధునిక హంగులతో చేపట్టే రిటైల్ అండ్ హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులకు గురువారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

**రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం**



మంగళగిరిలో ఏర్పాటుచేయనున్న మోడల్ రైతు బజార్‌ను 5.90 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల అరబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులుగా ఉండనుంది. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60షాపులు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా హోల్‌సేల్ మార్కెట్‌లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. 61.4 చ.మీల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, 144.6 చ.మీ విస్తీర్ణంలో అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, 190 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్యాంటీన్, ప్రజల కోసం 130 చ.మీల విస్తీర్ణంలో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేయనున్నారు. వాటర్ సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్, గార్బేజ్ కలెక్షన్, ఆర్గానిక్ కన్వర్టర్, టెర్రస్ సోలార్ ఎనర్జీ ప్యానల్స్ వంటి సదుపాయాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు.



# వరద కల్లోలం

# నేపాల్ అతలాకుతలం



- పొంగిపొర్లిన భోటెకోశి నది
- కొట్టుకుపోయిన పలు గ్రామాలు
- 400 మందికి పైగా మానస సరోవర్ యాత్రికుల గల్లంతు
- 133 మంది భారతీయుల కోసం అన్వేషణ
- ఆకస్మిక వరదల ముందు భూకంపం కూడా
- మృతులు 95మందిపైనే..
- నేపాల్ ప్రధానికి నరేంద్ర మోడీ ఫోన్
- అండగా ఉంటామని భరోసా

**కాఠ్మండు, ఆగస్టు 26:** టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్‌లోని రాసువా జిల్లాను మెరుపు వరదలు ముంచెత్తాయి. మానస సరోవర్ యాత్ర, గోసైంకుండ యాత్రలకు కీలకంగా రాసువా జిల్లా ఉంది. రాసువా జిల్లా మీదుగానే ఈ యాత్రలకు విదేశీయులు వెళ్తుంటారు. మెరుపు వరదలు వచ్చే ముందు టిమురే, స్యాప్రుబేసి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విదేశీ టూరిస్టులు ఉన్నారు. మానస సరోవర్ యాత్రకు వెళ్తున్న 400 మందికి పైగా యాత్రికులు గల్లంతైనట్లు తెలుస్తోంది. వీరిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు వెల్లడించిన వివరాలప్రకారం ఇప్పటివరకూ 95 మంది మృతిచెందినట్లు తేలింది. వరద ధాటికి భోటేకోశి నది పరివాహక ప్రాంతాలు, నది ఒడ్డున ఉన్న గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. తిమురే బజార్, సరిహద్దు కస్టమ్స్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. వాహనాలు, సరకుల రవాణా వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. గతేడాది వరదల తర్వాత పునర్నిర్మించిన రసువాగఢి ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ కూడా ఈ వరదల్లో తుడిచిపెట్టుకుపోయింది. మూడు నేపాల్ పోలీస్ కార్యాలయాలు దెబ్బతిన్నాయి. టిబెట్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది గల్లంతయ్యారు. వరదల కారణంగా 11 జల విద్యుత్ కేంద్రాలు నాశనమయ్యాయి. సుమారు 430 మెగావాట్ల విద్యుత్ సరఫరా ప్రభావితఎనేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్ జిల్లాల్లో ఒక్కసారిగా నది ఉప్పొంగటంతో అనేక గ్రామాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. మరోవైపు, ఈ నది ప్రవాహం దిగువన ఉన్న భారత్ లోని బీహార్, యూపీల్లోకి వచ్చే ప్రమదం ఉండటంతో ఆయా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కోసి, గండర్ నదుల ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. నేపాల్ జలప్రళయానికి ముందు భూకంపం సంభవించినట్లు తెలుస్తోంది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం, ఈ ఘటనకు సుమారు ఏడు నిమిషాల ముందు 4.4తీవ్రతతో భూకంపం సంభవించింది. ఫ్లాష్ ఫ్లడ్స్‌కు 7నిమిషాల ముందు భూకంప వచ్చినట్లు తెలుస్తోంది. భూప్రకంపనలతో చైనాలోని టిబెట్ ప్రాంతంలోని హిమాలయాల్లో ఉన్న సుప్రాగ్లేషియల్ సరస్సు బద్ధలవ్వడంతోనే ఒక్కసారిగా లెహెండే ఖోలా నదిలో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నదికి దిగువనే ఉన్న భోటేకోశి నదిలోకి నీరు పోటెత్తడంతో వరద విరుచుకుపడింది. ఉత్తరగయ గ్రామీణ మునిసిపాలిటీ ఉపాధ్యక్షురాలు చమేలీ గురుంగ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్యాఫ్రూబెసి, బెత్రావతి, మైలుంగ్, సల్లెతార్, శాంతిబజార్, పైరేబెసి, ఖాల్తీ బస్తీ, సోలే, త్రిశూలి, బట్టార్ వంటి దాదాపు డజనుకు పైగా గ్రామాలు ఈ హఠాత్ వరద దాటికి గురయ్యాయి. నేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. ఒక్కసారిగా వచ్చిన మెరుపు వరద నేపాల్‌లోనే గ్రామాలకు గ్రామాలనే కబళించింది. వందలాది మంది గల్లంతయ్యారు. భారత్‌లో కూడా వరద ప్రభావం కనిపించే అవకాశం ఉంది. నేపాల్ ఆర్మీ చీఫ్ వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ ఫ్లాష్ ఫ్లడ్స్ వల్ల సుమారు 4,000 మందికి పైగా ప్రజలు తీవ్రంగా ప్రభావితులయ్యారు. పరిస్థితి అత్యంత గంభీరంగా మారడంతో నేపాల్ రెడ్ క్రాస్ తన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను వెంటనే అప్రమత్తం చేసి, సహాయక చర్యల్లోకి దించింది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. మరోవైపు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, నదీపరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు దూరంగావెళ్లి ప్రభుత్వఆదేశాలను పాటించాలని సూచించారు.

### నేపాల్ ప్రధాని బాలెన్ షా అత్యవసర సమావేశం

నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా పరిస్థితిని సమీక్షించేందుకు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్య బృందాలు, స్కౌట్స్, రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. నేపాల్ పోలీసులు ప్రజలను నదీ పరివాహక ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. భోటెకోషి నదిలో టిబెట్ వైపు నుంచి భారీగా వరద నీరు ప్రవేశించడంతో త్రిశూలి నది పరివాహక ప్రాంతంలోని నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా తదితర జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

### నేపాల్ ప్రధానికి ప్రధాని మోడీ ఫోన్

నేపాల్ వరద విధ్వంసంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షాకు, భారత ప్రధాని నరేంద్రమోడీ ఫోన్ చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల సంతాపం తెలిపారు. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా సహాయం, సహాయక మద్దతు అందిస్తామని మోడీ హామీ ఇచ్చారు. భారత్ ఖాట్మండులో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

### యుపి, బీహార్ రాష్ట్రాలకు రెడ్ అలర్ట్...

నేపాల్ వరదలు భారతదేశంలో భయాన్ని పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా బీహార్ రాష్ట్రానికి పెను ప్రమాదం పొంచిఉంది. నేపాల్ వరదలకు కారణమైన భోటేకోశి నది టిబెట్‌లో పుట్టి నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశిస్తుంది. బీహార్‌లో దీనిని కోసి నదిగా పిలుస్తారు. కోసి నదిని బీహార్ దుఃఖదాయినిగా పిలుస్తారు. ఈ నది కారణంగా బీహార్ ప్రాంతంలో తరుచుగా వరదలు రావడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది. నేపాల్ వరదల నేపథ్యంలో బీహార్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేపాల్ నుంచి భారత మైదాన ప్రాంతాల్లోకి ప్రవేశించే నదుల్లో గండక్(నారాయణి), కోసి నదుల ఉన్నాయి. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చైదరి మాట్లాడుతూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సీఎస్, డీజీపీలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అవసంమైతే ప్రభావిత ప్రాంతాలకు తానే వెళ్తానని చెప్పారు. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని మహారాజగంజ్, కుషీనగర్ జిల్లాలను అప్రమత్తం చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. గండక్, నారాయణి నదులకు వరద పెరిగే అవకాశం ఉంది.

నేపాల్‌లో వరదల వల్ల జరిగిన విధ్వంసం ఆందోళనకరంగా ఉందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గండక్, నారాయణి నదులలో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున, మహారాజ్‌గంజ్, కుషినగర్‌లోని స్థానిక యంత్రాంగాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులను ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని యోగి ఆదిత్యనాథ్ కోరారు.

వార్త

మౌనం మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తుంది. విశ్రాంతిని మించిన ఔషధం లేదు.

న- బార్బడోస్


# ప్రాణాలతో చెలగాటమేనా?

విశ్వామిత్ర సృష్టిలో తాము కూడా చేరిపోవాలని నకిలీ డాక్టర్లు ఉవ్విళ్లూరుతున్నారు. కానీ కర్మవశాన వారిలో కొందరు దొరికిపోయారు. హైదరాబాద్ సిటీలో తాజాగా 12 మంది నకిలీ డాక్టర్లు అరెస్టవడం జనం కలవరపడే విషయం. కేవలం నర్సుగానో, కాంపౌండరుగానో ఉన్న పూర్వ అనుభవంతో డాక్టర్‌గా ప్రాక్టీసు మొదలెట్టే ఆర్‌ఎంపిల గూర్చి తెలుగు రాష్ట్రాలకు బాగా తెలిసిందే. వాళ్లే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లుగా చలామణి అయిపోతున్నారు. అసలు సిసలు డాక్టరు కోర్సులు కోట్లాది రూపాయలు పెట్టి చదివినవారెవరూ గ్రామీణ ప్రాంతాలకు ప్రాక్టీసు చేయరు. బహు అరుదు. గ్రామీణ ప్రాంతాల్లో తీసుకోదగిన ఫీజులూ తక్కువే. ఆధునిక వైద్య పరిజ్ఞానంతో రూపొందించబడిన వైద్య చికిత్సా పద్ధతులు, పెద్దపెద్ద ఖరీదైన విదేశీ ఎం.ఆర్.ఐ డయాగ్నస్టిక్ విధాన పరికరాలను తెచ్చి పెట్టుకోవాలని ఏ డాక్టరూ సాహసించరు. అందుకే ఏ వృక్షమూ ఎదగని చోట ఆముద వృక్షమే మహావృక్షమన్న చందాన గ్రామీణ ప్రాంతాల అత్యవసర వైద్యానికి అందుబాటులో ఉండేది ఆర్‌ఎంపి డాక్టర్లే అన్న నిజం అందరికీ తెలిసిందే. అయితే వారు చేసిన వైద్యం వికటించిన సందర్భాలు లేకపోలేదు. కొన్నిసార్లు అనవసర వైద్య చికిత్సల్లో చేయిపెట్టి తర్వాత క్రిమినల్ కేసులు, ఇతరత్రా సంబంధిత చిక్కుల్లో ఇరుక్కుపోవడం చూస్తూనే ఉన్నాం. రానురాను ఈ కాంపౌండర్ డాక్టర్ల ధోరణిలో పట్టు తప్పిపోవడం గమనిస్తేనే ఉన్నాం. హైదరాబాద్ నగరంలో ఎంతో విచిత్రంగా 'అర్హతలేని నకిలీ డాక్టర్ల' వ్యవస్థ ఒకటి చాన్నాళ్లుగా వేళ్లూనుకుపోయి ఉంది. తాజాగా కొంతమంది నకిలీ డాక్టర్లను సిటీ పోలీసులు పట్టుకుని వారి గుట్టువిప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంపౌండరుగా ఉన్న అనుభవంతో ఆడపాదడపా అత్యవసర చికిత్సకు అందుబాటులోకి రావడమనే యోచనకు భిన్నంగా కొంతమంది అసలుసిసలు ఎంబిబిఎస్ డాక్టర్ల వలె నకిలీ డిగ్రీలతో క్లినిక్‌లు నడపడం ఒక ఎత్తయితే, సిటీలో తెల్లకోటు వేషాలతో నిరంతరం పేషంట్ల సేవలో తరిస్తున్న వారూ లేకపోలేదు. అన్నీ మంచిగా జరిగినంత సేపు అంతాబాగే, చేసే చికిత్స బెడిసికొట్టిందంటే వారు చేస్తున్న ప్రాక్టీసును స్వాగతించేవారు ఉండరు. హైదరాబాద్ సిటీలో ఈ వారంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 12 మంది నకిలీలను పట్టుకున్నారు. పేషంట్లను నమ్మించి వైద్యసేవలు అందించడమే వారి సేవాదృక్పథం. కొందరైతే భారీ ఎత్తున క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు వారే రోగులకు సెలైన్‌లు ఎక్కించడం, ఇంజెక్షన్లు, మందులు ఇస్తూ అసలు సిసలు డాక్టర్ల వలె రోగులతో కలిసిపోవడం వల్లనే వాళ్లు 'నకిలీ'లనే డాక్టర్లెవరూ అనుమానించే పరిస్థితి రావడం లేదనీ తెలుస్తోంది. పోలీసు రికార్డులు పరిశీలిస్తే 'నకిలీ వైద్యుల నిజస్వరూపం బట్టబయలవుతుంది. 2019లో హైదరాబాద్‌కు వచ్చి అంబర్‌పేటలో క్లినిక్ ప్రారంభించిన రాజుగంగారాం అనే వ్యక్తి 2024లో పట్టు బడ్డాడు. యోగా, నేచురోపతి, ఎమెర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 'డిప్లొమో కోర్సులు చేసినట్లుగా కొన్ని సర్టిఫికెట్‌లున్నప్పటికీ చట్టబద్ధమైన వైద్య డిగ్రీ లేదు. ఈవ్యక్తి ఇలాంటి కేసుల్లో ఇంతకు ముందే రెండుసార్లు అరెస్టయినా, పదే పదే ఆ వృత్తినే చేస్తున్నాడు. ఇలా ఎందుకు జరుగుతోంది అని ఆలోచిస్తే పోలీసుల నిరంతర తనిఖీ లేకపోవడమే. సర్వహంగులూ ఉన్న క్లినిక్‌లలో తమ మేధస్సు అనుభవంతో వైద్యసేవలు అందిస్తున్న మకిలి వ్యవస్థ మరొకటి ఈ వైద్య వ్యవస్థలో ఒకటిగా మనగలుగుతోంది. గచ్చిబౌలిలోని హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ కేంద్రంలో రిసెప్షనిస్ట్‌గా పనిచేసిన అస్లాం షఫీ సయ్యద్ విషయం మరో భయంకర సత్యాన్ని బయటపెడుతుంది. తనే ఓ ప్రసిద్ధి చెందిన 'స్కిన్ డాక్టర్'గా ప్రకటించుకుని ఇంటి వద్దనే 'లైపోమా' చికిత్స మొదలెట్టేసాడు. ఇది మరీ ప్రమాదకరం. రోగికి చికిత్స అందివ్వగల ఏ వైద్య అర్హత అతనికి లేదు. పది మంది తిరిగేచోట వారిని నమ్మిస్తున్న 'క్లినిక్'ను నడుపుతూ ఎవరికీ ఏ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారంటే తప్పు అతనిది కాదు. నిరంతర నిఘా వ్యవస్థ నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనం. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌న రికార్డులు పరిశీలిస్తే మరికొన్ని 'క్వాక్' క్లినిక్‌ల బండారం బయటపడ్తోంది. 2025 మే 21న రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 'క్వాక్' క్లినిక్‌ల మీద దాడి చేసి లైసెన్స్ లేకుం డా విక్రయిస్తున్న మందుల నిల్వలను కూడా పట్టు కున్నారు. అంతకన్నాముందు 2024జనవరి నుంచి 'క్వాక్' క్లినిక్‌లను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఈ తరహా 'క్లినిక్'ల నిర్వహణ యాజమాన్యం ఏమాత్రం తగ్గలేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో కూడా ప్రభుత్వ నిఘా, తనిఖీ చర్యల్లో డొల్లతనం చెప్పుకోవాల్సిందే. ఒక నకిలీ డాక్టర్ తనకున్న అనుభవం చాలక వైద్యచికిత్సల్లో చేయిపెడితే మనిషి చూపుపోవచ్చు. అవయవాలు నిరుపయోగం కావచ్చు. పనిచేయకపోవచ్చు. ఏమాత్రం వ్యవస్థ పట్ల భయం లేకుండా రోగి వైద్యంలో ఏదైనా తేడా జరిగి పట్టుబడితే శంకరగిరి మాన్యాలు తప్ప వని గానీ, శ్రీకృష్ణ జన్మస్థానా న్ని చూడాల్సి వస్తుందని తప్పవని ఎందుకు భయం వేయదో అర్థంకాదు. వారికి చట్టం అంటే భయం లేదని అనుకోవాలా? తమనెవరూ పట్టుకోలేరని భ్రమలో ఉంటారా? అందుకే ఇలాంటి క్లినిక్‌లపై నిరంతర నిఘా ఉంచటం అవసరం. ఈ నకిలీ డాక్టర్లు తమకున్న చిన్న పాటి అనుభవంతో క్లినిక్‌లు తెరవడమే కాకుండా తాము చేసే చిన్నాచితక వైద్యంలో పరిస్థితులు చేయిదాటిపోతే ఆయా పేషంట్లను ఏదో చెప్పి కార్పొరేట్ ఆసుపత్రులకు పంపేస్తున్నారు. ఆ మాత్రపు ఆర్థిక స్తోమత లేకనో, దగ్గర్లో ఉన్న ఆర్‌ఎంపిలనో 'క్వాక్' క్లినిక్‌లనో ఆశ్రయించే సాధారణ రోగులకు ప్రాణం మీదకు వస్తే కార్పొరేట్ ఆసుపత్రులు కూడా తమకున్న పరిధిలో కాపాడలేకపోవచ్చు. మరి వారి ప్రాణాలు గాలిలో



స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

రమణమహర్షి



ఈ లోకానికి కొత్తవాళ్లంగా వస్తాం, అతిథుల్లా ఉంటాం, స్నేహితుల్లా వెళ్లిపోతాం.

రవీంద్రనాథ్ ఠాగూర్

# ప్రజావాక్కు



### ఆరోగ్యమే మహా భాగ్యం

"అత్యాశతో సంపాదనే జీవితమని భావించిన కొందరు హైరానా పడి సర్వ రోగాలతో సతమౌతుంటారు. కాని అక్రమ సంపాదనకు ఎగబడటం మానరు. ఒక్కొక్కరి మానసిక స్థితి ఒక్కొక్కలా ఉంటుంది. ఆరోగ్యముంటేనే జీవితానికి అందం. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఆరోగ్యం లేని సంపదలెన్నున్నా నిరుపయోగమే. "అజీర్ణే భోజనం విషం' ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, తగినంతనీరు త్రాగాలి, ప్రశాంతమైన నిద్రను పొందాలి. ఇవి శరీరానికి శక్తినిచ్చి, రోగాల నుండి కాపాడతాయి. ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ సమతుల ఆహారంలో భాగంగా తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తృణధాన్యాలు తీసుకొని జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. రోజుకు తగినన్ని నీళ్ల త్రాగడం ద్వారా శరీరం హైడ్రేటిక్‌గా ఉంచుకోవచ్చు. ప్రతిదినం నడక లేక ఇష్టమైన పనులతో శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. 7నుంచి 8గంటల గాఢమైననిద్ర ఉండేలా చూసుకోవాలి. ధ్యానంతో మనసును ఏకాగ్రతలోకి తెచ్చుకోవచ్చు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ ప్రజల సమిష్టి బాధ్యతని ప్రజలు, పౌరులు కలిసిఆకుపచ్చ గ్రామాలుగాపట్టణాలలో మొక్కలు నాటడం, ఇంటింటికి తిరిగి బట్టల సంచులు పంపిణీ చేయడం వంటి పనులు చేయాలి. దీంతో భావితరాలకు మంచి వాతావరణం అందించటంతోపాటు ప్రస్తుత వాతావరణం కాలుష్యం నివారణతో పాటు, వర్షాలు పడి పాడి పంటలతో సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రతి మనిషి సుమారు 7నుంచి 8మొక్కలునాటితే వారికి జీవితాంతం సరిపోయే ప్రాణవాయువు లభిస్తుంది.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామ సభలు నిర్వహించాలి

గ్రామంలోని సమస్యల దృష్ట్యా ప్రతి గ్రామంలో రెండు నెలలకొకసారి గ్రామ సభ ఏర్పాటు చేయాలి. ఏదేని కారణాల దృశ్య వాయిదాపడినా తిరిగి వారంలోగా నిర్వహించాలి. గ్రామసమస్యలను ప్రజలతో చర్చించి సమస్యలను అధిగమించే విధంగా కృషి చేయాలి. ఎవరైనా గ్రామ పంచా యతీ కార్యదర్శి గారు ప్రజల మౌనాన్ని ఆసరాగా చేసుకోవద్దు. ఎక్కడైనా జరిగితే ఫిర్యాదు చేయండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### నైపుణ్య విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో యువత, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వడం సమయోచితమైనదే. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల స్వరూపం కూడా వేగంగా మారుతోంది. ఈమార్పులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం ఇప్పుడు విద్యా వ్యవస్థ ముందున్న ప్రధాన బాధ్యత. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న వేగానికి, కార్మికుల నైపుణ్యాలు కూడా సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు అవసరం. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, శిక్షణ సంస్థలు కలిసి కోర్సుల రూపకల్పనలో భాగస్వాములుకావాలి. పుస్తక పరిజ్ఞానంతోపాటు ప్రాయోగిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం యువతకు అందాలి. అప్రెంటిస్‌షిప్‌లు, ఉద్యోగ ప్రదేశంలో శిక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడంతో ఉపాధికి మారేదశను సులభతరమవుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భక్తి,భుక్తి

ప్రసాదం చేతిలోపడగానే మహాప్రసాదం స్వామి అంటూ కళ్ల కద్దుకుని నోట్లో వేసుకోవడం ఆనవాయితీ. మనదగ్గర ఉన్నన్నిదేవాలయాలు ఇతర దేశాలలో లేవంటే అతివయోక్తి కాదు. నిత్యం భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్న వారు కోకొల్లలు. దేవునిసన్నిధిలో సంప్రదాయానికి పెద్దపీట. రద్దీకి మారు పేరుగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల నిత్యాన్నదానం భక్తులకు వరప్రసాదం అంటే సందేహం లేదు. ఇప్పటికీ శుచి, రుచికి మరోపేరుగా తిరుపతి లడ్డు కొనసాగుతుండడం ఆ వెంకటేశ్వరస్వామి మహిమగా చెప్పుకుంటారు. స్వామివారి దర్శనం తోపాటులడ్డుకోసమై తోపులాట జరిగినసందర్భాలనేకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్య నభ్యసించేలా సహకరించాలి.

- బి. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అభివృద్ధి పరుగులో భద్రతకు బ్రేక్!

**20 నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి. ప్రతి భవనానికి నిర్దిష్ట కాలవ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి, భారీ పెట్టుబడులు రావాలి, ఆకాశహర్మ్యాలు నిర్మించాలి, కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షి తంగా ఉందన్నదే గొప్ప విషయం. అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా గుణపాఠాలు నేర్చుకుని ప్రమాదం తర్వాత చర్యల నుంచి ప్రమాదం రాకముందే నివారణ వైపు హైదరాబాద్ అడుగులు వేయాలి. అదే నిజమైన మహానగర అభివృద్ధి.**

శెట్టే అంజయ్య

హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న మహానగరాల్లో ఒకటి. ఐటీ రంగం, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు నగరాన్ని నిరంతరం విస్తరింపజేస్తున్నాయి. జనాభా పెరుగుతోంది. కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హైరైజ్ భవనాలు వరుసగా వెలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి వేగానికి తగినంతగా భవనభద్రతా వ్యవస్థలు కూడా బలోపేతం అవుతున్నాయా? అన్న ప్రశ్న మాత్రం ఇప్పుడు అత్యంత ఆందోళన కలిగిస్తోంది. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఆగస్టు 22న నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం కేవలం ఒక నిర్మాణ ప్రమాదంగా చూడలేం. ఇది హైదరాబాద్ నగర నిర్మాణ వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఒక భవనం కూలింది. ఇద్దరు ప్రాణాలు పోయాయి. కానీ ఆ భవనం ఎలా నిర్మించబడింది? ఎన్ని అంతస్తులకు అనుమతిఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? నిర్మాణ దశలోనే ఉల్లంఘనలు ఎందుకు గుర్తించబడలేదు? నాలాకు ఆనుకుని నిర్మాణం ఎలా సాగింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. అధికారుల వివరాల ప్రకారం సుమారు 50 చదరపు గజాల స్థలంలో రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి తీసుకుని ఏడంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. రెండు అంతస్తుల నిర్మాణానికి సరిపోయే పునాది, పిల్లర్లపై అదనపు అంతస్తులు నిర్మించడం అంటే భవనం నిర్మాణ సామర్థ్యాన్నే ప్రమాదంలోకి నెట్టడం. అంతే కాదు నాలాలు, డ్రైనేజీ మార్గాలు, వరద ప్రవాహప్రాంతాల సమీపంలో నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రమాదాలకు దారితీయవచ్చు. ఇక్కడ అసలు సమస్య ఒక బిల్డర్ తప్పిదంతో ముగిసిపోదు. అనుమతి ఇచ్చే వ్యవస్థ నుంచి నిర్మాణాన్ని పర్యవేక్షి ంచే వ్యవస్థ వరకు మొత్తం గొలుసును పరిశీలించాల్సిన అవసరం ఉంది. హైద రాబాద్‌లో భవన నిర్మాణాలకు నిబంధనలు లేవని ఎవరూ చెప్పలేరు. భవనం ఎత్తు, స్థలం విస్తీర్ణం, భవన వినియో గం, నిర్మాణ రకం, రహదారి వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ స్టెబిలిటీ వంటి అంశాలపై అనేక నిబంధన లున్నాయి. అవసరమైన చోట సాయిల్ టెస్ట్, స్ట్రక్చరల్ డిజైన్, ఫైర్ సేఫ్టీ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి ప్రక్రియలు కూడా ఉన్నాయి. అయితే సమస్య నిబంధనలు లేకపోవడంలో కాదు. నిబంధనలు అమలు అవుతున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. ఒక భవనానికి రెండు అంతస్తులకు అనుమతి ఇచ్చి, నిర్మాణం ఏడంతస్తులకు చేరుకునే వరకు సంబంధిత అధికారులు గుర్తించకపోతే అది కేవలం యజమాని లేదా బిల్డర్ వైఫల్యమేనా? నిర్మాణ దశలో తనిఖీలు జరగలేదా? జరిగితే ఉల్లంఘనలు ఎందుకు ఆపలేకపోయారు? నోటీసులు ఇచ్చి ఉంటే వాటితర్వాత కూడా నిర్మాణం ఎలా కొనసాగింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియాలి. అంజయ్యనగర్ ఘటన తర్వాత పక్కనే ఉన్న భవనాల భద్రతపై అధికారులు దృష్టి సారించడం స్వాగతించాల్సిన పరిణామమే. ప్రమాదకరంగా ఉన్న మరో భవనాన్ని కూల్చేందుకు చర్యలు చేపట్టడం కూడా అవసరమే. కానీ ఒక ప్రశ్న మాత్రం వెంటాడుతోంది. భవనం కూలిన తర్వాత చుట్టుపక్కల భవనాలను పరిశీలించడంకంటే, ముందుగానే ప్రమాదకర భవనాలనుగుర్తించే వ్యవస్థ ఉండాలి. ఒక నగర పాలక సంస్థ బాధ్యత కేవలం అనుమతులు ఇవ్వడం, పన్నులు వసూలు చేయడం, రోడ్లు వేయడం మాత్రమే కాదు. నగరంలో నివసించే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్య



త. హైదరాబాద్ జనాభా గతదశాబ్దంలో గణనీయంగా పెరిగింది. నగర పరిధిలో లక్షలాది అపార్ట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. ఇంకా భారీ సంఖ్యలో కొత్త యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. హైరైజ్ భవనాల సంఖ్య కూడా నిరంతరం పెరుగుతోంది. ఇది నగర ఆర్థిక అభివృద్ధికి సంకేతం కావచ్చు. కానీ భవనాల సంఖ్య పెరిగే కొద్దీ వాటి భద్రతా తనిఖీల సంఖ్య, నాణ్యత, సాంకేతిక సామర్థ్యం కూడా అదే స్థాయిలో పెరగాలి. ఒక ప్రాంతంలో వందలాది భవనాలు ఉన్నప్పుడు అక్కడి రహదారుల వెడల్పు సరిపోతుందా? అగ్నిమాపక వాహనాలు చేరుకోగలవా? నీటి సరఫరా సరిపోతుందా? డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి ఎంత? పార్కింగ్ పరిస్థితి ఏంటి? భవనం అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేయించేందుకు మార్గాలున్నాయా? వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. నగర అభివృద్ధిని కేవలం చదరపు అడుగుల నిర్మాణంతో కొలవడం ప్రమాదకరం. 2025లోజిహెచ్‌ఎంసి నిర్వహించిన సర్వేలో 428 శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించబడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వాటిలో 297 భవనాలను ప్రమాదకరంగా గుర్తించి ఖాళీ చేయించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 2026 నాటికి ఆ భవనాల్లో ఎన్ని కూల్చివేశారు? ఎన్ని మరమ్మతుచేశారు? ఇంకా ఎన్ని ప్రమాదకరంగానే ఉన్నాయి? ఈ వివరాలను ప్రజల ముందుంచాలి. ఒకసారి సర్వే చేసి జాబితాతయారు చేయడం సరిపోదు. ప్రతి ప్రమాదకర భవనానికి ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థ ఉండాలి. హైదరాబాద్‌లో ప్రతి భవనానికి ఒక డిజిటల్ భద్రతా రికార్డు ఏర్పాటు చేయాల్సినసమయం వచ్చింది. ఆ రికార్డులో భవనం వయసు, అనుమతించిన అంతస్తులు, వాస్తవంగా ఉన్న అంతస్తులు, నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ, ఫైర్ సేఫ్టీ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, నిర్మాణ స్థలానికి సమీపంలోని నాలా లేదా వరద ప్రాంత వివరాలు, గతంలో ఇచ్చిన నోటీసులు, తనిఖీల వివరాలు ఉండాలి. ప్రతి భవనానికి పచ్చ, పసుపు, ఎరుపు అనే మూడు స్థాయిల భద్రతా రేటింగ్ ఇవ్వవచ్చు. పచ్చ కేటగిరీలో ఉన్న భవనాలకు భద్రతా ధ్రువీకరణ ఇవ్వాలి. పసుపు కేటగిరీలో ఉన్న భవనాలకు నిర్దిష్ట గడువు ఇచ్చి లోపాలు సరిచేయించాలి. ఎరుపు కేటగిరీలో ఉన్న భవనాలను తక్షణం ఖాళీ చేయించి, అవసరమైతే కూల్చివేయాలి. భవనం కూలిన ప్రతిసారీ యజమాని లేదా బిల్డర్‌ను అరెస్టు చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి. కానీ అదే సమయంలో వ్యవస్థలో ఎక్కడ వైఫల్యం జరిగిందో కూడా గుర్తించాలి. అనుమతి ఎవరు ఇచ్చారు? నిర్మాణాన్ని ఎవరు పర్యవేక్షి ం చారు? ఉల్లంఘనలు జరిగినప్పుడు ఎవరు గుర్తించారు? గుర్తించిన తర్వాత ఏ చర్యలు తీసుకున్నారు? స్ట్రక్చరల్ ఇంజినీర్ ఇచ్చిన ధ్రువీకరణను ఎలా పరిశీలించారు? స్థానిక స్థాయిలో అధికారుల తనిఖీలు ఎంతవరకు జరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. బాధ్యతను ఒకరి మీదకు నెట్టేసి వ్యవస్థను కాపాడుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రమా దాలు ఆగవు. హైదరాబాద్‌కు ఇప్పుడు కావాల్సిందిప్రమాదం తర్వాత స్పందించే పాలన కాదు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి నివారించే పాలన. 20నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణా లు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి. ప్రతి భవనానికి నిర్దిష్ట కాల వ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి. భారీ పెట్టుబడులు రావాలి. ఆకాశహర్మ్యాలు నిర్మించాలి. కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షి తంగా ఉందన్నదే గొప్ప విషయం.

అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా

# బిసిల లెక్కింపులో ఇంకా వివక్ష తగునా?


కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని దేశ పాలనా వ్యవస్థకు మూల సూత్రంగా ప్రకటించింది. కానీ ఆ సామాజిక న్యాయానికి ప్రాణాధారమైన గణాంకాలవిషయంలోనే దేశం ఇప్పటికీ చారిత్రక లోటుతో ముందుకు సాగుతోంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఇతర వెనుకబడిన తరగతుల (బిసి/ఒబిసి) సంఖ్య ఎంత అన్న ప్రశ్నకు స్వతంత్ర భారతదేశం ఇప్పటికీ ఖచ్చితమైన సమాధానం చెప్పలేని పరిస్థితి దురదృష్టకరం. 1931 తర్వాత తొలి సారిగా 2027 జనగణనలో కుల గణన చేపడుతున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, అదే జనగణన ప్రశ్నావళిలో ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక కోడ్‌లు కేటాయించి, బీసీలకు మాత్రం ప్రత్యేక కాలమ్ ఇవ్వకుండా 'ఓపెన్ కాలమ్'కే పరిమితం చేయడం తీవ్రమైన ఆందోళనలకు తావిస్తోంది. ఇది కేవలంసాంకేతిక లోపమా? లేక సామాజిక న్యాయాన్ని మరోసారి అసంపూర్ణంగా మార్చే పరిపాలనా వైఫల్యమా?అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా బిసి సంఘాలు, సామాజిక విశ్లేషకులు వ్యక్తం చేస్తున్న నిరసనల వెనుక ఉన్న ఆవేదన కూడా ఇదే. దేశంలో సంపూర్ణ కులగణన చివరిసారిగా జరిగింది 1931లోనే. ఆ తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ దేశవ్యాప్తంగా బీసీల సంఖ్యను శాస్త్రీయంగా లెక్కించలేదు. ప్రతి సందర్భంలోనూ అంచనాలపైనే పాలన సాగుతోంది. మండల్ కమిషన్ (1980) జనాభా గణన 1931 డేటాను మూలంగా చేసుకుని ఒబిసిల జనాభా దాదాపు 52శాతం ఉంటుందని అంచనా వేసింది. దీని ఆధారంగానే 27శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. ఎన్ఎస్ఎస్ఓ వివిధ సర్వేలు బీసీ జనాభా 36శాతంనుంచి 46శాతం మధ్య ఉంటుందని పేర్కొన్నాయి. బీహార్ ప్రభుత్వం 2023లో నిర్వహించిన కులసర్వే మాత్రం దేశానికి కొత్త వాస్తవాన్ని చూపించింది. అక్కడ ఒబిసి + ఇబిసి కలిపి 63.13శాతం (ఇబిసి 36.01శాతం,ఒబిసి 27.12 శాతం) ఉన్నారని, ఎస్సీలు 19.65శాతం, ఎస్టీలు 1.68 శాతం, జనరల్ వర్గాలు 15.52శాతం ఉన్నారని తేలింది. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కులగణనలో బిసిల జనాభా దాదాపు 56.33శాతంగా నమోదైంది. కేంద్ర ఒబిసి జాబితాలోనే దాదాపు 2,650 కులాలు ఉండగా, రాష్ట్రాల జాబితాల్లో మరింత ఎక్కువ సంఖ్యలో కులాలు ఉన్నాయి. ఈ గణాంకాలన్నీ అంచనాలు వాస్తవాలకు ప్రత్యామ్నాయం కావని, శాస్త్రీయ గణనద్వారానే నిజమైన సామాజిక నిర్మాణం బయటపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. 2026లో మొదటి దశగా గృహ వివరాల సేకరణ, 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు రెండో దశ జనాభా లెక్కింపు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రశ్నావళిలోని 10వ ప్రశ్న (ఎస్సీ,ఎస్టీ కులాల)లో ఎస్సీ,ఎస్టీలకు డ్రాప్‌డౌన్ ఆప్షన్ ఇచ్చి, మిగిలిన వారందరికీ కులం పేరును స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం కల్పించింది. నమోదు చేసిన కులాల పేర్లను అత్యాధునిక డిజిటల్ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రాష్ట్రాల ఒబిసి జాబితాలతో మ్యాపింగ్ చేసి, బిసిల సంఖ్యను గుర్తిస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ 2011 సామాజిక, ఆర్థిక కులగణనలో దాదాపు 46లక్షల కులాలు, ఉపకులాలు, ఇంటిపేర్లు నమోదై తీవ్ర గందరగోళం ఏర్పడటంతో ఆ డేటాను వినియోగించలేకపోయారు. స్పష్టమైన కాలమ్ లేకుండా మళ్లీ అదేవిధంగా స్వేచ్ఛా నమోదు జరిగితే, లక్షలాది భిన్నమైన నమోదులు రావడం సహజం. అలాంటి సమాచారాన్ని తర్వాత వర్గీకరించడం కంటే, మొదటనుంచే స్పష్టమైన గుర్తింపుతో సమాచారాన్ని సేకరించడమే విశ్వసనీయమైన విధానం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) విద్యా, ఉద్యోగాల్లో వెనుకబడినతరగతులకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తుండగా, ఆర్టికల్ 243(డి), 243(టి) స్థానికసంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారిస్తున్నాయి. అయితే ఈ రాజ్యాంగ హక్కులు సమర్థవంతంగా అమలు కావాలన్నా, నిధుల కేటాయిం పులు, సంక్షేమ పథకాల రూపకల్పన, బిసిసబ్‌ప్లాన్ల అమలు సరిగ్గా జరగాలన్నా విశ్వసనీయ గణాంకాలు తప్పనిసరి. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు జనగణన ఫారంలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వకపోవడం భవిష్యత్ విధానాల విశ్వసనీయతను, సంక్షేమపథకాల పారదర్శకతను దెబ్బతీస్తుంది. జనగణన అనేది కేవలం జనాభా లెక్కింపు కార్యక్రమం కాదు.. అది దేశ భవిష్యత్ విధానాలకు, వనరుల సమానపంపిణీకి, సామాజిక న్యాయ అమలుకు పునాది. 2027 జనగణన రెండో దశ ప్రారంభమయ్యేలోపే కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా పరిగణించాలి. ●

# అణ్వాయుధాల ఆధిపత్యాన్ని నియంత్రించలేమా?


బొల్లిముంత సాంబశివరావు

ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం అంటే, కేవలం భౌగోళికంగా దేశాలను ఆక్రమించుకోవడమేకాదు, సైనిక, ఆర్థిక సాంకేతిక ఆధిపత్యాల ద్వారా ఇతరదేశాలను సామ్రాజ్యవాద దేశాలు తమగుప్పిట్లో ఉంచుకోవడం. ఈ ఆధునిక సామ్రాజ్యవాదానికి అణ్వాయుధాలు అతిపెద్ద ఆయుధాలుగా మారాయి. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు అధికారికంగా అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల తయారీ, నిల్వల్లో రష్యా, అమెరికా అత్యంత అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో ఉన్నమొత్తం అణ్వాయుధాల్లో 90శాతం ఈరెండు దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచంలోనే రష్యా అత్యధికంగా 5,500లకుపైగా అణ్వాయుధాలు కలిగి ఉంది. 5,044 అణ్వాయుధాలతో అమెరికా రెండవస్థానంలో ఉంది. చైనా 540పైగా అణ్వాయుధాలతో మూడవస్థానంలో ఉంది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్‌లున్నాయి. అణ్వాయుధాలపై ఆధిపత్యం కలిగిన దేశాలు ముఖ్యంగా అమెరికా కొత్తగా ఏ దేశం అణుబాంబులుతయారు చేయకుండా అడ్డుకొంటున్నది. ఇది ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. అణ్వాయుధాలతోపాటు ఇతర ఆధునిక ఆయుధాలు కలిగిన అమెరికాకు, ఆధునిక ఆయుధసంపత్తి లేని దేశాలు భయపడాల్సి వస్తున్నది. అసమానతలతో కూడిన ఐక్యరాజ్యసమితి చేసిన అణువ్యాప్తి నిరోధక ఒప్పందం ద్వారా కొత్తగా ఏ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడం, శాంతియుత అవసరాల కోసం మాత్రమే అణుశక్తిని వినియోగించేలా చేయడం ఈఒప్పందం లక్ష ్యంగా ప్రకటించబడింది. ఇది 1970 మార్చి 5నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఐక్యరాజ్యసమితి అణ్వాయుధాలు, అపారసైనిక శక్తి, ఆర్థిక బలం కలిగిన సామ్రాజ్యవాద దేశాలకు ముఖ్యంగా అమెరికా కు వెనుకబడిన దేశాలు లొంగిఉండాలని చెప్పకనేచెబుతున్న ది. ఈ ఒప్పందాన్ని అనేక దేశాలు వ్యతిరేకించాయి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేయకుండా ఒప్పందం నిరోధిస్తున్నప్పుడు, ఏ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండ కూడదు. అమెరికాతోపాటు అణ్వాయుధాలున్న దేశాలన్నీ వాటిని నాశనంచేసే చర్యలు తీసుకోవాలి. కాని అణుఒప్పం దంలో అలాంటి అంశంలేదు. అలాంటప్పుడు ప్రపంచ ప్రజ లకు అణుయుద్ధ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంటుంది. చైనాతోపాటు ప్రపంచదేశాల్లో ఉన్న అణ్వాయుధాలన్నింటిని నాశనం చేద్దాం మావోనాయకత్వాన చైనా ప్రకటించడాన్ని ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. 1945లో అమెరికా అణుబాంబు



తయారు చేసిన తొలిదేశంగా దాని ఆధిపత్యం కొనసాగింది. ఆతర్వాత బ్రిటన్ ,ఫ్రాన్స్, రష్యాలు 1949లో తయారు చేశాయి. అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఎదు ర్కోవడానికి మాత్రమే స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ అణుబాంబు తయారుచేసింది. అమెరికా అణ్వా యుధాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మావో నాయకత్వాన 1964లో చైనా అణుబాంబును తయారుచేసింది. ఆతర్వాత 1974లో భారత్, 1998లో పాక్ అణుబాంబులు తయారు చేశాయి. 2006లో ఉత్తరకొరియా అణుబాంబు తయారీలో విజయవంతమైంది. ఐక్యరాజ్యసమితి ఒప్పందం ప్రకారం అణ్వాయుధాల సంఖ్య కొంత తగ్గినప్పటికీ అమెరికా, రష్యాలు తమవద్ద ఉన్న ఆయుధాలను మరింత అధునాతనంగా, శక్తివంతంగా తయారు చేస్తున్నాయి. ఇందులో అమెరికా అగ్రభాగంలో ఉంది. అలా చేయడం ఐక్యరాజ్యసమితి తీర్మానానికి వ్యతిరేకం. అణు ఉత్పత్తి దేశాలు ముఖ్యంగా అమెరికా, రష్యా దేశాలు అణు పరీక్షలను స్వదేశాల్లో కాకుండా పసిఫిక్ సముద్రంలోని చిన్నదీవుల్లో లేదా తమ ఆధీనంలోని వలస ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఆయాప్రాంతాల్లో పర్యావరణం నాశనం కావడం, రేడియేషన్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. ముఖ్య అణ్వాయుధాల దేశాలు నేరుగా యుద్ధాలకు తలపడితే పరస్పరం వినాశనం జరుగుతుందని వాటికితెలుసు. అందుకే అలా తలపడటం లేదు. తమ సామ్రాజ్యవాద విస్తరణ కోసం ఆసియా, ఆఫ్రికా మధ్య ప్రాచ్యంలోని చిన్నదేశాలను వేదిక చేసుకుని యుద్ధాలు జరుపుతున్నాయి. జపాన్లోని హిరోషిమా, నాగసాగిపై అణుబాంబుదాడి ద్వారా సోవియట్యూనియన్‌కు తన సైనిక శక్తిని చూపి భయపెట్టడానికేనని రాజకీయవేత్తలు చెప్పారు. కాని సోవియట్యూనియన్‌కే అమెరికా భయం కలిగించింది. ఇరాక్ వద్ద సామూహిక వినాశకర ఆయుధాలు ఉన్నాయనేఅబద్ధపు నెపంతో అమెరికా ఆదేశంపై దాడిచేసి సద్దాంహుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను ఉరితీసింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు 800లకుపైగా సైనిక స్థావరాలున్నాయి. రష్యా సరిహద్దులకు సమీపంలోనూ, వ్యూహాత్మక సముద్ర మార్గాల్లోను ఈసైనిక స్థావరాలు ఏర్పాటు చేసింది. అణ్వాయుధాలను అగ్రరాజ్యాలను నియంత్రించడంలో ఐరాస వైఫల్యానికి ప్రధానకారణం వాటి రాజకీయ ఆధిపత్యం, భద్రతా మండలి ఏర్పాటులో ఉన్నలోపాలే కారణం. ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధవ్యాప్తిని అరికట్టడానికి ఐక్యరాజ్య సమితిలో అనేక ఒప్పందాలు జరిగినా అవి ఆయుధ పోటీని ఆపడంలో వైఫల్యం చెందాయి. అణ్వాయుధ యుద్ధ ప్రమాదాల భయం లేకుండా ప్రపంచదేశాల ప్రజలు ఉండాలంటే, అణ్వాయుధాల తయారీకి వ్యతిరేకంగానే కాకుండా, అవి ఉన్న అన్నిదేశాల్లో ప్రజలకు ప్రమాదం రాకుండా చాలా జాగ్రత్తగా నాశనం చేయాలి. అలా జరగాలంటే ప్రపంచ ప్రజలందరూ సామ్రాజ్య వాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదా

## తెనాలిలో శుక్రవారం మంత్రి నాదెండ్ల ఆధ్వర్యంలో గ్రీవెన్స్



**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 26(ప్రభాతవార్త):** ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమములో భాగముగా 28వ తేదీ శుక్రవారము ఉదయం గం. 10.00 ల నుండి మధ్యాహ్నం గం.01.00 ల వరకు తెనాలి పురపాలక సంఘ కార్యాలయ భవనము ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ వద్ద, స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార,పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యములో ప్రజాఫిర్యాదులు స్వీకరించు కార్యక్రమము ఏర్పాటు చేయడమైనదని,కావున తెనాలి నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను మంత్రి మనోహర్ మరియు అధికారుల దృష్టికి తీసుకోనిరావలసినదిగా కోరడమైనదని మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమములో గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్, రెవిన్యూ డివిజినల్ అధికారి, మరియు ఇతర నియోజకవర్గ అధికారులు పాల్గొనెదురని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగించుకోవాలని కమీషనర్ తెలిపారు.

# గుంటూరు వార్త

## వ్యక్తి అనుమానాస్పద మృతి



**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 26(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని నాజరు పేట,అరవింద స్కూల్ సమీపంలో కార్పెంటర్ సువర్ణ రాజు(44) అనే వ్యక్తి మంగళవారం తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఊపిరి ఆడట్లేదు అంటూ భార్య మాధవి అతని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన తెనాలి వన్ టౌన్ పోలీసులు, మృతుడి తల వెనుక బలమైన గాయం మెడపై బిగించినట్లు ఆనవాళ్ళని గుర్తించిన పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నారు.విచారణలో భాగంగా మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మృతునికి ఎవరితో వివాదాలు లేవని అందరితో సఖ్యతగా ఉంటాడని తన పనేదో తను చూసుకుంటూ వివాదరహితుడిగా పేరు ఉందని స్థానికులు తెలిపారు.

## పోలీసుల పేరుతో అక్రమ వసూలుకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

**తెనాలి ఆగస్ట్ 26(ప్రభాతవార్త):** పోలీసులమని పేరు చెప్పి తాకట్టు వ్యాపారి వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని తెనాలి టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. టూ టౌన్ సిఐ రవీంద్రబాబు కథనం ప్రకారం, పట్టణంలోని గంగా నమ్మపేటలో తాకట్టు వ్యాపారం నిర్వహించే రవికుమార్ అనే వ్యక్తిని తెనాలి మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన నూతలపాటి రత్నబాబు అనే వ్యక్తి పలుమార్లు పోలీసులమని పేరుతో దశల వారీగా వ్యాపారి వద్ద నుండి సుమారు 6.80 లక్షలరూపాయలకు పైగా వసూళ్లు చేశాడు. అది చాలక ఇంకా అదనపు డబ్బు కోసం, జిల్లా ఎస్పీ, సీఐ పేర్లు చెప్పి వేధిస్తుండడంతో సదరు వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిఘబెట్టిన టూ టౌన్ పోలీసులు నిందితుడని అరెస్టు చేసి, నిందితుడి వద్ద నుండి రూ.40 వేల నగదును స్వాదీనపరచుకుని,కోర్టులో హాజరు పరిచామని సీఐ తెలిపారు.



## సుస్థిర పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

### సొలసలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసిన ఎంపీ లావు,ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**యడ్లపాడు,ఆగస్టు 26,ప్రభాతవార్త :** యడ్లపాడు మండలం సొలస గ్రామంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సుస్థిర



పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందని, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.వైకాపా పాలనలో అధ్వానంగా మారిన రహదారులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను గతంలో కంటే రెట్టింపు స్థాయిలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. చౌడవరం నుంచి కొండవీడుకు నూతన రహదారి నిర్మాణానికి త్వరలో అనుమతులు వస్తాయని వెల్లడించారు. చారిత్రక కొండవీడు అభివృద్ధి చెందితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యే గ్రామంలో ర్యాలీగా పర్యటించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. నక్కవాగుపై రూ.3.80 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెన, రూ.32 లక్షలతో నిర్మించనున్న నూతన పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో చేపట్టనున్న ప్రహరీగోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే ఎస్సీ కాలనీలో రూ.16 లక్షలతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల మరమ్మతు పనులను, రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దూరి వీరారెడ్డి, నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, కామినేని సాయిబాబు, తోకల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అర్చకులు సస్పెన్షన్

### -ఉప కమీషనర్ గోగినేని లీలా కుమార్

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవాలయానికి సంబంధించిన పలువురు అర్చకులను సస్పెండ్ చేస్తూ దేవాలయం ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవాలయంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారికి సంబంధించిన బంగారపు మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో బాధ్యాతారాహిత్యం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర ప్రాథమిక కారణాలపై ఆ సమయంలో విధుల్లో ఉన్న ఐదుగురు అర్చకులపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. సస్పెండ్ అయిన వారిలో ఉప ప్రధాన అర్చకుడు చదలవాడ జాలయ్య, అర్చకులు పొత్తూరి విజయప్రతాప్, కుందుర్తి విశ్వనాథ్, చదలవాడ రుద్ర గాయత్రి మణికంఠశాస్త్రి, కాంట్రాక్టు అర్చకుడు గర్నెపూడి గిరికుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

## ప్రజా సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా జనవాణి

### -ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

**మంగళగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్



డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం ఉదయం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను తెలియజేశారు.ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు స్వీకరించారు.ప్రజలు వివరించిన సమస్యలను ఆయన సావధానంగా విని, ఆయా సమస్యలపై వెంటనే స్పందించారు. సంబంధిత జిల్లాల అధికార ప్రతినిధులతో చర్చించి, సమస్యలను పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూకూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం లభించే వరకు అవసరమైన విధంగా సమన్వయం చేస్తున్నామని చిల్లపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల జనసేన పార్టీ అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు, దుగ్గిరాల మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఈమని1 ఎంపీటీసీ పసుపులేటి సాయి చైతన్య, లీగల్ సెల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి,చదలవాడ

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** మానవతామూర్తి మదర్ థెరిస్సా 116వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కాంపౌండర్స్, నర్సెస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, చదలవాడ అరవిందబాబులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా ప్రపంచానికి



అందించిన సేవల్ని వారు స్మరించుకున్నారు. మదర్ థెరిస్సా జీవితం సేవ, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిశిదిది కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ గారు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెల్లూరి సదాశివరావు గారు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా గారు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫ్ఫాని గారు, పట్టణ పార్టీ అధ్యక్షులు పటాన్ సమద్ ఖాన్ గారు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దు మాల రవి గారు పలువురు పాల్గొన్నారు.

## మాచర్లలో అవినీతి మూకకు

# అడ్డుకట్ట ఎప్పుడో..?

**మాచర్ల టౌన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే అవినీతి ఆరోపణలు వినిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మాచర్ల పట్టణంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాసేవ కంటే 'వసూళ్ల వ్యవస్థ బలపడుతోందనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.తమ సమస్యను పరిష్కరించుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్య ప్రజలకు నిబంధనలు,పత్రాలు,కొర్రీల పేరుతో పనులు ఆలస్యం చేస్తున్నారని, చివరకు మధ్యవర్తులను ఆశ్రయిస్తేనే పనులు సాఫీగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పని ఒకటి..కొర్రీలు పది!..**

ప్రభుత్వ కార్యాలయానికి ఒక పనిపై వచ్చే ప్రజలకు మొదట అవసరమైన పత్రాల వివరాలు చెప్పకుండా, దరఖాస్తు ప్రక్రియలోకి వెళ్లిన తర్వాత ఒక్కోసారి ఒక్కో కొత్త పత్రం అడుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకసారి కార్యాలయానికి వెళ్లిన వ్యక్తిని మరో పత్రం కోసం వెనక్కి పంపడం,మళ్లీ వచ్చిన తర్వాత ఇంకో కారణం చెప్పడం,ఇలా పని రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల ప్రజలు విసిగిపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు.నిజంగా అదనపు పత్రాలు నిబంధనల ప్రకారం అవసరమైతే వాటిని మొదటి దశలోనే స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. కానీ పని ఆలస్యం చేయడానికి కొర్రీలు పెడుతున్నారనే ఆరోపణలు నిజమైతే అది ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా అధికార వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.

**మధ్యవర్తి వస్తే పని సులువా?**

కొన్ని కార్యాలయాల్లో సామాన్యుడు నేరుగా తన పని చేయించుకోవడం కష్టంగా మారి, మధ్యవర్తుల ద్వారా వెళ్తే మాత్రం పనులు వేగంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దరఖాస్తు నుంచి ఫైల్ కదలిక వరకు ప్రతి దశకు ఒక 'రేట్లు నిర్ణయించినట్లుగా వ్యవహారం సాగుతోందనే విమర్శలు ఉన్నాయి.అయితే ఇవి తీవ్రమైన ఆరోపణలు కావడంతో సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉంటుంది.

**ప్రజల పన్నులతో జీతాలు.. ప్రజల నుంచే వసూళ్లా?**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, కార్యాలయ నిర్వహణకు అయ్యే ఖర్చులు ప్రజలు చెల్లించే పన్నుల నుంచే సమకూరుతాయి.ప్రజలకు నిష్పక్షపాతంగా,పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఉద్యోగ వ్యవస్థపై అవినీతి ఆరోపణలు రావడం సహజంగానే ఆందోళన కలిగించే అంశం.ఒక సామాన్య వ్యక్తి తన భూమి,ఇంటి, ధ్రువపత్రం,పింఛన్,రెవెన్యూ లేదా ఇతర ప్రభుత్వ సేవకు సంబంధించిన పనితో కార్యాలయానికి వస్తాడు. అతడికి నిబంధనలు




తెలియకపోవచ్చు.అదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే..ఆ వ్యక్తి ఎవరిని ఆశ్రయించాలి? ఫిర్యాదు చేస్తే తన పని మరింత ఆలస్యం అవుతుందనే భయంతో మౌనం వహిస్తే..అతని సమస్యకు పరిష్కారం ఎక్కడ?

**చేతులు తడిపితేనే ఫైల్ కదులుతుందా?**

చేతులు తడిపితేనే పని కదులుతుంద్నే అనే భావన ప్రజల్లో ఏర్పడితే అది ఒక్క ఉద్యోగి ప్రతిష్ఠకే కాదు,మొత్తం ప్రభుత్వ వ్యవస్థ విశ్వసనీయతకే నష్టం.ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలకు అందుబాటులో ఉండే సేవా కేంద్రం కావాలి.అధికారులు,సిబ్బంది ప్రజల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే విధంగా పారదర్శక వ్యవస్థ ఉండాలి.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..**

మాచర్లలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి,అక్రమ వసూళ్లకు సంబంధించి వినిపిస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు

> ప్రజాసేవా కేంద్రాలా.. అవినీతి అడ్డాలా?
>
> పని కోసం వచ్చే సామాన్యుడికి కొర్రీలు..
>
> మధ్యవర్తుల ద్వారా వసూళ్ల ఆరోపణలు..
>
> ప్రభుత్వ కార్యాలయాల తీరుపై పెరుగుతున్న విమర్శలు...
>
> సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్..

కోరుతున్నారు.అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించాలని సూచిస్తున్నారు. మధ్యవర్తుల పాత్రపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా అనుమతి లేని వ్యక్తులు ఏ విధంగా ప్రజల పనుల్లో జోక్యం చేసుకుంటున్నారు? వారి వెనుక ఎవరి అండ ఉంది? దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో నిజమెం? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిగితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

**ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం కావాలి...**

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఫిర్యాదుల కోసం స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. అధికారిక ఫీజులు, అవసరమైన పత్రాలు,పని పూర్తయ్యే గడువు వంటి వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శిస్తే ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది.ప్రతి దరఖాస్తుకు రసీదు ఇచ్చి,దాని ప్రస్తుత స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించాలి.అలాగే అవినీతి ఆరోపణలపై ఫిర్యాదు చేసే ప్రజలకు రక్షణ, గోప్యత కల్పిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

**అవినీతి ఆరోపణలకు చెక్ ఎప్పుడు?**

ప్రజాసేవ పేరుతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు భరోసా కల్పించాల్సిందే తప్ప భయాన్ని కలిగించే కేంద్రాలుగా మారకూడదు. కొందరి వ్యవహారశైలి కారణంగా మొత్తం ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థపై మచ్చ పడకూడదంటే ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది.మాచర్లలో ప్రభుత్వ కార్యాలయాల్లో వినిపిస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిగ్గుతేల్చాలని,ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజాసేవ పేరుతో..'వసూళ్ల సేవ' సాగుతుందా?ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కార్యాలయాల్లోనే కొర్రీల రాజ్యం ఎందుకు?మధ్యవర్తుల వ్యవస్థపై ఉన్నతాధికారులు ఎప్పుడు దృష్టి సారిస్తారు?అవినీతి ఆరోపణలకు అడ్డుకట్ట వేసేందుకు 'కొరడా' ఎప్పుడు ఝుళిపిస్తారు?ఈ ప్రశ్నలకు అధికారులు ఇచ్చే సమాధానమే.. మాచర్ల ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలకు తెరదించగలదు.

## పొన్నాల కాలువ హత్య కేసులో నాలుగు నెలలైనా చిక్కని తీగ.. తెగని ముడి!

- అనేకమంది అనుమానితుల విచారణ..
- తేలని హంతకుల గుట్టు
- పోలీసుల దర్యాప్తులో వినూత్న కోణాలు

**కర్లపాలెం,ఆగస్టు26,ప్రభాతవార్త.**

కర్లపాలెం మండలం నర్రావారిపాలెం పంచాయతీ పరిధిలోని పొన్నాల కాలువ వద్ద నాలుగు నెలల క్రితం వెలుగుచూసిన దారుణ హత్య ఉదంతం ఇప్పటికీ పోలీసులకు పెద్ద సవాలుగానే మిగిలింది.గుర్తుతెలియని మహిళను అత్యంత కిరాతకంగాహత్య చేసి,గోనె సంచిలో కట్టి పొన్నాల కాలువ వంతెన వద్ద పడేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే.రొయ్యల చెరువుల ఇంజన్ ఫుట్ బాల్ ముళ్ల కంపకు ఆ సంచి చిక్కుకోవడంతో మృతదేహం పైకి తేలి వెలుగులోకి వచ్చింది.ఈ దారుణంపై జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ చంద్రమౌళి,సీఐ హరికృష్ణ,కర్లపాలెంఎస్ఐ రవీంద్రల నేతృత్వంలోని ప్రత్యేక బృందం నాలుగు నెలలుగా జల్లెడ పడుతోంది.



**అనుమానితుల విచారణ.. మిస్సింగ్ కేసుల నిగ్గు తేల్చినా..**

కేసు విచారణలో భాగంగా పోలీసులు అనేకమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు.ఈ ప్రక్రియలో చిన్న చిన్న గొడవలతో ఇళ్లు వదిలి వెళ్లిన పలువురు మహిళలను,అమ్మాయిలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.అయితే,ఇంతమందిని విచారించినా ఈహత్యకు సంబంధించి కనీసం ఒక్క ఆధారమూ లభించకపోవడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేస్తోంది.హత్య చేసిన తీరును బట్టి ఇది పక్కా ప్రొఫెషనల్ ముఠా చేసిన పని అయి ఉంటుందని భావిస్తున్నారు.

సందులన్నీ వెతికేశారు.జాతీయ రహదారి 216 పరిధిలోని అన్ని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు.సెల్ ఫోన్ టవర్ లోకేషన్ల ఆధారంగా వందలాది కాల్ డేటాను విశ్లేషించారు.వేరే ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ తెచ్చి పడేశారా?లేక ఇక్కడే హత్య చేశారా?అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.ఒకవేళ దూరప్రాంతం నుంచి తెచ్చి పడేయాలనుకుంటే.బాపట్ల వైపు నాగరాజు కాలువ (నల్లమడ కాలువ),బుద్ధం వైపు తుంగభద్ర కాలువలు ఉన్నాయి.వాటన్నింటినీ దాటుకుని,పొన్నాల కాలువ వరకు తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందనేది మిస్టరీగా మారింది.అలాగే సముద్రంలో పడేయడానికి పెదపులుగువారిపాలెం రోడ్డు సౌకర్యంగా ఉన్నప్పటికీ,కేవలం పొన్నాల కాలువనే ఎంచుకోవడం వెనుక ఉన్న మర్మమేమిటో తేల్చే పనిలో పడ్డారు.

**ఆక్వా కంటైనర్ల కోణంపై నిఘా:**

నర్రావారిపాలెం, తుమ్మలపల్లి ప్రాంతాల్లో ఆక్వా సాగు ఎక్కువ. చెన్నై, నెల్లూరు, భీమవరం తదితర ప్రాంతాల నుంచి మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే ఐస్ బాక్సులతో కూడిన కంటైనర్లు రొయ్యల కొనుగోలుకు వస్తుంటాయి. వేరే ప్రాంతంలో హత్య చేసి, ప్రాసెస్ చేసిన కంటైనర్లలో మృతదేహాన్ని ఇక్కడికి రవాణా చేసి పడేశారా అనే కోణంలోనూ విచారణ జరిపితే క్లూ లభించే అవకాశముందని భావిస్తున్నారు. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర మాత్రం కేసును కొలిక్కి తెచ్చేందుకు దృఢ సంకల్పంతో శ్రమిస్తున్నారు. ఈ మిస్టరీ ఎప్పుడు వీడుతుందా అని స్థానికులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు

## 28న సామూహిక ఉచిత కుంకుమార్చనలు : ధర్మకర్తల మండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి అమ్మవారికి ఈ నెల 28వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా తెలిపారు. శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా సామూహిక ఉచిత కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10గంటలకు కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు చేసుకొనేందుకు 9652064685కు ఫోన్ చేయాలని సూచించారు.

## మూడు పంచాయతీల్ని అభివృద్ధి బాట పట్టిస్తాం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** గత పాలకుల అనాలోచిత విధానాలు, దోపిడీ చర్యలతో అభివృద్ధికి దూరమై, కనీస అవసరాలకు నోచుకోని ప్రజల వెతలకు హైకోర్టు తీర్పుతో పరిష్కారం లభించిందని, కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టినందునే మూడు గ్రామాల విలీన సమస్య సమసిపోయిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.పసుమర్రు, గణపవరం, మానుకొండవారి పాలెం గ్రామాలను తిరిగి పంచాయతీలుగా గుర్తిస్తూ, గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేస్తూ మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలోఆయా గ్రామాల ప్రజలు, గ్రామానికి చెందిన కూటమి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా ప్రత్తిపాటిని కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు ప్రత్తిపాటిని సన్మానించి, తమ గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. గత పాలకుల స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో మూడుగ్రామాల ప్రజలు నానా అవస్థలు పడ్డారుగత అవినీతి ప్రభుత్వం, నాటి అసమర్థ పాలకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం నిర్ద్వందంగా తిరస్కరించడం శుభ పరిణామమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. చిలకలూరిపేట మండలంలోని పసుమర్రు, మానుకొండవారిపాలెం, నాదెండ్ల మండలం గణపవరం గ్రామాల్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం నాటి పాలకులు చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేశారన్నారు. ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా జగన్ సర్కార్ అనాలోచితంగా వ్యవహరించిందన్నారు. దాంతో మూడు గ్రామాల ప్రజలు ఆరేళ్లుగా అనేక అవస్థలు పడ్డారని, అటు మున్సిపాలిటీ గుర్తింపులేక, ఇటు పంచాయతీలకు నిధులు రాక, కనీస వసతులకు దూరమయ్యారని ప్రత్తిపాటి తెలిపారు. నాటి అవినీతి పాలకులు



కేవలం దోపిడీ కోసమే వెనకాముందూ ఆలోచించకుండా మూడు గ్రామాల్ని హడావుడిగా మున్సిపాలిటీలో విలీనం చేశారని, చట్టబద్ధంగా సజావుగా చేపట్టాల్సిన విలీన ప్రక్రియను మొక్కుబడి తంతుగా నిర్వహించి, ప్రజల్ని కష్టాలపాలు చేశారని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయా గ్రామ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, అభ్యర్థనల మేరకు, సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, నిష్ణాతులైన న్యాయవాదుల ద్వారా న్యాయస్థానంలో సమస్య పరిష్కారానికి కృషి చేసిందని ప్రత్తిపాటి వివరించారు. మూడు గ్రామాల ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు స్థానిక శాసనసభ్యుడిగా విలీన సమస్య పరిష్కారానికి తాను చేయాల్సిన కృషి చేశానని ప్రత్తిపాటి తెలియచేశారు. పంచాయతీలుగా గుర్తింపబడిన మూడుగ్రామాలను ఇకపై అభివృద్ధి బాట పట్టిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకం

**ప్రార్థించే పెదవులకన్నా.. సహాయం చేసే చేతులు మిన్న**

**నందిగం రంజిత్‌కుమార్**



సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త): మానవ సేవయే మాధవ సేవగా భావించి పేదలు, నిరుపేదలకు సేవలు అందించిన మదర్ థెరిసా జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని మాస్టిన్‌పేటలో జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి చిన్నారుల చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మదర్ థెరిసా భారతదేశంలో అందించిన సేవలను కొనియాడారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. నందిగం రంజిత్‌కుమార్ మాట్లాడుతూ "ప్రార్థించే పెదవులకన్నా సహాయం చేసే చేతులు మిన్న" అని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేయాలని పిలుపునిచ్చారు. పోతుగంటి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ "మానవ సేవయే మాధవ సేవ" అని, సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా మహిళలు పాల్గొనగా, అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పోతుగంటి రామకోటేశ్వరరావు, గంజి వీరాస్వామి, నందిగం చిట్టిబాబు, నందిగం రంజిత్‌కుమార్, వలేటి కుమారి, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి

**ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు**

**డీఎస్పీ కృష్ణ చైతన్య**



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సబ్ డివిజన్ డీఎస్పీ కృష్ణ చైతన్య తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని గార్లపాడు బస్‌స్టాండ్, మున్సిపాలిటీ ఏరియా, గడియార స్తంభం, గాంధీ బొమ్మల ఏరియా, బాలాజీ స్వీట్స్ ఏరియా, మార్కెట్ ఏరియా, 5 ల్యాంప్స్ ఏరియా, స్టేషన్ రోడ్, ఆర్టీసీ బస్‌స్టాండ్ ఏరియా, మార్కెట్ సెంటర్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ తోపుడు బళ్ల నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన వ్యాపార కూడళ్లలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు మార్జిన్ వెలుపల వాహనాలను నిలపకుండా సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ ప్రజలు, వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ కృష్ణ చైతన్య కోరారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఇదిలా ఉండగా గతంలో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉండేవారని, బ్లూ కోట్స్ వాహనాలతో సిగ్నలింగ్ చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించేవారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం కూడా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను అందుబాటులో ఉంచి పాత విధానాన్ని కొనసాగించాలని పట్టణ ప్రజలు పోలీస్ శాఖను కోరుతున్నారు.

## ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల పరిస్థితిపై విమర్శలు

**బిల్లులు అందక పారిశుధ్య కార్మికుల అవస్థలు**



**యడ్లపాడు, అగస్టు 26, ప్రభాతవార్త :** ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో రోజువారీ నిర్వహించే పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పాటు, గ్రామాల్లో చెత్త సేకరణ చేపడుతున్న పారిశుధ్య కార్మికులకు కూడా నెలల తరబడి బకాయిలు పేరుకుపోయాయని వారు వాపోతున్నారు. కొందరికి ఆరు నెలల వరకు బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ, వారు క్రమం తప్పకుండా ఆయా పంచాయతీలను సందర్శించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ప్రజల సమస్యలను పరిశీలించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రత్యేక అధికారులు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపైనే మొత్తం బాధ్యత పడుతోందని, ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీల నిర్వహణపై దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతో పాటు పారిశుధ్య కార్మికులకు బకాయిలను విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రత్యేక అధికారులు పంచాయతీలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్పైసెస్ పార్క్‌లో దొంగల హల్‌చల్.. ఇద్దరు పట్టివేత

**యడ్లపాడు, అగస్టు 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామ సమీపంలో ఉన్న స్పైసెస్ పార్క్‌లో దొంగలు చొరబడిన ఘటన బుధవారం రాత్రి కలకలం రేపింది. స్పైసెస్ పార్క్‌లోకి ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవేశించినట్లు గుర్తించిన వాచ్‌మెన్, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. దొంగతనానికి ప్రయత్నిస్తున్నట్లు అనుమానించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని వెంబడించారు. ఆరుగురిలో ఇద్దరిని సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. పటుబడిన ఇద్దరిని వెంటనే పోలీసులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు. మిగిలిన నలుగురు వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టినట్లు సమాచారం. స్పైసెస్ పార్క్‌లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణం గుంటూరు రోడ్డులోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ చేశారు. బుధవారం ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు చింతాడ ప్రభావతి విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఇంటర్మీడియట్‌లో చేరిన బాలబాలికలందరికీ ట్రస్ట్ తరఫున ఉచితంగా యూనిఫామ్స్ అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ట్రస్ట్ తరఫున పూర్తి ఉచిత ప్రవేశం కల్పించినట్లు చెప్పారు. ఈ ఏడాది నూతనంగా ఇంటర్మీడియట్‌లో చేరిన 300 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో చదువుతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సీఎస్‌జీఎల్‌ఎం కళాశాల, వేద కళాశాల బాధ్యులు కె. ప్రభావతి, ఎన్.సి.హెచ్. సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది

**పీఆర్సీ కమిటీ నియమించాలి, మధ్యంతర భృతి ప్రకటించాలి**



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిరక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ వారి ఆర్థిక ప్రయోజనాల విషయంలో వివక్ష చూపుతోందని పల్నాడు జిల్లా ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షులు వల్లూరి నాగరాజు ఆరోపించారు. సత్తెనపల్లి సీపీఐ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన సత్తెనపల్లి ఏరియా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ఎం. సుభానీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వల్లూరి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు పీఆర్సీ కమిటీని నియమించలేదని, కనీసం మధ్యంతర భృతిని కూడా ప్రకటించలేదని అన్నారు. దీంతో ఉద్యోగులు లక్షలాది రూపాయలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి తురకా రాజు మాట్లాడుతూ తమిళనాడు తరహాలో సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయలేకపోయిందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ జెల్ది విజయప్రసాద్, జిల్లా కార్యదర్శి కె. సురేష్, మండల అధ్యక్షులు పి. వెంకయ్య, ఆర్థిక కార్యదర్శి బి.వి. బ్రహ్మేంద్ర నాయక్, ఉపాధ్యక్షులు ఎ. సత్యనారాయణ రాజు, కె. సీతారామయ్య, ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## కల్పిత నాయకుడు పుస్తకాన్ని నిషేధించాలి

**నకరికల్లు, ఆగస్టు 26, ప్రభాతవార్త**

:డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా రచించిన "కల్పిత నాయకుడు" పుస్తకాన్ని వెంటనే నిషేధించి, పుస్తక రచయిత హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కాల్వ రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాల్వ రవి బుధవారం మాట్లాడుతూ.. హమారా ప్రసాద్ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్లలో అంబేద్కర్ భావజాలాన్ని, దళిత క్రైస్తవులను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ మత వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రచారం కోసం అంబేద్కర్‌ను కించపరిచేలా "కల్పిత నాయకుడు" పుస్తకాన్ని రచించారని విమర్శించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి, త్యాగం దేశ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంబేద్కర్‌పై నిరాధా ర ఆరోపణలు చేస్తూ సమాజంలో అలజడి, చీలికలు సృష్టించడమే హమారా ప్రసాద్ లక్ష్యంగా ఉందని కాల్వ రవి ఆరోపించారు. సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ జరగలేదని పేర్కొన్నారు. "కల్పిత నాయకుడు" పుస్తకాన్ని వెంటనే నిషేధించి, హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకుని బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కాల్వ రవి కోరారు.

## ఘనంగా వైసీపీ సీనియర్ నాయకులు గజ్జల జన్మదిన వేడుకలు



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వైసీపీ నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు యర్రం మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నాయకులు గజ్జల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వృద్ధులతో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం ద్వారా సేవాభావాన్ని చాటుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి ప్రభాకర్, రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకటరామిరెడ్డి, అడ్వకేట్ చిన్నం మణి బాబు, మాజీ కౌన్సిలర్ గని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పోలేరమ్మ తల్లికి గ్రామ పొంగలి



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని రంగాకాలనీ రెండో వార్డులో గల శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా తొలి ఆదివారం గ్రామ పొంగలి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పొంగలి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమానికి శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు సహకారం అందించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**రాజుపాలెం, ఆగస్టు 26 (ప్రభాత వార్త):** రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామంలో ఎంపీటీసీ షేక్ బెల్లంకొండ బీబీ మనవడు, షేక్ బెల్లంకొండ పెద్ద హుస్సేన్ మీరాభి దంపతుల కుమారుడు మహమ్మద్ హాసన్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి తండ్రి డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రాజేశ్వరి, చంద్రమోళి రాజుపాలెం మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సోషల్ మీడియా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు బండి కోటి నాగిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోదాటి సీతారాములు, గణపవరం మాజీ సర్పంచ్ బుల్లి బాబు, మొక్కపాడు మాజీ సర్పంచ్ మాబు వలి, పశ్యావుల కోటేశ్వరరావు, పశ్యావుల నరసిం హారావు, రెడ్డిగూడెంసమీరా ఈవెంట్ మేనేజర్ సైదా, దొంకల కామయ్య, షేక్ జానీ భాష, బిట్రగుంట గోపిరాజు, షేక్ బెల్లంకొండ సైదా, ఆటో బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం



**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణం గుంటూరు రోడ్డులోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కొలువుదీరిన బాలా త్రిపురసుందరి అమ్మవారు, గోవిందమాంబ అమ్మ వారు, ఈశ్వరమ్మవారు, రమాదేవి అమ్మ వారు, అన్నపూర్ణాదేవి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి శ్రావణ లక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అదేవిధంగా దుర్గా దేవి అమ్మవారికి, శ్రీచక్ర సహిత మేరువుకు మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆశ్రమంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఘనంగా మదర్ థెరిస్సా 116వ జన్మదిన వేడుకలు

**సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి**

**ఫాదర్ బాలస్వామి**

**మాచర్ల టౌన్ ఆగష్టు 26 ప్రభాతవార్త:** మదర్ థెరీసా సేవా సమితి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని ఆర్‌సీఎం ఎలిమెంటరీ పాఠశాల (చిన్న కాన్వెంట్) సమీపంలోని మదర్ థెరీసా విగ్రహం వద్ద మదర్ థెరీసా 116వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఆర్‌సీఎం చర్చి పారిష్ ప్రీస్ట్ ఫాదర్ జె.బాలస్వామి, మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేపీ.చారి, సెయింట్ ఆన్స్ సుపీరియర్ సిస్టర్ ఇన్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ.. మదర్ థెరీసా తన జీవితాన్ని నిరుపేదలు, అనాథలు, ఆపన్నులకు సేవ చేయడానికే అంకితం చేశారని తెలిపారు. ఆమె చేసిన సేవలకు అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయని గుర్తుచేశారు. మదర్ థెరీసా చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజానికి తమ వంతు సేవ చేయాలని కోరారు. డాక్టర్ కేపీ.చారి మాట్లాడుతూ.. మదర్ థెరీసా అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె స్ఫూర్తితో సమాజానికి సేవ చేయడం గర్వకారణమన్నారు. సేవా భావంతో పనిచేస్తే సమాజంలో ఎంతోమందికి మేలు చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పల్నాడు జిల్లా ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్న డాక్టర్ కేపీ. చారిని మదర్ థెరీసా సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ అరవింద్ బాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జక్కిరెడ్డి మర్రెడ్డి, మోరా భాస్కరరెడ్డి, యరబోతుల శ్రీనివాసరావు, తుమ్మా మర్రెడ్డి, అన్నెం నాగిరెడ్డి, శిరందాసు నాగభూషణాచారి, రాజేంద్ర, పాపిరెడ్డి, చంద్రయ్య, సిస్టర్ అనిత, నాగేశ్వరరావు, భాషా, కొండా రఘురామిరెడ్డి, గొట్టం వెంకటరెడ్డి, పొట్లపాటి వెంకటరెడ్డి, మన్నెం పాండు తదితరులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.




## ఒత్తిడి రహిత జీవనంపై అవగాహన



**మాచర్ల రూరల్ (ఆగస్టు 26, ప్రభాతవార్త):** మాచర్ల రూరల్ నియోజకవర్గం అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో సిబ్బంది కోసం "ఒత్తిడి రహిత జీవనం" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఖిఆర్ట్ ఆఫ్ లివింగ్‌ఖి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒత్తిడి అంటే ఏమిటి, దానికి గల ప్రధాన కారణాలు, ప్రభావాలు, రోజువారీ జీవితంలో దానిని ఎలా అధిగమించాలనే విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రశాంతమైన జీవనం, సానుకూల ఆలోచనా విధానం, శ్వాసకు సంబంధించిన సాధనలు, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వివరించారు.. ఆధ్వర్యంలో సిబ్బందికి ఒత్తిడిని అధిగమించడానికి ఉపయోగపడే వివిధ సాధనలను ప్రాక్టికల్‌గా చేయించి చూపించారు. కళాశాల సిబ్బంది ఎంతో ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖిఆర్ట్ ఆఫ్ లివింగ్‌ఖి కోఆర్డినేటర్లు శ్రీ కె. సురేష్, శ్రీ టి. వినయ్ సత్యసాయి విద్యావిహార్ కార్యదర్శి శ్రీ ఎ. అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్రీ జున్నా శ్రీనివాస రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ శ్రీ జున్నా చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీ ఎన్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ బి. నరసింహారావు, ఏఓ శ్రీ ఖాసిం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది మానసిక ప్రశాంతతను, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవడానికి మరియు వారి విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## అబ్బూరు వద్ద బైక్‌ను ఢీకొన్న కారు..ఇద్దరికి గాయాలు

**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలోని గండ్లూరు రోడ్డు వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గంగయ్య (75), ఏడుకొండలు (56) గాయపడగా, గంగయ్యకు కాలుకు ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం. వీరు పొలానికి వరినారు తీసు కెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

**ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం విడుదల చేసిన**

## టెట్ నోటిఫికేషన్‌ను పునఃసమీక్షించాలి

**నకరికల్లు, ఆగస్టు 26 ప్రభాతవార్త ::** ఎస్టియు జిల్లా కార్యాయంలో బుధవారం ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐఎస్టిఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్షకు అర్హత సాధించాలనే సుప్రీంకోర్టుతీర్పునకు లోబడి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కొరకు ప్రత్యేకంగా టెట్ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ప్రత్యేక నోటిఫికేషన్లో ఉపాధ్యాయులకు అనుకూలంగా ఎటువంటి ప్రత్యేకతలు లేవని దీనిని పునః సమీక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ పరీక్షలలో ఎక్కువ సిలబస్ ను వయసు రిత్యా చదివి గుర్తుంచుకోవటం ఎంవరకు సాధ్యపడుతుందో ఆలోచించాలని తెలిపారు. బీహార్ నందు అర్హత మార్కులు 40 శాతానికి, తమిళనాడు రాష్ట్రంలో 2010కి ముందు నియమితులైనఉపాధ్యాయులందరకు టెట్ నుండి పూర్తిగా మినహాయింపు ఇచ్చేలా ఏకంగా అసెంబ్లీ తీర్మానమే చేసి పంపిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. న్యాయమైన డిమాండ్ లను పరిశీలించాలని, ఉపాధ్యాయులందరూ ఉద్యమ బాట పట్టకుండా చూడాల్సిన బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టియు నాయకులు ఎస్ కే కరిముల్లా, ఏ ఏమండీ, షేక్ మహబూబ్ సుభాని, పీవీ భీష్మారావు, టి ఆంజనేయులు, అమర్నాథ్, పాల్గొన్నారు.

## 29,30న ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

**ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా**

**కోకన్వీనర్ డి. అమూల్య**




**సత్తెనపల్లి (ఆగస్టు 26, ప్రభాతవార్త):**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సత్తెనపల్లి నియోజకవర్గ మహాసభలు ఈ నెల 29, 30 తేదీల్లో సత్తెనపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కోకన్వీనర్ డి. అమూల్య తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పుతుంబాక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ "అధ్యయనం- పోరాటం" అనే నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల సాధన కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడుతోందన్నారు. విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు, హాస్టళ్ల సమస్యలపై వారిని చైతన్యపరిచి పోరాటాలు నిర్వహించి పరిష్కారాలు సాధిస్తున్నామని తెలిపారు. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, పుచ్చలపల్లి సుందరయ్య వంటి జాతీయ నాయకుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఎస్ఎఫ్ఐ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు విద్యా కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణ విధానాలను అవలంబిస్తూ విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలో మహాసభల్లో విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన అపజయాలను మహాసభల్లో సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించనున్నట్లు అమూల్య తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ సత్తెనపల్లి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రియాజ్, కమిటీ సభ్యులు మనోజ్, దుర్గాసాయి పాల్గొన్నారు.

## కావేటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**ముప్పాళ్ల ఆగస్టు 26 ప్రభాత వార్త**

ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో కావేటి రంగారావు ధనలక్ష్మి గార్ల కుమార్తె ధరణి వివాహ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి. తండ్రి డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయ నూతన నిర్మాణానికి రూ.1,01,116 విరాళం



**రొంపిచర్ల, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళం అందించే కార్యక్రమం జరిగింది. బుధవారం గుడిపూడి గ్రామానికి చెందిన కొనకంచి వెంకటప్పయ్య ధర్మపత్ని సరిత,సమారుడు రామాంజనేయులు, తల్లి వరలక్ష్మి లు సంయుక్తంగా రూ.1,01,116/ నగదును ఆలయ నిర్మాణం నిమిత్తం విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో నలబోతు మాధవిదేవికి అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

# పల్నాడు జిల్లా వార్త



## కుడి కాలువ జల విద్యుత్ కేంద్రం ద్వారా తాగునీరు విడుదల

**విజయపురిసౌత్ ,ఆగస్టు 26 , ప్రభాతవార్త ,**తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల ఈ నీటితో సాగర్ కుడి కాలువ పరిధిలోని చెరువులు,కుంటలు నింపుకోవాలి. విజయపురిసౌత్:నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా తాగునీటి అవసరాల కోసం కుడి జలవిద్యుత్ కేంద్రంలోని మొదటి యూనిట్ను ప్రాజెక్టు ఈఈ రమేష్, జెన్కో అధికారులు స్విచ్ ఆన్ చేసి రెండువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం ఎనిమిది టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నీటితో కుడి కాలువ పరిధిలోని చెరువులు,కుంటలను నింపుకుని ఆయా ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. నీటి విడుదలతో నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభమవుతున్నదని తెలిపారు.

## మదర్ థెరిస్సా సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**విశ్వమాత యువత, మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో భారతరత్న మదర్ థెరిసా జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేటలోని లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్లో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవి యువత అధ్యక్షుడు అద్దేపల్లి ఆనందబాబు, గుప్త శ్రీకాంత్ లు మాట్లాడుతూ.. విదేశాల్లో జన్మించిన మదర్ థెరిసా సమాజ సేవపై మక్కువతో మిషనరీస్ ఆఫ్ చారిటీ సంస్థను స్థాపించి, కలకత్తాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచి సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆమె సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, మానవ సేవే మాధవ సేవగా భావించి యువత సమాజ సేవలో ముందుకు సాగాలని కోరారు. మదర్ థెరిసా సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో సత్కరించిందన్నారు.కార్యక్రమంలో పోతంశెట్టి రాము, గుప్త శ్రీకాంత్, సంక నాగరాజు, బీమా సాంబయ్య, పోతంశెట్టి పూర్ణ, ముత్తిరెడ్డి అయ్యప్పతో పాటు మెగా అభిమానులు పాల్గొని మదర్ థెరిసాకు ఘనంగా నివాళులర్పించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని 12వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలనుఅడిగితెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "సూపర్ సిక్స్" పథకాల గురించి ప్రజలకు వివరించి, వాటి ద్వారా అర్హులైన కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.ప్రజలే మన బలం.. ప్రజల సమస్యలే మన సమస్యలు. ప్రతి కుటుంబానికి అండగా నిలిచి, నరసరావుపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం" అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కపలవాయి విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావాలి, డాక్టర్ రాంప్రసాద్, మోర ప్రతాప్ రెడ్డి, నేలటూరి మురళి, శీలు బాబురావు, క్రాంతి కుమార్ తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కాసు శేషమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి మాతృ మూర్తి కాసు శేషమ్మ పెద్దకర్మ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై శేషమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం కాసు కుటుంబ సభ్యులను పరామర్శించి భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట వైకాపా నాయకులు కనకా పుల్లారెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, చల్లా నారపరెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, మూరబోయిన శ్రీనివాసరావు, ఖాజావలి మాస్టారు, అన్నెం పున్నారెడ్డి, మట్ట లింగారెడ్డి, వేంపాటి వెంకటప్పరెడ్డి, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## సీపీడీసీఎల్ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలి



**రొంపిచర్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త:**ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయవాడగాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాయంలో నిర్వహించనున్న సీపీడీసీఎల్ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని సీపీడీసీఎల్ వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని 220 కేవీ విద్యుత్ కేంద్రంలో సస్సుకు సంబంధించిన గోడపత్రికను ఆవిర్కించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పడి, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాయని తెలిపారు. అందులో భాగంగానే విజయవాడలో సీపీడీసీఎల్ ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, దళారీ విధానాన్ని రద్దు చేసి తెలంగాణ తరహాలో కార్మికులను సంస్థలో విలీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని,యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.10 లక్షలు ఇవ్వాలని, కార్మికులకు ప్రమాదం సంభవించినప్పుడు ప్రమాద బీమా కింద రూ.కోటి పరిహారం అందించాలని కోరారు.ఈ నెల 29న విజయవాడలో జరిగే ప్రాంతీయ సదస్సుకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దర్శి రాజు, పవన్ కుమార్, శివ, పోలేష్, గోపి, కోటి రామకృష్ణ,నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి అవసరాల కోసమే సాగర్ జలాలు

### నీటిని వృధా చేస్తే ఉపేక్షించేది లేదు



**కారంపూడిఆగస్టు 26, ప్రభాతవార్త:** త్రాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను బుధవారం జలవలన శాఖ అధికారులు విడుదల చేశారు. కృష్ణ బోర్డు ఆదేశాల మేరకు రాష్ట్రంలో తలెతుత్తున్న నీటి ఎద్దడి నివారించేందుకు కృష్ణా బోర్డు సానుకూలంగా స్పందించింది. త్రాగునీటి అవసరాల కోసమే వీటిని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితు లు సానుకూలంగా లేకపోవడం గ్రామాలలో చెరువులు, కుంటలు ఎండిపోవడం జరుగుతుంది. భూగర్భ జలాలు అడుగంటి పోవటంతో బోర్లలో కూడా నీరు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో సాగర్ కుడి కాలం నుండి 8 టీఎంసీల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కుడికాలువ పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు , ప్రకాశం జిల్లాలలో ఉన్న 442 చెరువు లు ల కునీటి నింపుకోవాలని జల వనరుల శాఖ కోరుతున్నారు. త్రాగునీటికి విడుదల చేసిననీటిని పొలాలకు మళ్ళిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సాగర్ కుడి కాలువ పై ప్రతిష్టమైన గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐదు ప్రత్యేక బృందాలు 137 కిలోమీటర్ల మేర 24 గంటలు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. త్రాగు నీరు కోసం విడుదల చేస్తున్న నీటిని వృధా చేయవద్దని అధికారులు కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

### ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయుల భారీ ర్యాలీ..



**మాచర్ల టౌన్ ఆగష్టు 26 ప్రభాతవార్త:**పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాచర్ల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల స్,ఉపాధ్యాయులు, సిబ్బంది బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.రింగ్‌రోడ్డులోని సెయింట్ జేవియర్ స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యా సిబ్బంది పాల్గొన్నారు.ఇటీవల నల్గొండ జిల్లా మల్లేపల్లిలో ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య,విశాఖపట్నంలో ఎల్‌కేజీ విద్యార్థి మృతి ఘటనలు పాఠశాలల భద్రతపైతీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ర్యాలీలో పాల్గొన్న వారు తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.అనంతరం మాచర్ల తహాశీల్దార్ బందెల కిరణ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తహాశీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు.నాణ్యమైన విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.పాఠశాలల్లో విద్యార్థులు,ఉపాధ్యాయులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఎంఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవర్తనలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి మాట్లాడుతూ..పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హత,భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల రవాణాలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు కె.వి.రమణతో పాటు పలువురు ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్స్ శ్రీనివాస్,రామకృష్ణ శాస్త్రీ హనుమంతరావు, హారణి,వెంకటరెడ్డి,దరియా హుస్సేన్,సిస్టర్ సుజాత,క్రాంతికుమార్,జాని, రాజు,హారిక తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ప్రముఖులు ఘన నివాళి



**నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త** నరసరావుపేటలో మదర్ థెరిసా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొని, మదర్ థెరిసా విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "మానవ సేవే మాధవ సేవ"..గా భావించి పేదలు, నిరుపేదలు, అనాథలు, అభాగ్యుల కోసం మదర్ థెరిసా చేసిన సేవలు ప్రపంచానికే ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎం.ఏ.ఎం. విద్యాసంస్థల చైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్ మాట్లాడుతూ మదర్ థెరిసా జీవితం మొత్తం సేవా ప్రేమతో నిండిందని పేర్కొన్నారు. దేశాలు మారినా, తరాలు మారినా మదర్ థెరిసా సేవా స్ఫూర్తి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ కళాశాల కమిటీ అధ్యక్షులు బత్తుల మురళి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

### గ్రామాల పరిరక్షణ లక్ష్యంగా కార్డన్ సర్చ్‌గురజాల, డీ.ఎస్.పీ ఉమామహేశ్వరరావు



**కారంపూడిఆగస్టు 26, ప్రభాతవార్త** :కారంపూడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా గ్రామస్తులు పోలీసులకు సకరించాలని గురజాల డిఎస్పి ఉమామహేశ్వర అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పు చర్ల గ్రామంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ, ఎంపీటీసీ , జడ్పిటిసి ఎన్నికల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి ఓటరు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. యువత డ్రగ్స్ కు బానిస కావద్దని తమ జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఎలాంటి పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను, పలు మారనాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ భాస్కరరావు, ఎస్సై ఎం వాసు సిబ్బంది

## పారిశుద్ధ్య కార్మికులకు మూడునెలల వేతనాలు అందిస్తాం

### కార్మికులు విధులకు రావడం లేదు జిల్లా పంచాయతీ అధికారి , డివిజనల్ డెవలప్మెంట్ అధికార దృష్టికి తీసుకు వెళ్తున్నాం ఎంపీడీవో గంట శ్రీనివాస్ రెడ్డి



**కారంపూడిఆగస్టు 26, ప్రభాతవార్త** :కారంపూడిమండల కేంద్రమైన కారంపూడిలో పరిశుద్ధ కార్మికుల జీతాల విషయమై అధికారులు ఓ కొలిక్కి వచ్చారు. మూడు నెలల జీతాలు అడ్వాన్సు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నావని ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రతి నెల కూడా వారికి జీతాలు చెల్లించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కార్మికులకు 17 నెలల వేతనాలు ఇవ్వవలసి ఉందని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వారికి జీతాలు ఇవ్వపోవడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 26 గ్రామ పంచాయతీల లో కార్మి కులకు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, అందులో కారంపూడి గ్రామపంచా యతీ కూడా ఉందని ఆయన తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలరికార్డులు కమిషనర్ దగ్గర ఉన్నాయని , అనుమతి వచ్చిన వెంటనే కార్మికుల ఖాతాలో వేతనాలు జమ చేస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు గత రోజు నుండి విధు లకు రాకపోవడంతో పట్టణం అధ్వానంగా ఉంది. ఎక్కడి చెత్త అక్కడే నిల్వ చేరింది. పారి శుద్ధం లోపించకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా కార్మికులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి ,డివిజనల్ డెవలప్మెంట్ అధికారి అనుమతి కోసం కూడా లేఖను పంపినట్లు ఆయన తెలిపారు. ప్రత్యామ్నాయ కార్మికులను విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

## ఓటరుగా నమోదు అవ్వండి..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి

### తెలుగుదేశం పార్టీ మాచర్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అక్కయ్య బుట్టి పిలుపు



**మాచర్ల టౌన్ ఆగష్టు 26 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని తెలుగుదేశం పార్టీ మాచర్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అక్కయ్య బుట్టి పిలుపునిచ్చారు."మీ ఓటు–మీ హక్కు"అని పేర్కొంటూ,ఓటు హక్కు పొందడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని ఆయన తెలిపారు.కొత్త ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని,2008 అక్టోబర్ 1వ తేదీ లేదా అంతకుముందు జన్మించిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని అక్కయ్య బుట్టి తెలిపారు.అర్హత కలిగిన యువత,ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటరు నమోదుకు ఆధార్ కార్డు,జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్,రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటరు గుర్తింపు కార్డు వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు . సమీపంలోని గ్రామ ,వార్డు సచివాలయం,మీ సేవ కేంద్రం ద్వారా లేదా ఆన్‌లైన్‌లో విజిలీశి సేవలను ఉపయోగించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.2026 ఆగస్టు 31వ తేదీని ఆఖరి తేదీగా నిర్ణయించినందున,అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని అక్కయ్య బుట్టి కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని,ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగబద్ధ పాలనకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

## సంచార,అర్ధ సంచార దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### బీజేపీ నాయకులు పిలుపు



**వినుకొండ,ఆగస్ట్26,ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంచార అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం ను ఆగస్టు 30న విజయవాడ ,తిరుపతి ,రాజమండ్రి బీజేపీ కార్యాలయంల నందు,ఆగస్టు 31 న అనంతపురం,అనకాపల్లి బీజేపీ కార్యాలయంల నందు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల ప్రకారం సంచార అర్ధ సంచార జాతుల ప్రతినిధులను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడి ఈ కార్యక్రమంకు ఆహ్వానించుటకు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు,బీజేపీ పల్నాడు జిల్లా కార్యదర్శి కవలకుంట జాన్ బాబు,పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా ఇంచార్జి శేషగిరిరావు, మాజీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది యం వి అప్పారావు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వినుకొండ ఓబీసీ నియోజకవర్గం ఇంచార్జి వీరంకి వీరబాబు స్వామి బీజేపీ సీనియర్ నాయకులు బండి వెంకటేశ్వర్లు తదితర నాయకుల ప్రత్యక్ష పర్యటన కార్యక్రమం నిర్వహించారు.సంచార అర్ధ సంచార జాతుల లోని అన్ని కులాలను వర్గాలను కలిసి ఆహ్వానించటం జరిగింది.

## మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఘన నివాళి



**రాజుపాలెం, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** విశ్వమాత, భారతరత్న మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల–రాజుపాలెం కెఎస్ఆర్ విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, జాడిస మస్తాన్ రావు మాట్లాడుతూ.. మదర్ థెరిస్సా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ప్రేమ, దయ, సేవ, మానవత్వం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగిన మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు."మనం చేసే చిన్న సహాయం కూడా ఒకరి జీవితంలో గొప్ప మార్పును తీసుకురాగలదు" అనే మదర్ థెరిస్సా సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాదినేని నరసింహారావు, తెలకపల్లి గోపీకృష్ణతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని మదర్ థెరిస్సాకు ఘనంగా నివాళుల ర్పించారు.

## వినుకొండ మార్కెట్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన వ్యవసాయ మార్కెటింగ్ కమీషనర్



**వినుకొండ,ఆగస్ట్26,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ పి. రవిసుభాష్ ఐఏఎస్ బుధవారం వినుకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కాపురం రోడ్డులో ఉన్న చెక్‌పోస్ట్‌ను సందర్శించారు. మార్కెటింగ్ శాఖ డిజిటలైజేషన్‌లో భాగంగా అమలు చేస్తున్న ఈ ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్‌లో అనుమతుల జారీ,డిజిటల్ విధానం ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ,వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ప్రక్రియను తనిఖీ చేసి కమిషనర్ మాట్లాడారు. ఈ విధానం పారదర్శకతను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మరింత సౌలభ్యాన్ని కల్పిస్తోందని పేర్కొంటూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన కమీషనర్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ యార్డులో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పీఎస్ వెంకటేశ్వర్లు,పల్నాడు జిల్లా మార్కెటింగ్ ఏడీ కె.వి.ఎన్.ఉపేంద్ర కుమార్,యార్డ్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు,సూపర్‌వైజర్ రాఘవయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి సర్వీసు రోడ్లపై పేరుకుపోతున్న చెత్త



**యడ్లపాడు, అగస్టు 26, ప్రభాతవార్త :** జాతీయ రహదారి 16కు అనుబంధంగా ఉన్న సర్వీసు రోడ్ల పరిరక్షణ బాధ్యత జాతీయ రహదారి విస్తరణ అధికారులదేనని స్థానికులు పేర్కొంటున్నారు. ఆయా సర్వీసు రోడ్ల వెంబడి నిత్యం చెత్తాచెదారం తొలగిస్తూ పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, కొంతకాలంగా ఈ పనులకు అధికారులు పులిస్టాప్ పెట్టడంతో సమస్య తీవ్రంగా మారిందని ఆరోపిస్తున్నారు.సర్వీసు రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గాలులు వీచే సమయంలో చెత్తాచెదారం రోడ్డుపైకి ఎగిరి ప్రయాణికులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి సర్వీసు రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించి, క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల పరిశుభ్రత, పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పట్టణాబివృద్ధి, సమస్యల పరిష్కారానికి సహకరించండి : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన, రూ.32 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల అంచనా నివేదికల్ని ఆమోదించి, వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. బుధవారం ప్రత్తిపాటి తన నివాసంలో పట్టణాభివృద్ధిపై వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు తన దృష్టికి తీసుకొచ్చిన పనుల ప్రణాళికలు, అంచనా నివేదికలు, నిధుల విడుదలపై ప్రత్తిపాటి ఫోన్ ద్వారా మంత్రి నారాయణతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తిచేసి, ప్రజలకు అత్యంత ముఖ్యమైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కులు, వాకింగ్ ట్రాక్ ల ఏర్పాటు.. సుందరీకరణ, పచ్చదనం పెంపుకు అవసరమైన నిధుల్ని వెంటనే మంజూరు చేయాలని ప్రత్తిపాటి, మంత్రిని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నారాయణ.. వీలైనంత త్వరగా పాలనా అనుమతులు, నిధుల మంజూరు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రత్తిపాటి అధికారులకు పలుకీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రోడ్లు, డ్రైన్లను త్వరగా పూర్తిగా చేయాలని, ప్రజలు ఎదుర్కొనే ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. మినీ స్టేడియం నిర్మాణ ప్రతిపాదనల అమలుపై అధికారులు దృష్టిసారించాలని, అవసరమైన భూసేకరణను వెంటనే చేపట్టాలని ప్రత్తిపాటి రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఎమ్మార్వో వేణు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, జిల్లా సర్వేయర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్, మండల సర్వేయర్ చంద్రబాబు, అర్.ఐ లు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 5న 1008 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తాం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** రెండోదశలో నిర్మిస్తున్న1008 టిడ్కో గృహాలను సెప్టెంబర్ 5న లబ్ధిదారులకు అప్పగిస్తామని, గత టీడీపీ ప్రభుత్వంలో అర్హులకు ఇళ్లు మంజూరైతే.. గత పాలకుల కక్షసాధింపు చర్యలతో వాటి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని, దాంతో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు 8 ఏళ్లుగా నరక యాతన అనుభవిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పబలంతో ఎట్టకేలకు వారి సొంతింటి కల సాకారం కాబోతోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

బుధవారం ఆయన పట్టణ శివార్లలోని టిడ్కో గృహ సముదాయంలో జరుగుతున్న రెండోదశ ఇళ్ల నిర్మాణపనుల్ని అధికారులు, నిర్మాణపనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**మొదటి దశ ఇళ్ల అప్పగింతలో తలెత్తిన సమస్యలు.. రెండోదశలో పునరావృతం కానివ్వం..**

రెండో దశ ఇళ్ల అప్పగింతలో మొదటిదశలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామన్న ప్రత్తిపాటి.. త్వరలో ఇళ్లు పొందే లబ్ధిదారులు నివాసముంటున్నట్టు రుజువు చేసుకున్నాకే మిగిలిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఎవరికి కచ్చితంగా ఇళ్లు అవసరమో గుర్తించి నిర్ధారణ చేసుకున్నాక 6 నెలలనుంచి ఏడాది లోపు రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తొలిదశలో నిర్మించిన 4,510 ఇళ్లల్లో ఇప్పటికీ 1700 ఇళ్లు ఖాళీగానే ఉన్నాయని, దానివల్లే రెండో దశ ఇళ్ల కేటాయింపు మార్గదర్శకాలు, నిబంధనల్ని కఠినతరం చేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు. నివాసం లేని ఇళ్లు దెబ్బతింటాయని, దాంతో ప్రభుత్వానికి, లబ్ధిదారులకు ఇద్దరికీ నష్టమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

**టిడ్కో రుణాల మంజూరులో బ్యాంకులు పారదర్శకంగా వ్యవహరించాలి..**

రెండోదశలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లల్లో నివాసముండే వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. రూ.6 కోట్లతో రోడ్లు, డ్రైనేజ్, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన పనులు చేపట్టామని, అవి త్వరలోనూ పూర్తవుతాయని ప్రత్తిపాటి తెలిపారు. గృహ రుణాల మంజూరు సమస్యపై మంత్రి నారాయణ, టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డితో మాట్లాడినట్టు చెప్పిన ప్రత్తిపాటి.. తొలి మరియు రెండోదశలో ఇళ్లు పొంది, లోన్లు మంజూరుకాని 752 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. బ్యాంకర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారన్నారు. రుణాల మంజూరులో బ్యాంకర్లు పునరాలోచన చేసి, పారదర్శకంగా



వ్యవహరించాలని, సిబిల్ స్కోర్ బాగున్న లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలని ప్రత్తిపాటి సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిబంధనల ప్రకారం బ్యాంకర్లు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సహకరించాల్సి ఉందేనని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అన్ని అర్హతలున్నప్పటికీ, రుణాలు తిరస్కరించే బ్యాంకు సిబ్బంది వైఖరిపై లబ్ధిదారులు అసంతృప్తిగా ఉన్నారని, అవసరమైతే ధర్నాలు చేయడానికి కూడా వారు వెనుకాడరని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టం చేశారు. టిడ్కో గృహాల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు జంగా వినాయకరావు, కొత్త కోటేశ్వరరావు, మురకొండ మల్లిబాబు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, ఎస్.సి సుబ్బారాయుడు , రాకేష్, షాపుంజి పల్లంజి అధికారులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త మహమ్మద్ ముస్తఫా జీవితం అందరికీ ఆదర్శం

**గుంటూరు విద్య ఆగస్టు 26 ప్రభాతవార్త :** మిలాదున్నబీ హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా కరుణ, ప్రేమ మానవత్వ సందేశం అందరికీ ఆదర్శం అనిస్పెషల్ ఆఫీసర్ (ఉర్దూ), బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, షేక్ నాగూర్ వలి అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఆయన సందేశాన్ని ఇస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైన, శుభప్రదమైన ఆనందదాయకమైన రోజు అని పేర్కొన్నారు. మన ప్రియతమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా జన్మదినాన్ని స్మరించుకుంటూ, ఆయన పవిత్ర జీవితం, బోధనలు మానవాళికి అందించిన మహత్తర సందేశాన్ని గుర్తు చేసుకుంటున్నామనీ తెలిపారు. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా అల్లాహ్ తఆలా యొక్క అంతిమ ప్రవక్త మరియు సందేశహరుడు. ఆయన మానవాళిని అజ్ఞానం అనే చీకట్ల నుంచి బయటకు తీసుకువచ్చి జ్ఞానం, న్యాయం, ప్రేమ, సోదరభావం మరియు శాంతి వెలుగును ప్రసాదించారు. మనిషి గొప్పతనం అతని సంపదలో, వంశంలో లేదా హోదాలో లేదని, అతని మంచి ప్రవర్తన, సత్చరిత్ర మరియు సత్కార్యాలలోనే ఉందని ఆయన బోధించారనీ తెలిపారు. ప్రవక్త మహమ్మద్ పవిత్ర జీవితం మనందరికీ ఉత్తమమైన ఆదర్శం. ఆయన శత్రువుల పట్ల కూడా మంచితనంతో వ్యవహరించారు. పేదలు, అనాథలు మరియు అవసరంలో ఉన్నవారి పట్ల శ్రద్ధ చూపించారు. సమాజంలో న్యాయం, సమానత్వం మరియు మానవతా విలువలను పెంపొందించారు. జ్ఞానాన్ని సంపాదించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, ముస్లింలను విద్య, నైతిక విలువలు మరియు సత్చరిత్ర నిర్మాణం వైపు ప్రోత్సహించారు. ఈ రోజు మనం కేవలం మిలాద్ వేడుకలను నిర్వహించడానికే పరిమితం కాకుండా, ప్రవక్త పవిత్ర జీవితం మరియు బోధనలను మన ఆచరణలో భాగంగా చేసుకోవాలని సంకల్పించాలి. మన తల్లిదండ్రులను గౌరవించాలి, ఉపాధ్యాయులను సన్మానించాలి, విద్యార్థులను ప్రోత్సహించాలి, పేదలు మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలి. సమాజంలో ప్రేమ, సోదరభావం మరియు శాంతిని పెంపొందించాలి.ప్రత్యేకంగా మన యువత మరియు విద్యార్థులకు ప్రవక్త జీవితం గొప్ప మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. వారు కృషి, నిజాయితీ, విద్య, క్రమశిక్షణ మరియు మంచి నడవడికను తమ జీవిత లక్ష్యాలుగా చేసుకోవాలి. విద్యతో పాటు సత్చరిత్ర నిర్మాణం కూడా ఒక బలమైన మరియు విజయవంతమైన సమాజానికి పునాది. మన మాతృభాషలు మరియు జాతీయ భాషలతో పాటు ఉర్దూ భాషా సాహిత్యాల అభివృద్ధికి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఉర్దూ మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు గొప్ప సాహిత్య వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ముఖ్యమైన భాష. విద్యార్థుల్లో ఉర్దూ చదవాలనే ఆసక్తిని పెంపొందించడం, నూతన తరాన్ని ఉర్దూ సాహిత్యంతో అనుసంధానం చేయడం మనందరి సామూహిక బాధ్యత. మన హృదయాలలో ప్రవక్త మహమ్మద్ ముస్తఫా పట్ల ప్రేమను సజీవంగా ఉంచుతూ, ఆయన బోధనలను ఆచరిస్తూ, మన సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావం, విద్య మరియు మానవతా సేవలను ప్రోత్సహిద్దాం అని తెలిపారు.



# ఏబీవీపీ,ఎస్ఎఫ్డీ ఆధ్వర్యంలో మంగళగిరి కొండపై ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

**మంగళగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** అభివృద్ధి చెందుతున్న మంగళగిరి నగరంలో పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఏబీవీపీ-ఎస్ఎఫ్డీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళగిరి కొండపై పేరుకుపోయిన ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను శుభ్రం చేసేందుకు విద్యార్థులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ మంగళగిరి కొండపై ప్లాస్టిక్ సీసాలు, గుట్కా పొట్లాలు, సిగరెట్ పెట్టెలు, మద్యం సీసాలు, తినుబండారాల పొట్లాలు తదితర వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయడం వల్ల పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ప్రకృతి పరిరక్షణ విషయంలో ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఏబీవీపీ-ఎస్ఎఫ్డీ ఆధ్వర్యంలో విద్యార్థులు కొండపై పర్యటించి అక్కడ చెత్తాచెదారాన్ని స్వయంగా సేకరించి శుభ్రం చేశారు. కొండపైకి వచ్చే ప్రజలు, పర్యాటకులు తాము తెచ్చే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వస్తువులను అక్కడే పడేయకుండా, తిరిగి కిందకు తీసుకువచ్చి చెత్తబుట్టలలో వేయాలని సూచించారు. వీలైనంత వరకు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాటన్ (నూలు) సంచులను ఉపయోగించాలని కోరారు. "ప్రకృతి మనకు ఎంతో ఇచ్చింది, దానికి మనం తిరిగి కనీసం పరిశుభ్రతను అందించాలి" అని వారు పేర్కొన్నారు. ఈ పారిశుధ్య కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూర్ణిమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.స్వరూప్, నగర కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు మోహన్ మనోజ్, సహకార్యదర్శి దామర్ల కళ్యాణ్ తదితర విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన కోటిరెడ్డి కుటుంబ సభ్యులు

**-అక్రమ కేసులో కోటిరెడ్డి అరెస్టు, రిమాండ్ వ్యవహారాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లిన మాజీ మంత్రి విడదల రజిని గారు**

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** చిలకలూరిపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డిపై నమోదైన అక్రమ కేసు వివరాలను మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈరోజు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కోటిరెడ్డి సతీమణి సింగారెడ్డి లక్ష్మి, కుమారుడు శ్రీకాంత్, మేనల్లుడు మేకల శ్రీనివాస రెడ్డితో కలిసి మాజీ మంత్రి విడదల రజిని జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. కోటిరెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసు వివరాలు, అరెస్టు చేసిన తీరు, రిమాండ్‌కు పంపిన పరిస్థితులను జగన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి కుటుంబ సభ్యులు తమపై జరిగిన పరిణామాలను, అక్రమ కేసు వివరాలను జగన్ మోహన్ రెడ్డికి వివరించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిరెడ్డి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, న్యాయపరమైన పోరాటంలో అన్ని విధాలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసుల తీరును కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసులను రాబోయే రోజుల్లో గుర్తుపెట్టుకుంటామని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన సింగారెడ్డి కోటిరెడ్డి (75)పై అక్రమ కేసు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం కోటిరెడ్డి జైలులో ఉన్నారు. ఇదే కేసులో ఆయన సతీమణి సింగారెడ్డి లక్ష్మి (70)ని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆమెను రిమాండ్‌కు పంపలేదు. 75 ఏళ్ల వృద్ధుడైన కోటిరెడ్డిని రిమాండ్‌కు పంపి జైలుకు తరలించడం, 70 ఏళ్ల మహిళ అయిన ఆయన సతీమణి లక్ష్మిని సైతం అక్రమ కేసులో అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని మాజీ మంత్రి విడదల రజిని జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కోటిరెడ్డిని రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని వరుసగా అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురిచేస్తోందని మాజీ మంత్రి విడదల రజిని వివరించారు. వయసును కూడా చూడకుండా 75 ఏళ్ల వృద్ధుడిని జైలుకు పంపడం, ఆయన 70 ఏళ్ల సతీమణిని సైతం అక్రమ కేసులో ఇరికించడం అత్యంత దారుణమని ఆమె తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కనీస మానవతా దృక్పథాన్ని కూడా పక్కనపెట్టి వృద్ధ దంపతులపై కేసులు పెట్టడం కక్ష సాధింపు రాజకీయాలకు నిదర్శనమని మాజీ మంత్రి విడదల రజిని జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కోటిరెడ్డి కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని జగన్ మోహన్ రెడ్డి భరోసానిచ్చారు.



# ఇంటింటికీ చేరిన నిత్యావసరాలు.!

**వయోవృద్ధులు,దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేపట్టిన డీఎస్ఓ జగన్మోహన్ రావు**

**బాపట్ల, ఆగస్టు26, ప్రభాతవార్త. ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని వయోవృద్ధులు, దివ్యాంగులకు ఊరటనిస్తూ ఇంటి వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ప్రతినెలా 26వ తేదీ నుంచి ఆయా నెలల ఆఖరి రోజు వరకు బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 68,297 మంది అర్హులైన వయోవృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే నేరుగా చౌక ధరల దుకాణ (రేషన్) డీలర్ల ద్వారా సరుకులను అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బాపట్ల పట్టణంలోని రైలుపేట ప్రాంతంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ. జగన్మోహన్ రావు గారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైలుపేటకు చెందిన ఒక వృద్ధురాలి ఇంటికి స్వయంగా వెళ్లి ఆమెకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. డీలర్లు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వేలిముద్రలు మరియు బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసి పారదర్శకంగా సరుకులు అందిస్తున్నారో లేదో ఆయన దగ్గరుండి పరిశీలించారు.

**వయోవృద్ధుల ఆనందం**

వయోభారం, ఆరోగ్య సమస్యలతో రేషన్ డిపోల వద్దకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్న తమకు, ప్రతినెలా 26 నుంచి నెలాఖరు లోపు ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందించడం ఎంతో ఊరటనిస్తోందని సదరు వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. అధికారుల చొరవపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ జగన్మోహన్ రావు, డిటి ఫణికుమార్, స్థానిక పౌరసరఫరాల శాఖ సిబ్బంది, చౌక ధరల దుకాణ డీలర్లు మరియు ఇతర సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



# మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గం అనుసరణీయం

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం, ఆచరణీయమని పలువురు ముస్లిం మత పెద్దలు చెప్పారు. మిలాద్-ఉన్-నబి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. అరబిక్ భాషలో మిలాద్, మౌలిద్ అంటే పుట్టిన రోజు అని, నబీ అంటే ప్రవక్త అని అర్థమన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మూడవ నెల అయిన రబీ ఉల్-అవ్వల్ 12వ రోజున ఈ పర్వదినం వస్తుందన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను, ఆయన అందించిన శాంతి, దయ, కరుణ, మానవత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి రోజు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రవక్త చూపిన సత్యం, ధర్మ, మానవతా మార్గంలో నడవాలని ప్రతి ముస్లిం ఈ పవిత్ర దినాన సంకల్పం చేసుకుంటారన్నారు. శాంతి ర్యాలీలో పాల్గొన్న మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన కొన్ని నినాదాలను చేశారు. ర్యాలీలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, జానీబేగ్, టెంట్ హౌస్ మునీర్, షేక్ జాని, షేక్ జిలాని, జాన్ సైదా, మత పెద్దలు పాల్గొన్నారు.




# కొందరు నాచేత అసత్య ఆరోపణలు చేయించారు : బూదల ఏసుదాసు

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** జడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబుపై తాను చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని బూదల ఏసుదాసు అన్నారు. బూదల ఏసుదాసు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వడ్రాణం హరిబాబుపై కొంతమంది నాతో అసత్య ఆరోపణలు చేయించారన్నారు. అసత్య ఆరోపణలు చేసినందుకు బాధపడుతున్నట్లు చెప్పారు. నన్ను కొంత మంది ప్రలోభాలకు గురి చేసి నేను తల్లిలాగా భావించే నా సంస్థపైనే నా చేత అసత్య ప్రచార వీడియోలు చేయించారన్నారు. నేను అనివార్య కారణాల వల్ల కొన్ని తప్పులు చేశానన్నారు. దానికి పర్యావసానంగా సంస్థ నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకొందన్నారు. నాపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారన్న బాధలో నేను ఉంటే దానిని కొంతమంది వ్యక్తులు నన్ను ప్రలోభ పెట్టి ఛైర్మన్ వడ్రాణంపై అసత్య ప్రచారాలు చేయించారన్నారు. ఈ విషయంలో మా పేర్లు బయటకి రాకుండా నీవు ఛైర్మన్‌పై ఆరోపణలు చేయమని ప్రోత్సహించారన్నారు. కానీ నేను తప్పు చేశానని భావించి నా మనస్సాక్షి ఒప్పుకోకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఛైర్మన్ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని నేను స్వయంగా ఈ రోజు డీసీఎంఎస్ ఆఫీస్‌లో మీడియా సమావేశంలో చెప్పారు. నన్ను బెదిరించి ఛైర్మన్‌పై చెప్పమని అన్నారు. నేను ఏమైనా తప్పులు చెప్పి ఉంటే నన్ను ఛైర్మన్ దయచేసి క్షమించమని కోరుకుంటున్నట్లు చెప్పారు. తాను వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయడం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు బూదల ఏసుదాసు చెప్పారు.



# ప్రమాదాలు అరికట్టేందుకే నిరంతర తనిఖీలు : ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర,అగష్టు 26 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకే నిరంతర తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దావులూరు...చివలూరు. .సిరిపురం..కొల్లిపర తదితర గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువకులు మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా కనిపించే విధంగా అమర్చాలన్నారు. నిబంధనలు ఉల్లఘించరాదని.. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని చెబుతూ కారునడిపే వారు కూడా సీట్ బెల్ట్ దరించాలన్నారు. మైనర్లు ఏ ద్విచక్రవాహనం అయినా నడిపినా వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయటం జరుగుతుందని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.



# పాడిపరిశ్రమ అభివృద్ధి చేసుకోండి... ఆర్థికంగా ఎదగండి

**-సంగండైరీ మేనేజర్ ఆదినారాయణ**

**కొల్లిపర,అగష్టు 26 ప్రభాతవార్త:** రైతులు పాడిపరిశ్రమ అభివృద్ధి చేసుకుంటే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని సంగండైరీ మేనేజర్ ఆదినారాయణ స్పష్టం చేసారు. బుధవారం మండల పరిధిలోని హనుమాన్‌పాలెం పాలకేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. పాలకేంద్రం అద్యక్షుడు పాలడుగు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రెండు గేదెలను పెంచటం వలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం 53 మంది రైతులకు లక్షా 35 వేల రూపాయలను బోనస్ పంపిణీ చేసారు. కార్యక్రమంలో సంగండైరీ మేనేజర్ శాఖమూరి వెంకటేశ్వరరావు, జంపని మేనేజర్ రామకృష్ణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# మానవ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజల్లో హక్కులపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తా

**-జాతీయ మానవ హక్కుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చదలవాడ సాయిచంద్**

**మంగళగిరి, ఆగస్ట్ 26, ప్రభాతవార్త :** ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన, చైతన్యం పెంచడంతో పాటు పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, చిన్నారుల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తామని జాతీయ మానవ హక్కుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చదలవాడ సాయిచంద్ తెలిపారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవించాలని ఆయన సూచించారు.. మానవ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజల్లో హక్కులపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానని జాతీయ మానవ హక్కుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చదలవాడ సాయిచంద్ తెలిపారు. సంఘం వ్యవస్థాపకులు, జాతీయ ఛైర్మన్ కే.ఎస్. జ్యోతిశ్వరరెడ్డి తనను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించి నియామక పత్రం, గుర్తింపు కార్డు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, చిన్నారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పనిచేస్తానన్నారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో హక్కులపై చైతన్యం పెరిగినప్పుడే న్యాయం, సమానత్వం, గౌరవంతో కూడిన బాధ్యతాయుత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సాయిచంద్ పేర్కొన్నారు.



# ఎస్సీ,ఎస్టీ, బిసి ఓటర్ల జాబితా ప్రచురణ

**నిజాంపట్నం, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఓటర్ల డ్రాఫ్ట్ లిస్ట్ పబ్లికేషన్ చేశామని ఎంపిడిఓ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 15పంచాయితీల కార్యాల యాలలో పబ్లికేషన్ చేశామని ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఓటర్ల పరిశీలన చేసుకోవచ్చన్నారు. ఎవైనా అభ్యంతా లుంటే సంబంధిత పంచాయితీ కార్యదర్శికి ఈనెల 28లోగా తెలియ జేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తామన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**చిలకలూరిపేట,ఆగస్టు 26,ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ నుండి విజయ బ్యాంక్ మీదుగా నరసరావుపేట సెంటర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వేళ ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు అనే వ్యక్తి తన ఎలక్ట్రికల్ స్కూటీపై ప్రయాణిస్తుం డగా, ఒక్కసారిగా దారితప్పి వేగంగా దూసుకొచ్చిన రెండు బర్రెలు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొన్నాయి. ఈ ఆకస్మిక ఘటనతో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి కిందపడిపోయారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ కౌన్సిలర్ టీడీపీ నాయకులు బేరింగ్ మౌలాలి స్పందించి, బాధితుడికి సహాయంగా నిలిచారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోగా, మౌలాలి స్వయంగా దగ్గరుండి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



# శ్రీరామనామక్షేత్ర శత పవిత్రోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభం

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 26,ప్రభాతవార్త :** స్థానిక ఆర్.అగ్రహారం శ్రీశృంగేరీ శారదాపీఠ పాలిత శ్రీసీతా రామనామ సంకీర్తన సంఘం,శ్రీరామ నామక్షేత్రంలో ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శ్రావణ శుద్ధ త్రయోదశి ఆగష్టు 25నుంచి 28 శుక్రవారం వరకు పవిత్రోత్స వాలు నిర్వహిస్తున్న క్రమంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో మండపానికి చేర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఋత్వికరణం, అంకురార్పణ, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన కలశాలకు పంచగవ్య సుద్ధి, జలాధివాసము అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.



# నూతన కలశాలకు క్షీరాధివాసం

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 26,ప్రభాతవార్త :** స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీశృంగేరీ పీఠ పాలిత శ్రీసీతా రామనామ సంకీర్తన సంఘం,శ్రీరామనామ క్షేత్రంలో ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి,మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శ్రావణ శుద్ధ త్రయోదశి ఆగష్టు 25 నుంచి 28 శుక్రవారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం ఉదయం నూతన కలశాలకు క్షీరాధివాసం వేదమంత్రాల నడుమ భక్తులకు ఆలయ పాలకమండలి వారు క్షీరాభిషేకం చేశారు. యాగశాలలో పవిత్ర ఆది వాసము, నిత్యహోమ, పూర్ణాహుతులను నిర్వహించారు. తీర్థప్రసాదాలతో ఉదయం కార్యక్రమాలు ముగిసాయి. సాయంత్రం కలశములు చతుర్థార్చనలు ,ధాన్యాది వాసము భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాయ తోరణంతో ఆలయాన్ని అలంకరించారు.

# పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!



## జననాల రేటు పడిపోవడంతో రంగంలోకి దిగిన సింగపూర్ ప్రభుత్వం

### భారీ కుటుంబ ప్యాకేజీలు, రాయితీలతో యువతకు వల

**సింగపూర్‌సిటీ, ఆగస్టు 26:** ఆర్థిక అద్భుతాలకు, ఆధునిక జీవనశైలికి చిరునామాగా నిలిచే సింగపూర్, ఇప్పుడు ఓ తీవ్రమైన సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో జననాల రేటు రికార్డు స్థాయిలో పడిపోవడంతో, ప్రభుత్వం రంగంలోకి దిగింది. పిల్లల్ని కనేందుకు యువతను ప్రోత్సహించే లక్ష్యంతో మునుపెన్నడూ లేని విధంగా ఓ భారీ కుటుంబ మద్దతు ప్యాకేజీని ప్రకటించింది. సింగపూర్‌లో పుట్టిన ప్రతి బిడ్డకు 17 ఏళ్లు నిండే వరకు దాదాపు 70,000 సింగపూర్ డాలర్లు అంటే సుమారు రూ. 55 లక్షలు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందనుంది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ జాతీయ దినోత్సవ ర్యాలీలో ఈ ప్రకటన చేశారు. దేశంలో సంతానోత్పత్తి రేటు 0.87తో అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయంతీసుకుంది. ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా యువత పిల్లల్ని కనేందుకు ముందుకు రాకపోవడంతో, ఈసారి మరింత సమగ్రమైన విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త ప్యాకేజీ కేవలం డబ్బుతో సరిపెట్టడం లేదు. కుటుంబాలపై భారం తగ్గించేలా అనేక అంశాలను ఇందులో చేర్చారు. పుట్టిన ప్రతి బిడ్డకు ప్రభుత్వం 10,000 సింగపూర్ డాలర్ల సుమారు రూ. 7.8 లక్షలు బేబీ గిఫ్ట్ అందిస్తుంది. అదనంగా, ఫస్ట్ స్టెప్ గ్రాంట్ కింద మరో 5,000 డాలర్లు సుమారు రూ. 4 లక్షలు ఇస్తారు. బిడ్డ పెరుగుతున్న కొద్దీ ఏటా చైల్డ్ క్రెడిట్స్ రూపంలో 2,000డాలర్లు సుమారు రూ.1.6 లక్షలు చొప్పున జమ చేస్తారు. వీటన్నింటితో పాటు, శిశు సంరక్షణ (చైల్డ్ కేర్) కేంద్రాల్లో సబ్సిడీలను పెంచనున్నారు. తల్లిదండ్రులకు ఇచ్చే సెలవులను కూడా విస్తరించనున్నారు. ప్రభుత్వం నిర్మించే ఇళ్ల కేటాయింపుల్లో పిల్లలు ఉన్న కుటుంబాలకు అదనపు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి బిడ్డకు లాటరీలో ఒక అదనపు అవకాశం లభిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కుటుంబ, సంతాన ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వం సుమారు 7 బిలియన్ల సింగపూర్ డాలర్లు (సుమారురూ. 5.5 వేలకోట్లు) ఖర్చు చేయనుంది. మీరు పిల్లల్ని కనాలని నిర్ణయించుకుంటే, ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుందని ప్రతి కుటుంబం తెలుసుకోవాలని ప్రధాని వాంగ్ భరోసా ఇచ్చారు. ఒకప్పుడు ఇద్దరు చాలు అంటూ తీవ్రంగా ప్రచారం చేసిన సింగపూర్ ప్రభుత్వమే ఇప్పుడు పిల్లల కోసం ప్రాధేయపడాల్సిన పరిస్థితి రావడం గమనార్హం.

1970లలో అధిక జనాభా దేశాభివృద్ధికి భారమని భావించిన ప్రభుత్వం, 1987 నాటికి తన విధానాన్ని మార్చుకుంది. అప్పటి నుంచి జననాల రేటును పెంచేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ప్రసూతి సెలవులు వంటి ఎన్నో ప్రయత్నాలు చేసింది. విశ్వవిద్యాలయ పట్టభద్రులకు మ్యాచ్ మేకింగ్ ఈవెంట్లు కూడా నిర్వహించింది. అయినా పరిస్థితి మారలేదు, సంతానోత్పత్తి రేటు పడిపోతూనే ఉంది. ప్రభుత్వం ఇంత భారీగా డబ్బు వెదజల్లడానికి సిద్ధమైనా, ఇది ఎంతవరకు ఫలిస్తుందనేది సందేహంగానే ఉంది. ఇటీవల వెలువడిన ఓ సర్వేలో, దాదాపు మూడింట ఒక వంతు మంది యువత ఏ ప్రభుత్వ విధానం కూడా తమను పిల్లల్ని కనేలా ప్రోత్సహించలేదని స్పష్టం చేశారు. ఖరీదైన జీవనం, పని ఒత్తిడి, పిల్లల పెంపకానికి అయ్యే అధిక ఖర్చులే తమను ఈ నిర్ణయానికి దూరం చేస్తున్నాయని వారు చెబుతున్నారు.

సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ యూజీన్ టాన్ ఈ చర్యలను "సింగపూర్‌కు లభించిన చివరి అవకాశం"గా అభివర్ణించారు. కేవలం ఆర్థిక ప్రోత్సాహకాలే కాకుండా, వివాహం, సంతానం పట్ల సమాజంలో ఉన్న దృక్పథాలు, మనస్తత్వాలు మారినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, దేశంలో వృద్ధుల జనాభా పెరిగిపోయి, పనిచేసే యువతరం తగ్గిపోతుండటంతో సింగపూర్ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వలసదారులను ఆహ్వానించడం కూడా తప్పదని ప్రధాని వాంగ్ సూచించారు.



# కర్ణాటకలో ఇక వందేమాతరం రెండు చరణాలే

## సిఎం డికెశివకుమార్ వెల్లడి

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలుమాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లుపేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈఅంశంపై కాంగ్రెస్, బిజెపి మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బిజెపి తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటుబ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది. ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బిజెపి ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్‌చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది.

# లడఖ్‌లో డిఆర్‌డివో పారాచూట్ పరీక్ష విజయవంతం




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ సిస్టమ్‌కు సంబంధించిన అధిక ఎత్తు పరీక్షను బుధవారం విజయవంతంగా నిర్వహించింది. లడఖ్‌లోని లేహ్ జిల్లాలో న్యోమాముధ్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్ష చేపట్టారు.అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ ట్రయల్ నిర్వహించారు. సముద్ర మట్టానికి 22,000 అడుగుల ఎత్తు నుంచి టెస్ట్ జంప్ నిర్వహించగా, అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్కు పడిపోయాయి. ఈ వ్యవస్థను డిఆర్‌డివోకు చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూపొందించి అభివృద్ధి చేసింది.సంస్థకు చెందిన ముగ్గురు టెస్ట్ జంపర్లు ఈ ప్రయోగంలో పాల్గొన్నారు. చీఫ్ టెస్ట్ జంపర్ వింగ్ కమాండర్ రాహుల్ ఝా, ఎండబ్ల్యువో ఆర్.జే. సింగ్, విఎంజె, ఎండబ్ల్యు వివేక్ తివారీ ఈ జంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.ట్రయల్‌లో డిఆర్డీవో పాటు స్వదేశీ పారా కంప్యూటర్, ఆక్సిజన్ వ్యవస్థ, ప్రత్యేకంగా రూపొందించిన జంప్‌సూట్లను వినియోగించారు. 20వేల అడుగుల ఎత్తులో పారాచూట్‌ను తెరవగా, జంపర్లు 13,700 అడుగుల ఎత్తులో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. తీవ్ర పరిస్థితుల్లో వ్యవస్థ సామర్థ్యానికి అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ డిఆర్‌డివో సమర్థత, విశ్వసనీయత, వ్యూహాత్మక వినియోగ సామర్థ్యాన్ని ఈ విజయవంతమైన పరీక్ష నిరూపించిందని డిఆర్‌డివో తెలిపింది.ప్రత్యేకించి క్లిష్టమైన అధిక ఎత్తు ప్రాంతాల్లో కార్యకలాపాల కోసం భారతదేశం అభివృద్ధి చేస్తున్న స్వదేశీ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని ఈ పరీక్ష చాటిచెప్పింది. కీలక రక్షణ సాంకేతికతలు, అధిక ఎత్తు వైమానిక సరఫరా వ్యవస్థల్లో ఆత్మనిర్భరతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ విజయవంతమైన ప్రయోగం కీలక ముందడుగుగా నిలుస్తుందని డిఆర్‌డివో పేర్కొంది.




# కర్ణాటకలో కలకలం

## భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు

### సామూహిక ఆత్మహత్యగా పోలీసుల అనుమానం

### మృతులు విజయపుర జిల్లా వాసులుగా గుర్తింపు

**విజయపుర (కర్ణాటక), ఆగస్టు 26:** ఉత్తర కర్ణాటకలోని విజయపుర నగర శివార్లలోఉన్న భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు తేలియాడడటం కలకలంసృష్టించింది. ఉదయం 8.45గంటల ప్రాంతంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను సరస్సును వెలికితీశారు. మృతులను గుర్తింపు ప్రక్రియను ప్రారంభించగా, ప్రాథమిక దర్యాప్తులో సోమవారమే విజయపుర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు అదృశ్యంపై కేసు నమోదైనట్లు గుర్తించారు. శోభ భర్త బీమరాయ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా పోలీసులు వివరాలు రాబట్టారు. మృతులు విజయపుర జిల్లా టికోటా తాలూకా తోరవి గ్రామ వాసులుగా గుర్తించారు. శోభ జలగేరి, ఆమె పిల్లలు విద్య, సువర్ణ(14), గౌడేశ్(10), వికాస్(5), సానిక(7)గా గుర్తించారు. మిస్సింగ్ కేసు ఆధారంగా ఆగస్టు 24న శోభ తన భర్తతో గొడవపడినట్లు తేలింది. తాను ఇంటిని వదిలి వెళ్లిపోతానని, పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఆమె అతనికి చెప్పినట్లు సమాచారం. గొడవ జరిగిన తర్వాత శోభ ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయలుదేరి, మొదట నలుగురు పిల్లలను తనతో తీసుకెళ్లిందని ఎస్పీ లక్ష్మణ్ నింబార్గి తెలిపారు. ఆ తర్వాత, వినికిడి లోపం ఉండి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న తన మరో కుమారుడిని కూడా ఆమె తనతోతీసుకెళ్లింది. ఆ కుటుంబం ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు, కానీ శోభ తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లడంతో వారి ఆచూకీని కనుగొనలేకపోయారు. మరణాలకు దారితీసిన ఖచ్చితమైన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు అయినప్పటికీ, పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనను అనుమానాస్పద ఆత్మహత్యగా పరిగణిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# హెచ్‌ఐవి కట్టడికి ఇంజెక్షన్ వచ్చేస్తోంది

## 'లెనాకాపవీర్' ఉత్పత్తి విక్రయానికి రెడ్డీస్‌కు అనుమతులు

**హైదరాబాద్, ఆగస్టు 26:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ హెచ్ఐవీ వ్యాప్తిని నివారించే లెనాకాపవిర్ జెనరిక్ ఇంజెక్షన్‌ను భారత్‌లో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి పొందింది. ఈ విషయంలో మూడోదశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండానే ఉత్పత్తికి, మార్కెటింగ్‌కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇంజెక్షన్ ధర భారీగా తగ్గే అవకాశంఏర్పడింది. డాక్టర్ రెడ్డీస్‌తోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు కూడా నిపుణుల కమిటీ ఈ అనుమతిని మంజూరు చేసింది. అయితే, మార్కెట్లోకి విడుదల చేశాక నాలుగో దశ క్లినికల్ పరీక్షలు నిర్వహించి, ఆ డేటాను సమర్పించాలని కంపెనీలను ఆదేశించింది. ఈఇంజెక్షన్‌ను హెచ్ఐవీ ముప్పు అధికంగా ఉన్నవారు (కనీసం 35కిలోల బరువుఉండాలి) ఏడాదికి రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ఫార్మా సంస్థ గిలీడ్ సైన్సెస్‌కు 'లెనాకాపవిర్' ఔషధంపై పేటెంట్‌ఉంది. అయితే, ఎలాంటి రాయల్టీ తీసుకోకుండా భారత్‌తో పాటు 120 అల్పాదాయ దేశాల్లో ఈ మందును తయారు చేసేందుకు గిలీడ్ పలు కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసింది. అమెరికా, ఈయూ దేశాల్లో దీని వార్షిక ఖర్చు రూ.27 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉండగా, జెనరిక్ రాకతో భారత్‌లో ప్రస్తుతం ఉన్న ధర కంటే 50 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఆరిజెన్‌కు భారీ కాంట్రాక్టు**

డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ అయిన ఆరిజెన్ ఫార్మా ఒక అంతర్జాతీయ కంపెనీ నుంచి భారీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ఒప్పందం కింద దీర్ఘకాలం పాటు స్టెరైల్ ఇంజెక్టబుల్స్, బయోలాజిక్స్ తయారు చేసి సరఫరా చేయనుంది. కాంట్రాక్టులోని షరతుల కారణంగా భాగస్వామ్య కంపెనీ పేరును వెల్లడించలేదు.

# ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా




**వాషింగ్టన్,ఆగస్టు 26:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొనసాగుతున్న వలస వ్యతిరేక చర్యల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా నిలిపివేయడం ప్రారంభించారు. అమెరికా విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం అన్ని విదేశీ దౌత్య కార్యాలయాల్లో చేపడుతున్న గ్లోబల్ శిక్షణ కార్యక్రమానికి అనుగుణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లలో మార్పులు చేస్తున్నారు.ఈ శిక్షణ కార్యక్రమం కారణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లను సర్దుబాటు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈమార్పులు ఎంతకాలం కొనసాగుతాయన్న దానిపై స్పష్టమైన గడువును ప్రకటించలేదు. అమెరికా ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందని భావించే దరఖాస్తుదారులను గుర్తించడంతో పాటు, వీసాఅభ్యర్థులను సమగ్రంగా, ఒకే విధమైన ప్రమాణాలతో పరిశీలించేందుకు కాన్సులర్ అధికారులకు శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొంది. ఇప్పటికే ఇంటర్వ్యూలకు అపాయింట్‌మెంట్లు పొందిన వలస వీసా దరఖాస్తుదారులకు అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు ఈమెయిళ్లు పంపినట్లు తెలిపింది. వారి అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేస్తున్నామని, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని అందులో పేర్కొన్నట్లు వెల్లడించింది.ట్రంప్ కఠిన వలస విధానంట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై భారీ స్థాయిలో దేశ బహిష్కరణ చర్యలను చేపడుతోంది. ఇందులో వీసాలు, గ్రీన్ కార్డుల రద్దు, వివిధ కారణాలతో వలస దరఖాస్తుల తిరస్కరణ వంటి చర్యలు ఉన్నాయి. రాజకీయ అభిప్రాయాలు, అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ గాజాపై జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా నిర్వహించిన పాలస్తీనా అనుకూల నిరసనల్లో పాల్గొనడం వంటి అంశాలు కూడా కొన్ని సందర్భాల్లో కారణాలుగా మారుతున్నాయి. వేలాది మంది భారతీయ నిపుణులు వినియోగించే హెచ్1బీ వీసా కార్యక్రమంలో కీలక మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన కొత్త ప్రతిపాదనపై ట్రంప్ ప్రభుత్వం ఈ వారం వైట్‌హౌస్ స్థాయిలో సమీక్ష ప్రారంభించింది. ఈ ప్రతిపాదనను ఆర్థికంగా కీలకమైనదిగా వర్గీకరించారు. అంటే ఏడాదికి కనీసం 100 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని చూపే లేదా ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాలు, ఉత్పాదకత, పోటీ లేదా ప్రధాన ఆర్థిక రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉన్న ప్రతిపాదనగా దీనిని పరిగణిస్తున్నారు.

# అంతర్గత భద్రత పటిష్టతే వికసిత్ భారత్‌కు పునాదులు: హోం మంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో జాతీయ భద్రతా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 15 నుంచి 20 యేళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉందని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు. కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షాచెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు. పిఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్రరాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగాధ్వంసంచేసేందుకు ప్రహార్ వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్ విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకుపిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని సూచించారు.

# పుట్టింటికెళ్లడానికి భర్త అనుమతి అక్కర్లేదు

## ఇంటి పనులు చేయాలని బలవంతం చేయలేరు

### తల్లిదండ్రులను చూసుకోవాలని ఆదేశించలేరు: కర్ణాటక హైకోర్టు



**బెంగళూరు, ఆగస్టు 26:** వివాహం అనేది అవతలి వ్యక్తిని నియంత్రించడానికి ఇచ్చే లైసెన్స్ కాదని, భర్తతో సహా ఎవరూ కూడా ఇంటి పనులు చేయాలని లేదా తన తల్లిదండ్రులను చూసుకోవాలని భార్యను ఆదేశించలేరని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భరణం కోసం బిఎన్ఎస్ఎస్ 2023లోని సెక్షన్ 144(1) కింద దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా, ఫ్యామిలీ కోర్ట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 19(4) కింద దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు పరిశీలిస్తూ జస్టిస్ చిల్లకూరు సుమలత నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "భారతీయ మహిళ తనకిష్టమైనప్పుడు పుట్టింటికి వెళ్లాలనే ప్రాథమిక కోరికను తీర్చుకోవడానికి, అత్తవారింట్లో ఉన్నవారి అనుమతి ఎందుకు తీసుకోవాల్సి వస్తుందో ఈ కోర్టుకు అర్థం కావడం లేదు. భర్తతో సహా ఎవరూ కూడా, భార్యతో సహా ఏ మహిళనైనా ఇంటి పనులు చేయమని లేదా తన తల్లిదండ్రులను చూసుకోమని ఆదేశించకూడదని లేదా డిమాండ్ చేయకూడదని ఈ కోర్టు భావిస్తోంది. ఇంటి పనులను స్త్రీ పురుషులు సమానంగా పంచుకోవాలి. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు, ఆ బాధ్యత ప్రధానంగా కుమారుడు లేదా కుమార్తెపై ఉంటుంది తప్ప, అల్లుడు లేదా కోడలిపై కాదు. అత్తమామలను చూసుకోవడం అనేది అల్లుడు లేదా కోడలు స్వచ్ఛందంగా చేయాల్సిన పనికావాలితప్ప, బలవంతంగా చేయించకూడదు" అని పేర్కొంది. "ఒక మహిళకు తన కెరీర్, ఆర్థిక విషయాలు మొదలైన వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ప్రాథమిక, సంపూర్ణ హక్కు ఉంటుంది. తన కోరికలు, అంచనాలకు అనుగుణంగా జీవించేలా భర్త తన భార్యను బలవంతం చేయలేరు" అని స్పష్టం చేసింది. "వివాహం అనేది అవతలి వ్యక్తి వ్యక్తిత్వం, స్వేచ్ఛ, సంకల్పాలను నియంత్రించడానికి, శాసించడానికి, ఆధిపత్యం చెలాయించడానికి లేదా అణచివేయడానికి ఇచ్చే అనుమతిపత్రం కాదు" అని అది పేర్కొంది. "కేవలం లింగభేదం ఆధారంగా మహిళ స్వయంప్రతిపత్తిని హరించడానికి లేదా ఆమె స్వేచ్ఛను పరిమితం చేయడానికి చేసే ఏ ప్రయత్నమైనా సమానత్వ సూత్రాలకు విరుద్ధం. మానవ గౌరవం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం" అని ధర్మాసనం అభిప్రాయపడింది.

# సంక్షిప్త వార్తలు

## ఆస్పత్రిలో అగ్నిప్రమాదం: 15మంది శిశువులు మృతి



**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని బుధవారం ఉదయం ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలోని లోపం కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 15 మంది శిశువులు మరణించారు. పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్) ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య వార్డు మూడవ అంతస్తులో ఉదయం ఉదయం 6:45 గంటల ప్రాంతంలో నర్సరీ లోపల ఎయిర్ కండిషనింగ్ యూనిట్ పేలడంతో మంటలు చెలరేగాయని సహాయక సిబ్బంది తెలిపారు. ఆ సమయంలో వార్డులో 16 మంది నవజాత శిశువులు ఉన్నారని, వారిలో ఒకరిని రక్షించామని అధికారులు తెలిపారు.

## పంజాబ్‌లో నేడు ఉద్యోగులు, పెన్షనర్ల మహాబంద్

**అమృత్‌సర్, ఆగస్టు 26:** పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కనున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్త మహాబంద్‌కు పిలుపునిచ్చారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 4 లక్షల మంది ఈ బంద్‌లో పాల్గొననున్నారు. ఆప్ ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన డిఎలు ఇంకా విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ ఆందోళన చేపట్టనున్నారు. దీంతో గురువారం మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు, ప్రైవేటు కార్యకలాపాలు కూడా స్తంభించే అవకాశాలున్నాయి.

## రాజీనామాకు సిద్ధమైన కర్ణాటక మంత్రి నాగేంద్ర

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటక మంత్రి బి.నాగేంద్ర రాజీనామాకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల ఆరోపణల కేసులో నిందితుడిగా ఉన్న ఆయనపై విపక్షాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. మంత్రివర్గంలోకి తీసుకోవడంపై సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాగేంద్ర మంగళవారం ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. తన కొనసాగింపు పార్టీకి ఇబ్బందిగా మారుతోందని చెప్పినట్లు తెలుస్తోంది. బిజెపి తనను లక్ష్యంగా చేసుకుంటోందని, పార్టీ ప్రతిష్ఠ కోసం పదవి నుంచి తప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పినట్లు సమాచారం.

## జాత్యహంకార వ్యాఖ్యలపై ఉషావాన్స్ కౌంటర్

**న్యూయార్కు, ఆగస్టు 26:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ జాతి వివక్ష వ్యాఖ్యలను ఎదుర్కొన్నారు. ఆమె భారతీయ మూలాలను ఉద్దేశిస్తూ మిచిగాన్ డెమొక్రాటిక్ సెనేట్ అభ్యర్థి అబ్దుల్ ఎల్‌సయీద్ చేసిన వ్యాఖ్యలు అమెరికా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ విమర్శలపై ఉషా వాన్స్ ఎంతో హుందాగా, గట్టిగా స్పందించారు. ఇటీవల ఒక ర్యాలీలో జేడీ వాన్స్, అబ్దుల్ ఎల్ సయీద్పై విమర్శనాస్త్రాలు సంధించారు. షరియా చట్టంపై విమర్శలను శ్వేతజాత్యహంకారంతో ముడిపెడుతూ గతంలో ఎల్‌సయీద్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.

## ఇమ్రాన్ ఆరోగ్యంపై కుమారుడి ఆందోళన

**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్‌ఏఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్న తమ తండ్రికి సరైన వైద్యం అందకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదం జరగవచ్చని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఇమ్రాన్‌కుమారులు ఖాసిం, సులేమాన్ ఈవ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయన జైలునుంచి ప్రాణాలతోబయటపడటం కష్టంగానే కనిపిస్తోందని ఖాసిం వ్యాఖ్యానించారు.

## ఫైరింజన్ నీళ్లతో ఎమ్మెల్యే కారు శుభ్రం

**సింగ్రౌలీ, ఆగస్టు 14:** మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన బిజెపి ఎమ్మెల్యే రామ్ నివాస్ షా కారును ఫైరింజన్ నీటితో శుభ్రం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అయింది. అగ్నిప్రమాద సమయంలో ఎమర్జెన్సీ కోసం వినియోగించే ఫైరింజన్ నీటితో కారును క్లీన్ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ నివాసం ఆవరణలో టొయోటా ఇన్నోవా కారును క్లీన్ చేశారు. అయితే తనకు తెలియకుండానే కారును శుభ్రం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

## 'మదర్ థెరిసా నిస్వార్థ సేవలను మననం చేసుకుందాం'

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పేదలు, అనాథల సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ప్రేమారాహిత్యంతో బాధపడుతున్న వారిని మదర్ థెరిసా అక్కున్న చేర్చుకున్నారని తెలిపారు. ఆమె నిస్వార్థ సేవలను స్మరించుకుందాం అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు తెలియజేశారు. సాటిమనిషిలోని బాధను తొలగించడమే దైవత్వం. పేదరికం, ప్రేమరాహిత్యంతో బాధపడుతున్న నిస్సహాయులను అక్కున చేర్చుకుని ప్రేమను పంచి, సపర్యలు చేశారు 'మదర్ థెరిసా. ఈరోజు ఆ మహనీయురాలి జయంతి సందర్భంగా విశ్వవ్యాప్తమైన ఆమె నిస్వార్థ సేవలను, దివ్య చరితను మననం చేసుకుందాం అంటూ ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

## సిపిఎం నేత మధు సతీమణి సుమతి మృతికి సిఎం సంతాపం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సిపిఎం సీనియర్ నేత మధు సతీమణి సుమతి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఐద్వా నాయకురాలిగా మహిళా హక్కుల సాధన కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం పోరాడారని కొనియాడారు. మరణానంతరం ఆమె భౌతికకాయాన్ని వైద్య పరిశోధనలకు అప్పగించడం అత్యంత ఆదర్శనీయమని ప్రశంసించారు. సుమతి కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మానవతా సేవకు ప్రతీకగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో సౌమ్య

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ మహోపకారి, విశ్వ కారుణ్యమూర్తి, జగత్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జన్మదినాన్ని పురస్కరించుకుని నందిగామ పట్టణంలోని ప్రతిభ హైస్కూల్ వేదికగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులతో కలిసి రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సౌమ్య, రక్తదాతలను అభినందించారు. అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో విలువైన సేవ అని, సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన ప్రేమ, దయ, సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, మత పెద్దలను, కూటమి నాయకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, రక్తదాతలు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## అనూహ్యంగా పెరిగిన రద్దీ

### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం ముందే తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. బుధవారం సెలవు కావడంతో ఉదయానికి తిరుమలలో భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల రెండు కిలోమీటర్లు దూరం చేరాయి. ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండపై రద్దీ పెరిగింది. ఉదయం 6గంటలకే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయాయి. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

## 28న మలయప్పస్వామి గరుడసేవ



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈనెల 28వ తేదీ శుక్రవారం రాత్రికి గరుడసేవ జరుగుతుంది. సాధారణంగా ప్రతినెలలో పౌర్ణమిన గరుడసేవ టిటిడి నిర్వహిస్తుంది. 28న శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. దివ్యాభరణాలు ధరించే మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు.

## "స్వయంభూ" చిత్రం త్వరలోనే విడుదల



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తన ఇష్టదైవమని, ఆ స్వామిని మనసారా కొలిచి వేడుకుంటే అంతా శుభాలు కలుగుతాయని సినీనటుడు నిఖిల్ సిద్ధార్థ్ తెలిపారు. తాను ఇప్పటికే మూడు చిత్రాల్లో నటిస్తున్నా త్వరలోనే "స్వయంభూ" చిత్రం విడుదల కానుందని నిఖిల్ చెప్పారు. చిత్రం విడుదల తేదీ ప్రకటించడానికి ముందు తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. స్వామివారి ఆశీస్సులతానే చిత్రాల్లో బిజీగా నటిస్తున్నానని విశ్వాసం వెలిబుచ్చారు. నిర్మాత ఠాగూర్ మధుతో కలసి బుధవారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆ స్వామివారి దర్శనం తనకెంతో ఆనందం కలిగించిందని అన్నారు. తాను నటించబోయే రాబోయే కొత్త చిత్రాలు విజయవంతం కావాలని, స్వామివారి ఆశీస్సులు పొందడానికి శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. క్యూ లైన్లలో నిఖిల్‌ను చూసిన అభిమానులు, భక్తులు ఆలయం వెలుపల ఆయనతో ఫోటోలు, సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా జగన్‌రెడ్డి

- మంత్రి కొల్లు రవీంద్ర సవాల్
- ఎన్ని అబద్దాలు చెప్పినా వైసిపిని ప్రజలు నమ్మరని వ్యాఖ్య



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమపై ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్న జగన్ రెడ్డి, తన పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు. 'గత ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ రెడ్డి రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఏకంగా రూ.13,500 కోట్లు ఖర్చు చేసింది. పట్టిసీమ ప్రాజెక్టు దండగ, పంపుల్ని ఇనప సామాన్లకు అమ్ముకోవడం ఉత్తమం అని విమర్శించిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టు కృష్ణా డెల్టా ప్రాంతంలో తాగు, సాగునీటి అవసరాలకు అండగా నిలుస్తోందనే విషయం గుర్తుంచుకోవాలి. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఖర్చు చేస్తూ కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందిస్తున్నాం. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.8 వేల కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితులకు పరిహారం అందించే చర్యలు చేపడుతున్నాం. పురుషోత్తపట్నం ద్వారా అనకాపల్లి వరకు నీటిని తీసుకెళ్లే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది' అని వివరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం, బిసి రిజర్వేషన్లు, డ్రగ్స్, మద్యం, పెట్టుబడులు, ఉద్యోగాల అంశాలపై జగన్ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల కోసం ఏ మాత్రమూ కాదని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని, వ్యవసాయాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పాలన సాగిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వైసిపి నేతల కల్తీ మద్యం నుండి, గంజాయి గూండాల నుండి, డ్రగ్స్ మాఫియాల నుండి కాపాడుకుంటున్నామన్నారు. జగన్ రెడ్డికి ప్రజల పట్ల చిత్తశుద్ధి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. అంతేగానీ ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కరువు పరిస్థితులు, వర్షాభావం వంటి అంశాలపై అసెంబ్లీలో క్షుణ్ణంగా చర్చించాం. ఆ సమయంలో జగన్ రెడ్డి సహా వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంచినీటి అవసరాలు తీర్చి వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం. గత ప్రభుత్వం రైతులకు ఏం మేలు చేసిందో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.

# రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే ప్రభుత్వం స్పందించడం లేదు

**వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మండిపాటు**



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాలు కురవక, పంటలు పండక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు.

# నవంబర్‌లో శ్రీవారి పుష్పయాగం

- ఒక్క టికెట్‌పై ఒకే రోజు రెండుసార్లు తిరుమలేశుని దర్శనం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి క్షణకాలంపాటు దర్శించుకుంటేనే లక్షలాదిమంది భక్తులు ఆత్మసంతృప్తి చెందుతుంటారు. ఇంకా ఆ స్వామిని మళ్ళీమళ్ళీ చూడాలనిపించి భక్తుల మనసు ఉవ్విళ్ళూరుతుంది. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి జరిగే పుష్పయాగం రోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్పయాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ రూ.700లు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించే స్నపన తిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్లలో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్పయాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

# వర్షాల కోసం 30నుండి కారీరిష్టి పర్జన్య శాంతి యాగం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే తక్కువ వర్షపాతం నమోదైంది. ఉపద్రవాల నుండి ప్రజలను రక్షించడానికి, నీటిసమస్య అధిగమించడానికి దీంతో ధార్మిక సంస్థ టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి ఐదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాలలో వరుణయాగాన్ని నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహుర్తాన్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణయాగాన్ని నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని ప్రార్థిస్తూ తిరుమలలో ఆగస్టు 30 నుండి వరుణయాగం (కారీరి ఇస్టి, పర్జన్య శాంతి) నిర్వహించనున్నారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో నిర్వహించనున్న వరుణయాగంతో దేశంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థించనున్నారు. మేఘాలను ఆకర్షించి కుంభవృష్టి వర్షం కురిసేలా అనుగ్రహించాలని వేదమంత్రాలతో పూజిస్తారు.

## బి. ఫార్మసీ సిలబస్-2026 అమలుపై చిప్స్ కళాశాలలో అవగాహన కార్యక్రమం

**గుంటూరు విద్య ఆగస్టు 26 ప్రభాతవార్త** చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో జాతీయ విద్యా విధానం-2020 కు అనుగుణంగా రూపొందించిన బి .ఫార్మసీ సిలబస్-2026ను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక అవగాహన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డా . ఎస్ . విద్యాధర తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్ ఈ ఎస్ , కళాశాల అధ్యక్షుడు డా ఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా . ఎస్ . విద్యాధర మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలు, ఆచరణాత్మక సామర్థ్యాలు, పరిశోధనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనా విధానం మరియు ఉపాధి అవకాశాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించే విధంగా బి. ఫార్మసీ విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడం అని చెప్పారు. అంతే కాకుండా కళాశాల జాతీయ స్థాయిలో సాధించిన విజయాలను గురించి సభాముఖముగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పిసిఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. ఎం. నిరంజన్ బాబు, డా. ఎం.డి. సలాహుద్దీన్ ,సిఎస్ఐఆర్ ఐఐసిటి సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. కె. సురేష్ బాబు , మణిపాల్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. అనూప్ కిషోర్ తదితరులు ఆయా అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ , సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ సి.ఎన్ శ్రీనివాస్ ట్రెజరర్ డాక్టర్ ఆర్ గోపాల్ కృష్ణ హాజరయ్యారు,.




## మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల నిర్మించండి

**ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసి విన్నవించిన ఆవాజ్ నాయకులు**



**చిలకలూరిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** చిలకలూరిపేట మండలంలోని తాతపూడి గ్రామంలో మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించి నియోజకవర్గంలోని ముస్లిం బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆవాజ్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రత్తిపాటిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 201419 టీడీపీ ప్రభుత్వ హయాంలో తాతపూడి గ్రామంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా, పనులు ప్రారంభించకపోవటంతో పేద ముస్లిం బాలికలు విద్యకు దూరమోతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. రూ.18 కోట్లతో నిర్మించే గురుకుల పాఠశాలలో వందలాది మంది బాలికలు చదువుకునేందుకు అవకాశం ఉన్నందున త్వరితగతిన పాఠశాల నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ, పాఠశాల నిర్మాణ విషయమై ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళానన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని హామీనిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఆవాజ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ ఫైరోజ్, దరియాహుస్సేన్, మహమ్మద్ ఫైజ్, సుభాని, ఖాన్‌సా, ఆదిల్, అలి, జాకీర్, అర్షద్, సిరాజ్, రియాజ్‌బాషా, బాజి, కరిముల్లా, అబుబకర్, నాగూర్‌మీరా, సీపీఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు ఉన్నారు.

## జగనే వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపం

### మంత్రి సత్యకుమార్ యాదవ్



సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ఆయన వెన్నుపోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మంత్రి మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసిపి అధినేతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బిసి రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. బిసిలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. బిసిలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కూటమి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కూటమి ప్రభుత్వానికే ఉందని జగన్ ఆందోళనతో మరోసారి తేలిపోయిందని మంత్రి వివరించారు.

## లొంగిపోయిన హిడ్మా గన్‌మెన్

### మరో ఇద్దరు సహచరులూ... ధ్రువీకరించిన పోలీసులు




**చింతూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రంపచోడవరం ఒఎస్‌డి పంకజ్ కుమార్ మీనా ఎదుటి ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా చింతూరు ఎఎస్‌పి. కార్యాలయంలో మీడియా సమావేశంలో ఒఎస్‌డి పంకజ్ కుమార్ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి మావోయిస్టు పార్టీ ప్లాటూన్ కమిటి సభ్యురాలు ముచ్చికి మంగి, పార్టీ సభ్యులు కణితి లక్ష్మయ్య, కణితి ఎంక లొంగిపోయినట్టు ప్రకటించారు. మావోయిస్టులకు పట్టు తగ్గటం, పోలీసుల గస్తీ, క్యాంప్స్ పెరగటం వల్ల స్వేచ్ఛగా తిరగలేక లొంగిపోయినట్టు తెలిపారు. లొంగిపోయిన వారికీ సరెండర్, రిహాబిటేషన్ పాలసి ప్రకారం ప్రశాంత జీవితం గడపటానికి ప్రభుత్వం ద్వారా అర్హత ఉన్న అన్ని సౌకర్యాలు అందించబడుతాయని అన్నారు. ఇంకా ఎవరైన అడవుల్లో, దళల్లో తిరుగుతుంటే ప్రశాంత జీవితం కోసం లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగి హిడమాకు అంగరక్షకురాలిగా 2023 వరకు పనిచేసి, ఆరోగ్యం సహకరించక కుంట ఎల్‌ఓఎస్‌లో చేరిందని తెలిపారు. ఈ సమావేశంలో ఒఎస్‌డితో పాటు దీప, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్, చింతూరు సిఐ సిహెచ్ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ప్రత్యేక టెట్ లో సవరణలు చేయాలి: ఏపీటీఎఫ్

**గుంటూరు విద్య ఆగస్టు 26 ప్రభాతవార్త** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ నందు ఉపాధ్యాయులకు ఎటువంటి మినహాయింపులు లేవు. కావున నోటిఫికేషన్ ను సవరించి ఇవ్వాలి అని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు మేకల సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ 1938 ఆధ్వర్యంలో టెట్ నోటిఫికేషన్ సవరణలు కొరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు మాట్లాడుతూ ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ లో




ఉపాధ్యాయులందరికీ అర్హత మార్కులు 40 శాతంగా, పరీక్ష ఆన్లైన్ లో కాకుండా ఆఫ్లైన్లో నిర్వహించుట, బోధన సబ్జెక్టుల ప్రామాణికంగా పరీక్షలు నిర్వహించాలని, స్పెషల్ టెట్ డిసెంబర్ మాసంలో నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పట్ల సానుకూల దృక్పథంతో ప్రత్యేక మినహాయింపుల కొరకు కేంద్ర ప్రభుత్వానికి ( ఎన్ సి టి ఈ)నకు ప్రతిపాదనలు పంపవలసినదిగా కోరినారు.సీనియర్ నాయకులు ఏ.వి రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ ఎటువంటి మినహాయింపులు లేని కారణంగా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మేకల సుబ్బారావు ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు,రాష్ట్ర కౌన్సిలర్స్, జి. వేళాంగిణి రాజు, ముప్పాళ భాస్కరరావు జిల్లా సహాధ్యక్షులు ఎం. సాయన్న, అదనపు కార్యదర్శి ఓ. నాగార్జున, ఉపాధ్యక్షులు ఆనంగి శ్రీనివాస్, ఏ. జోజప్ప జిల్లా కార్యదర్శి వై. నాగమల్లేశ్వరరావు, నగర సహాధ్యక్షులు ఎన్. ప్రసాద్, సీనియర్ నాయకులు ఏ.వి.రామారావు, ఎం. భాను, జె. సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## అస్మాను పరామర్శించిన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణానికి చెందిన కరీముల్లా ఫర్నిచర్స్ అధినేత కరీముల్లా కుమారుడు ఖాదర్ వారి సతీమణి అస్మాకు ఇటీవల ఆక్సిడెంట్ జరగగా, ఈరోజు



పట్టణంలోని వారింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకొని, వారిని పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.

## జోస్ఫిన్‌కు ఏఎన్‌యు పీహెచ్‌డి ప్రదానం



**గుంటూరు విద్య, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మట్లపూడి జోస్ఫిన్‌కు ఏఎన్‌యులోని విద్యా విభాగం నుంచి పీహెచ్‌డి డిగ్రీని ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తెలిపారు. ఎఫెక్టీవ్‌నెస్ ఆఫ్ అబాకస్ స్ట్రాటజీస్ ఇన్ ద అక్విజిషన్ ఆఫ్ ఆర్థిమాటికల్ స్కిల్స్ ఇన్ మాథమాటిక్స్ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. జోస్ఫిన్‌కు పరిశోధనలో పర్యవేక్షకులుగా డాక్టర్ జె.ఆర్.ప్రియదర్శిని వ్యవహరించారు.

# తిరుపతిలో కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం

### ముగ్గురు కార్మికులకు గాయాలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** నిర్మాణంలో ఉన్న పక్క భవనానికి ఆనుకుని ఉన్న పాత భవనం ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తప్పింది. నాలుగంతస్తుల భవనానికి బీటలు వారడంతో ఆ ఇంట్లో ఉంటున్న సభ్యులు ఖాళీచేసిన కొన్ని గంటల్లోనే ఈ సంఘటన జరగడం విశేషం. ఈ సంఘటనతో ఏం జరిగిందనే కలకలం రేగింది. తిరుపతి- పల్నికాపల్లం ప్రధాన మార్గంలో ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని వాణీనగర్‌లో కలశం బిల్డింగ్ పక్కనే ఈ ప్రమాదం జరిగింది. భవనం కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నూతన భవనం నిర్మాణం కోసం పక్కనే గుంత తవ్వుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుంత తవ్వకాల్లో భాగంగా భవనం పునాదులు బలహీనపడటంతోనే కూలిపోయాయి. భవనం కూలిపోవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని శిథిలాలను తొలగించే పనులు చేపట్టారు. శిథిలాల కింద ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. నూతన భవన నిర్మాణం కోసం గుంతలు తవ్వడం వల్ల పునాదులు బలహీనపడి, కూలిన భవనానికి బీటలు వారడంతోనే కూలిపోయిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

## కాకినాడలో దారుణ హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక ప్రతినిధి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడ నగరం నడిబొడ్డున ఉన్న భానుగుడి సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు కోడమాటి సతీష్ రెడ్డి (30)గా పోలీసులు గుర్తించారు. సతీష్ కాకినాడలో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భానుగుడి సెంటర్‌లోని వార్షిగార్ టీ స్టాల్ సమీపంలో సతీష్ రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. కత్తితో మెడ భాగంలో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. హత్యకు ఆక్రమ సంబంధం, ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చన్న కోణంలో కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెరుగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### ఇరాన్‌పై మరింత కఠినంగా అమెరికా ఆంక్షలు

**టెహ్రాన్, ఆగస్టు 26:** అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని అమెరికా మరింత పెంచుతుండగా, గల్ఫ్ ప్రాంతం లోని ఇంధన సరఫరాలపై ప్రతి కార చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తోంది. మరోవైపు, వ్యూహాత్మకమైన హార్ముజ్ జలసంధిపై నియంత్రణ విషయంలో ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతంలో పోటీచేసుకుంటున్న కీలక ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు మరింత కఠినం చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆదాయ మార్గాలను దెబ్బతీయడంతో పాటు, టెహ్రాన్‌ను అంతర్జాతీయంగా మరింత ఒంటరిచేసే లక్ష్యంతో అమెరికా విస్తృత స్థాయిలో కొత్త ఆంక్షలను అమలు చేస్తోంది. అమెరికా ఒత్తిడి, పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ మరోసారి రికార్డు కనిష్టానికి పడిపోయింది. దీంతో ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఇరాన్ ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. దీంతో ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి.ఇరాన్‌పై ఒత్తిడికి మిత్రదేశాలు కలిసిరావాలని అమెరికా పిలుపుఆంక్షలను మరింత కఠినతరం చేస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఇరాన్‌తో ఆర్థిక, ఆర్థిక సంబంధాలను తెంచు కోవాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతోంది. హర్మూజ్ జలసంధిలో కొనసాగుతున్న అంతరాయాల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల నుంచి మరోసారి భారీగా చమురు విడుదలైంది. దీంతో ఆ నిల్వలు 1982 తర్వాత ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

# పార్లమెంట్ పరిధిలో సమన్వయంతో పనిచేద్దాం

### టిడిపి శ్రేణులకు పనబాక లక్ష్మి హితవు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలని పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. బుధవారం తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన టిడిపి కేడర్ నాయకులతో పార్లమెంట్ కార్యాలయంలో పనబాక లక్ష్మి సమావేశమయ్యారు. పార్లమెంట్ స్థాయి కమిటీలో తిరుపతి పార్లమెంట్ పరిధిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జ్ జెబి శ్రీనివాస్, పార్లమెంట్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేరవేయాలని సమావేశంలో చర్చించారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, నాయకులు– కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని నిర్దేశించారు.

# ఉత్కంఠగా అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో నాలుగురోజులు పాటు జరుగుతున్న అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు పలు జిల్లాల క్రీడాకారుల మధ్య ఉత్కంఠగా సాగుతోంది. ఈ పోటీలు బుధవారం మూడో రోజు అనేక అంశాలపై క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఇందులో కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, బ్యాడ్మింటన్ జట్లు క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను తిలకించేందుకు తిరుపతి యువత, విద్యార్థులు భారీగా తరలివస్తున్నారు.సందర్శకులతో తిరుపతి క్రీడా మైదానాలు సందడిగా మారాయి. విజయమే లక్ష్యంగా ఉత్సాహంగా బరిలోకి దిగుతున్న క్రీడాకారులు. ఖో ఖో అండర్ 23క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం మీద 3 పాయింట్స్‌తో విజయనగరం గెలుపొందింది. అండర్ 17 మహిళల విభాగంలో బాస్కెట్బాల్ కాకినాడ జట్టుపై పల్నాడు జిల్లా జట్లు హోరాహోరీగా తలపడగా పల్నాడు జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్ళింది. బాస్కెట్ బాల్ అండర్ 17 బాలికల విభాగంలో గుంటూరు, పశ్చిమగోదావరి జట్టుల క్వార్టర్స్‌లో పోటాపోటీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఖో ఖో అండర్ 23 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు మీద 105 పాయింట్స్‌తో అనంతపురం గెలుపొందింది. అండర్ 23 పురుషుల హాకీ జట్టులో విశాఖపట్నం జట్టుపై అనకాపల్లి జిల్లా జట్టు విజయం సాధించింది. హాకీ అండర్ 23 పురుషుల విభాగంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా మూడవ క్వార్టర్స్ ఫైనల్‌లో హోరా హోరీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్–17 మహిళల వాలీబాల్ క్వార్టర్ ఫైనల్స్‌లో సత్యసాయి– ఎన్టీఆర్ జిల్లాల జట్ల క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవి నాయుడు పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్‌ను ప్రారంభించి, ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాస్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. వాలీబాల్ అండర్ 17 గర్ల్స్ ఎన్టీఆర్ జిల్లా పై

# వృద్ధురాలి హత్య కేసు నిందితుల అరెస్ట్

- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనంకేసు ఛేదనలో పోలీసు డాగ్, సిసి కెమెరాల పుటేజీలు కీలకం



**శ్రీకాకుళం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన చింతు చిన్నమ్మడు(70) హత్య కేసును శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి, మృతురాలి వద్ద నుంచి అపహరించిన సుమారు రూ.38 లక్షల విలువైన 24 తులాల బంగారం, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, మృతురాలు హైదరాబాద్‌లో నివసిస్తూ అప్పుడప్పుడు తన స్వగ్రామమైన అల్లాడపేటకు వచ్చి వెళ్తుండేది. ఈ క్రమంలో ఆగస్టు 11న గ్రామానికి వచ్చిన ఆమె, 17న గ్రామంలో జరిగిన కార్యక్రమానికి బంగారు ఆభరణాలు ధరించి హాజరై, అనంతరం ఆర్టీసీ బస్సులో నరసన్నపేటకు చేరుకుంది. అక్కడ సుమారు ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం నిమిత్తం లాయర్ ధనలక్ష్మి ఇంటికి వెళ్లింది. అనంతరం ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో జలుమూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో, మృతురాలు ధరించిన బంగారు ఆభరణాలను కాజేయాలనే ఉద్దేశంతో బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మి, గణేష్ తదితరులు పథకం రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారం మృతురాలిపై దాడి చేసి హత్య చేసిన అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి, మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతదేహాన్ని హిరమండలం మండలం పింద్రువాడ సమీపంలోని బ్రిడ్జి కింద తంపర కాలువలో పడవేసినట్లు గుర్తించారు. అనంతరం నిందితులు అపహరించిన సొత్తును తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి, హత్యకు దోపిడీ ఉద్దేశం ఉన్నట్లు నిర్ధారించి మర్డర్ ఫర్ గైన్ కేసుగా దర్యాప్తు కొనసాగించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తులో భాగంగా సిసి కెమెరాలు, సాంకేతిక ఆధారాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు మరియు క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయం చేస్తూ పోలీసులు కేసును ఛేదించారు. సిడిఆర్ విశ్లేషణ, ట్రాకర్ డాగ్ సహాయం, కారు ట్రాకింగ్ హిస్టరీ, డ్రోన్, క్లూస్ టీమ్ విశ్లేషణ, స్థానిక సమాచారం సేకరణపై ఆధారాలను సమగ్రంగా విశ్లేషించి నిందితుల కదలికలు, పాత్రను నిర్ధారించి, బుధవారం ఉదయం సుమారు 9.00 గంటల సమయంలో తిలారు రైల్వే స్టేషన్ వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన తెల్లని కారు, బజాజ్ పల్సర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

# నేటి నుండి వ్యాసాశ్రమ శతాబ్దిఉత్సవాలు

- వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన

**ఏర్పేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఏర్పేడు మండల కేంద్రంలోని వ్యాసాశ్రమంలో నేటి నుండి వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు అందించాలంటూ ఆశ్రమ కోశాధికారి ఎ.అమర్‌నాథ్‌రెడ్డి జిల్లా ఎస్‌పిని అభ్యర్థించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం తరువాత జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆశ్రమ నిర్వాహకులు శతాబ్దిఉత్సవాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాలకవర్గం పూర్వ విద్యార్థులు, భక్తుల మధ్య యాజమాన్య వివాదాలు పరిష్కారం కాలేదని, గతంలో జరిగిన ఘర్షణ వాతవావరణం పరస్పర ఆరోపణల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం వున్నందున, ఆశ్రమం నిర్ణయించిన షెడ్యూల్‌లో బందోబస్తు నిర్వహించడం సాధ్యపడదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆశ్రమ నిర్వాహకులు శతాబ్ది ఉత్సవాలను రీషెడ్యూల్ చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పోలీస్ బలగాల లభ్యత గురించి వివరణ ఇస్తూ టిటిడి దేవస్థానం పాలకోత్సవం, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, వినాయక చవితి తదితర పండగల బందోబస్తు వున్న కారణంగా ఆశ్రమానికి తగినంత బందోబస్తు కేటాయించడం కష్టమని నిర్ణయించారు. ముందస్తు సమాచారం ఇవ్వక ఖరారు చేయడం వల్ల బందోబస్తు ఇవ్వలేమంటూ స్పష్టం చేశారు. కార్యక్రమాలు ఖరారు చేసే ముందు నిర్వాహకులు పూర్తి వివరాలు, భక్తుల సంఖ్య అంచనా అందించాల్సి వుంది. సాధ్యమైనంత వరకు ఆశ్రమం శాంతిభద్రతల దృష్ట్యా వాయిదా వేసుకోవాలని సూచించారు. అయితే ఇరువర్గాలు రెచ్చకొట్టే వ్యాఖ్యాలు ఆరోపణలు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు రేణిగుంట డిఎస్‌పి ఏర్పేడు ఎస్‌హెచ్‌ఓలకు కూడా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## టిటిడి షాపుల టెండర్లలో రసాభాస

**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడి కేటాయించే దుకాణాల టెండర్లలో రసాభాస చోటుచేసుకుంది. ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచిన టిటిడి ఎస్టేట్ విభాగం ఈ టెండర్లను బుదవారం తెరచి నిబంధనల మేరకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంది. తిరుపతిలో టిటిడికి సంబంధించి శ్రీనివాసం వసతి సముదాయం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో ఈ దూకాణాలకు ఇటీవల టెండర్లు పిలిచింది. అర్హులైన వ్యాపారులు టెండర్లను దాఖలు చేశారు. టెండర్ల పరిశీలనలో టెండర్ షెడ్యూల్లలో ప్రతి పేజీ లో సంతకం చేయలేదన్న కారణంగా రెండు వందలకు పైగా టెండర్ షెడ్యూల్లు తిరస్కరణకు గురయ్యాయని సమాచారం. టెండర్ నిబంధనల్లో ఎక్కడా ప్రతి పేజీలో సంతకం చేయాలని పేర్కొనలేదని వ్యాపారులు వాపోతున్న. దుకాణాల కేటాయింపుల్లో ఇలా చేయడం మతలబు ఏంటని అధికారులతో వాదనకు దిగారు. దీంతో అక్కడి వ్యాపారులను వెలుపలికి పంపించారు. అలిపిరి, శ్రీనివాసం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో దుకాణాలకు షీల్డ్ టెండర్లు పిలిచిన టిటిడి దుకాణాల టెండర్లలో వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నడం కారణంగానే కొంత మతలబు జరిగిందనేది తెలుస్తోంది,. ఈవిషయంగా సంబంధిత అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించినా స్పందన లేదు.

## దుర్గమ్మ ఆలయంలో నేటి నుండి పవిత్రోత్సవాలు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో ఈనెల 27 నుండి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర పవిత్రోత్సవాలు సందర్భంగా గురువారం మొదటి రోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు అమ్మవారి దర్శనం వుంటుందన్నారు. **పవిత్రోత్సవం వివరాలు:** ఆలయంలో నిత్య కైంకర్యాలు, అర్చనలు, పూజలు జరిగే సమయంలో తెలిసి లేదా తెలియక జరిగే దోషాలు, స్పర్శ దోషాలు,లోపాలు,అశుచులు తొలగిపోయి ఆలయ పవిత్రత పరిపూర్ణంగా నిలిచేందుకు ఆగమ శాస్త్రోక్తంగా ప్రతి ఏటా నిర్వహించే విశేష మహోత్సవమే ఈ పవిత్రోత్సవం. రంగురంగుల పట్టు దారాలతో ప్రత్యేకంగా రూపొందించిన పవిత్ర మాలలను ప్రధాన దేవతలకు, పరివార దేవతలకు ధరింపజేసి, హోమ క్రతువులు నిర్వహించడం ద్వారా ఇంద్రకీలాద్రి క్షేత్రానికి విశేషమైన ఆధ్యాత్మిక తేజస్సు సమకూరుతుందని పురాణోక్తి. ఉత్సవాల మొదటి రోజైన ఆగస్టు 27 (గురువారం) తెల్లవారుజామున 3 గంటలకు శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయంలో శాస్త్రోక్తంగా సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం శ్రీ అమ్మవారి మూలవిరాట్‌కు అర్చక పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య దివ్యమైన స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారణ మహోత్సవాన్ని జరిపిస్తారు. ప్రధాన ఆలయంలో సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, పవిత్రాలంకరణ క్రతువులు పూర్తయ్యేంత వరకు దర్శనాలు నిలిపివేయబడతాయని, ఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు శ్రీ అమ్మవారి సర్వదర్శనం కల్పించడం జరుగుతుందని ఇఓ శీనానాయక్ తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ వైదిక హోమాలు, జపాలు,మూల మంత్ర హవనములు తదితర కార్యక్రమాలు దేవస్థానంలో నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మ సేవలో ఎన్నికల అధికారి ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా పవన్ కుమార్ శర్మ, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం దర్శించుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై అన్నప్రసాదం ప్రైవేటీకరణ అవాస్తవం:**

దుర్గమ్మ ఆలయంలో ప్రైవేటుకు ప్రసాదం అనే అంశం అవాస్తవం, నిరాధారమైనదని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ స్పష్టం చేశారు. భక్తులకు అందించే పవిత్ర అన్నప్రసాద వితరణను ఏ ప్రైవేట్ సంస్థకూ అప్పగించడం లేదని, భక్తులకు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదం అందించేందుకు దేవస్థానం ముందుచూపుతో ఆలోచన చేసి అత్యాధునిక స్టీమ్ ఆధారిత వంటశాల పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని వివరించారు. రూ.36.82 లక్షల దేవస్థాన నిధుల ఆదా తిరుమల తిరుపతి దేవస్థానంలో మెకనైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసిన టెక్నోలాజిక్ ఇంజనీర్స్ ఇండియా ప్రై.లి. సంస్థ ఈ పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్ కొరకు రూ. 2,31,82,668/ (జీఎస్టీ, రవాణా ఖర్చులు అదనం) కోట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మందికి పరిశుభ్రమైన వంటశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్న అనుభవం కలిగిన హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ / అక్షయపాత్ర ఫౌండేషన్ వారు అదే ఆధునిక పరికరాలను కేవలం రూ. 1.95 కోట్లకు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారని, దీని ద్వారా దేవస్థానానికి ఏకంగా రూ. 36,82,668 నిధులు ఆదా అవుతాయన్నారు. ఈ ప్రతిపాదనను ఆలయ ధర్మకర్తల మండలి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించగా, ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. నిత్యాన్నదాన పథకానికి విరాళం దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని విజయవాడకు చెందిన పి యశ్వంత్, కుటుంబ సభ్యులు బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ ఆలయానికి ఆధునిక ప్రింటర్ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్ విరాళంగా ఆర్‌వీ డిజిటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న శుభ సందర్భంగా సుమారు రూ. 1,01,000 విలువైన అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్‌ను విరాళంగా బుధవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామడుగు వెంకట్రావు అందజేశారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తిరుపతి మేయర్ సీటు కోసం యువత ఉరకలు!

- జీరో బడ్జెట్ రాజకీయాల వైపు చూపు
- యువతకు ప్రాధాన్యమంటున్న ప్రధాన పార్టీలు




**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి మేయర్ పీఠం కోసం రాజకీయ పార్టీల్లో కొత్త తరం నేతలు ఉరకలు వేస్తున్నారు. డబ్బు, అంగబలం కంటే ప్రజాసేవ, యువతతో అనుసంధానం, విద్యార్హతలు, సామాజిక సేవ వంటి అంశాలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మేయర్ రేసు గతంతో పోలిస్తే మరింత ఆసక్తికరంగా మారనుంది. తమిళనాడు రాజకీయాల్లో కనిపిస్తున్న కొత్త తరహా రాజకీయాల ప్రభావం, జెన్‌జీ ఓటర్ల ప్రాధాన్యం, 'జీరో బడ్జెట్ పాలిటిక్స్'పై పెరుగుతున్న చర్చ యువ ఆశావహుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. డబ్బు తీసుకోకుండా ఓటు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పిలుపు కూడా ఈ చర్చకు ఊతమిచ్చింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువతకు ప్రాధాన్యతనిస్తుండటం, వైసిపి అధినేత వైఎస్ జగన్ కూడా జెన్‌జీ యువతకు పెద్దపీట వేయాలనే సంకేతాలు ఇవ్వడం తిరుపతిలోని యువ రాజకీయ ఆశావహుల్లో ఆశలు పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే మేయర్ ఎన్నికల్లో కొత్త ముఖాలకు అవకాశం దక్కుతుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మూడు సామాజిక వర్గాల మధ్యే పోటీ:** తిరుపతి రాజకీయాల్లో తొలి నుంచీ ప్రధానంగా రెడ్డి, బలిజ సామాజిక వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూ వచ్చింది. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవుల్లో ఈ సామాజిక వర్గాలకు చెందిన నేతలు పలుమార్లు విజయం సాధించారు. అయితే 2021లో తొలిసారిగా జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిసి–యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీష యాదవ్ మేయర్‌గా ఎన్నిక కావడం కొత్త సమీకరణాలకు తెరతీసింది. వచ్చే ఎన్నికల్లో మేయర్ పదవి కోసం కూటమి పార్టీలతో పాటు వైసిపి,, కాంగ్రెస్ పార్టీల నుండి బలిజ, రెడ్డి, యాదవ సామాజిక వర్గాలకు చెందిన పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

**కూటమిలో 'మేయర్'పై మిత్రపక్షాల మల్లగుల్లాలు:** 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి తరఫున జనసేన అభ్యర్థి శ్రీనివాసులు విజయం సాధించడంతో ఈసారి మేయర్ స్థానం టిడిపికి కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. అయితే తమకే అవకాశం ఇవ్వాలని జనసేన కూడా కోరుతున్నట్టు సమాచారం. దీంతో మేయర్ సీటు ఎవరికి దక్కాలన్న అంశంపై కూటమిలో అంతర్గత చర్చలు మొదలైనట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కూటమి అధిష్ఠానం మూడు పార్టీల కీలక నేతల అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

**అనితా యాదవ్‌కు అనగాని ఆశీస్సులు:** ఈ నేపథ్యంలో టిడివి రాష్ట్ర కార్యదర్శి అన్నా అనితా యాదవ్ పేరు టిడిపి మేయర్ అభ్యర్థిగా ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో వైసిపి నుండి కార్పొరేటర్‌గా గెలిచిన ఆమె డిప్యూటీ మేయర్ పదవిని ఆశించి కొంతమంది కార్పొరేటర్లతో కలిసి టిడిపిలో చేరారు. అయితే ఆ పదవి టిడిపికి చెందిన ఆర్‌సి మునికృష్ణకు దక్కడంతో ఆమెకు మేయర్ అవకాశం కల్పించాలనే అభిప్రాయం పార్టీలోని కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ కూడా ఆమెకు అనుకూలంగా ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో జెసీఐ ఇండియా అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి పేరు కూడా మేయర్ రేసులో వినిపిస్తోంది. ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన తండ్రి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి చంద్రబాబు నాయుడును కోరినట్టు సమాచారం. హర్షవర్ధన్ రెడ్డి ఐదు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకోవడంతో పాటు ఐఐఎంలో విద్యాభ్యాసం, ఐటీలో అంతర్జాతీయ స్థాయి బాధ్యతలు, విఐటీలో పీహెచ్‌డీ వంటి విద్యా, వృత్తిపరమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నారు. 20కి పైగా దేశాల్లో పర్యటించిన అనుభవంతో పాటు యువతతో అనుసంధానం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుదనం తనకు కలిసొచ్చే అంశాలుగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యా సంస్థల అధిపతి పెనుమాడు ప్రణీత్ కూడా మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. చాలాకాలంగా టిడిపితో అనుబంధం ఉన్న ఆయన నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆశించినా అవకాశం దక్కకపోవడంతో ఇప్పుడు మేయర్ రేసుపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇక మాజీ కార్పొరేటర్ యువనేత నరసింహాచారి కూడా పోటీలో ఉండనున్నారు.

**జనసేనలోనూ యువ ముఖాల వేట:** జనసేనకు మేయర్ స్థానం దక్కితే ఎమ్మెల్యే శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్‌ను రంగంలోకి దించాలనే ఆలోచన ఆయన సన్నిహిత వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. యువతను ముందుకు తీసుకురావాలన్న పార్టీ విధానం, భవిష్యత్ నాయకత్వాన్ని ఇప్పటి నుంచే తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ఆయన పేరును పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పేరు కూడా జనసేనలో వినిపిస్తోంది. తిరుపతిలో ఆయనకు ఓటు బ్యాంకు, పట్టుకలిగి ఉండటంతో టివి చర్చల్లో వైసిపి నేతలపై ఘాటైన విమర్శలు చేస్తూ గుర్తింపు పొందిన ఆయనకు పార్టీ అవకాశం ఇస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

**వైసిపిలో అభినయ్ రెడ్డి పేరు:** కూటమి తరఫున అభ్యర్థి ఎవరు అన్నది స్పష్టమైన తర్వాతే తమ అభ్యర్థిని ఖరారు చేయాలని వైసిపి అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. కూటమి నుంచి బలమైన యువ నేతను రంగంలోకి దింపితే అందుకు ధీటుగా యువ ముఖాన్నే బరిలోకి దించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పేరు వినిపిస్తోంది. గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆ పదవికి రాజీనామా చేశారు. అయితే మేయర్‌గా పోటీ చేస్తే భవిష్యత్తులో ఎమ్మెల్యే అవకాశంపై ప్రభావం పడుతుందన్న సందేహం ఆయన వర్గంలో ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష యాదవ్ పేరు కూడా మరోసారి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. గతంలో మేయర్ పదవి జనరల్ మహిళకు కేటాయించినప్పటికీ బిసి వర్గానికి చెందిన శిరీష యాదవ్‌కు అవకాశం కల్పించడం అప్పట్లో రాజకీయంగా సంచలనంగా మారింది. రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ మాకిరెడ్డి పురుషోత్తం రెడ్డి కూడా మేయర్ పదవిపై ఆసక్తిగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధినేత జగన్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా ఆయనకు అనుకూల అంశంగా అనుచరులు భావిస్తున్నారు.

**యువతకే పట్టం కడతారా?:** మొత్తం మీద తిరుపతి మేయర్ ఎన్నిక ఈసారి కేవలం పార్టీల మధ్య పోరుగా గాకుండా కొత్త తరం నాయకత్వానికి పరీక్షగా మారే అవకాశం కనిపిస్తోంది. మూడు ప్రధాన సామాజిక వర్గాల సమీకరణాలు, కూటమిలో టీడీపీ– జనసేన మధ్య సీటు కోసం పోటీ, వైసిపి వ్యూహం, యువతకు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఇవన్నీ కలిపి మేయర్ రేసును ఉత్కంఠభరితంగా మారుస్తున్నాయి.

డబ్బు రాజకీయాలకు బదులు సేవ, పాత తరానికి బదులు కొత్త తరం, సంప్రదాయ సమీకరణాలకు బదులు సామాజిక, విద్యా, ప్రజాసేవా నేపథ్యం, ఈ అంశాల్లో ఏది తిరుపతి ఓటర్లను ప్రభావితం చేస్తుందో, చివరికి మేయర్ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో వేచి చూడాల్సిందే.

ఆట

# సెమీఫైనల్‌కు నార్త్‌జోన్

## 52 రన్స్ తేడాతో వెస్ట్ జోన్ ఓటమి



**బెంగుళూరు:** దులీప్ ట్రోఫీ 4వ రోజున వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ అనూహ్య విజయాన్ని పూర్తి చేసింది. బుధవారం బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో, నార్త్ జోన్ కేవలం 28 నిమిషాల్లో వెస్ట్ జోన్‌పై 52 పరుగుల తేడాతో విజయం సాధించి 2026-27 దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న వెస్ట్ జట్టుకు, చివరి రోజు ఉదయం మూడు వికెట్లు మిగిలి ఉండగా 67 పరుగులు అవసరమయ్యాయి. కానీ ఆ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. మొదటగా తనుష్ కోటియన్ అవుటయ్యాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అబిద్ ముస్తాఖ్ వేసిన బంతి పిచ్ అయిన తర్వాత కూడా అదే లైన్‌లో కొనసాగి అతని వికెట్లను పడగొట్టడంతో అతను బోల్తా పడ్డాడు. అబిద్‌తో కలిసి మరో ఎడమచేతి స్పిన్నర్ నిశాంత్ సింధు బౌలింగ్ చేస్తుండటంతో, ఆట లయను దెబ్బతీయడానికి వెస్ట్, శార్దూల్ ఠాకూర్ కంటే ముందుగా ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ తుషార్ దేశ్‌పాండేను పంపాలని నిర్ణయించుకున్నాడు. ముంబై పేసర్ 17 బంతుల పాటు క్రీజులో నిలదొక్కుకున్నాడు. కానీ ఆవేశంతో క్రీజు దాటి బయటకు వచ్చి అబిద్ (60 పరుగులకు నాలుగు వికెట్లు) బౌలింగ్‌లో బంతిని బలంగా బాదబోయాడు. ఆ క్రమంలో బంతి బ్యాట్‌అంచుకు తగిలి స్లిప్‌ఫీల్డర్ చేతిలోకి వెళ్లింది. స్పెషలిస్ట్‌బ్యాటర్ ఉర్విల్ పటేల్ (44) తో శార్దూల్ జత కలిశాడు, కానీ వారిద్దరి భాగస్వామ్యం కేవలం మూడు బంతులే కొనసాగింది. నిశాంత్ బౌలింగ్‌లో ఉర్విల్ స్లాగ్ స్వీప్ ఆడబోయి విఫలమవడంతో లెగ్‌బిఫోర్ గా అవుటయ్యాడు. కేవలం ఒక గంట క్రికెట్ వ్యవధిలోనే, వెస్ట్ జట్టు 195 పరుగులకు మూడు వికెట్ల నుండి 234 పరుగులకే ఆలౌట్ అయి, అద్భుతమైన ఫామ్ నుండి పతనానికి పడిపోయింది.

## మహిళల హాకీ ప్రపంచ కప్..

# నేడు జర్మనీతో భారత్ ఢీ



**నెదర్లాండ్స్:** ఆస్ట్రేలియాతో గోల్ రహిత డ్రాతో సెమీఫైనల్ ఆశలు ఆవిరైన తర్వాత, గురువారం ఆమ్‌స్టెల్వీన్‌లో జర్మనీతో నెదర్లాండ్స్‌లో జరిగే ఐదవ, ఆరవ స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో భారత్ మహిళల ప్రపంచ కప్ ప్రచారాన్ని ఘనంగా ముగించాలని చూస్తోంది. ఫలితంతో సంబంధం లేకుండా, 1974లో నాలుగో స్థానంలో నిలిచిన తర్వాత ప్రపంచ కప్‌లో స్జోర్డ్ మారిజ్నే జట్టు అత్యుత్తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆమ్‌స్టెల్వీన్‌లో కేవలం ఒకే ఆటలో ఓడిపోయి, ఉన్నత ర్యాంకులో ఉన్న చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలతో డ్రాలు చేసుకున్నప్పటికీ, భారత్ గోల్స్ చేయడంలో వెనుకబడటం విమర్శలకు గురైంది. దీపిక, నవనీత్ కౌర్ చెరో రెండు గోల్స్ చేసినప్పటికీ, షార్ట్ కార్నర్‌ల నుండి అవకాశాలను గోల్స్‌గా మార్చడంలో వారి పేలవమైన ప్రదర్శన చివరికి జట్టుకు నష్టం కలిగించింది. మరోవైపు, భారత రక్షణ విభాగం పటిష్టంగా, ఛేదించడానికి కష్టంగా ఉంది. పేరుమోసిన నెదర్లాండ్స్ దాడి విభాగం సైతం రెండు గోల్స్ చేయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గురువారం, ప్రపంచ నెం.5 జర్మనీపై కూడా భారత్ ఇదే విధమైన దృఢమైన ప్రదర్శనను పునరావృతం చేయాలని కోరుకుంటుంది. ఇరు జట్ల మధ్య ఉన్న ర్యాంకింగ్ వ్యత్యాసానికి తగినట్లుగా ఒక అద్భుత ప్రదర్శన ఇవ్వాలని జర్మనీ తీవ్రంగా ఆశిస్తుంది.

# యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే సుమిత్ నిష్క్రమణ

**న్యూయార్క్:** భారత నంబర్ 1 సింగిల్స్ ఆటగాడు సుమిత్ నాగల్ ఓటమి చెందాడు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 2026 యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ క్వాలిఫైయింగ్ దశ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. సింగిల్స్ విభాగంలో ఏకైక భారతీయ ఆటగాడైన నాగల్, గంటా 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 86వ ర్యాంకర్ ఆర్థర్ గియా చేతిలో వరుస సెట్లలో (3-6, 6-7)



ఓటమి పాలయ్యాడు. 29 ఏళ్ల అతను ఈ ఏడాది తన తొలి గ్రాండ్ స్లామ్ ఈవెంట్‌లో పోటీ పడుతున్నప్పటికీ, క్వాలిఫైయింగ్ డ్రాలో అగ్రశ్రేణి ఆటగాడితో జరిగిన తన మొదటి మ్యాచ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆర్థర్ యొక్క మొదటి రెండు సర్వీస్ గేమ్‌లలో తాను సంపాదించిన నాలుగు బ్రేక్ పాయింట్లలో దేనినీ సద్వినియోగం చేసుకోలేక, సుమిత్ తన ఆరంభ అవకాశాలను చేజార్చుకున్నాడు. ఫ్రెంచ్ ఆటగాడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మ్యాచ్ మిగిలిన భాగంలో మరే బ్రేక్ పాయింట్లు రాకుండా అడ్డుకుని, తన మొదటి మరియు ఏకైక బ్రేక్ పాయింట్‌ను సాధించి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్ మరింత ఉత్కంఠభరితంగా సాగింది. ఇద్దరు ఆటగాళ్లు బలమైన రిటర్న్‌లు చేస్తూ, అనేక గేమ్‌లను డ్యూస్‌కు తీసుకువెళ్లారు. మొదటి నాలుగు గేమ్‌లలోనే బ్రేక్‌లను మార్చుకున్నారు. గంటసేపు సాగిన పోరాటం తర్వాత, ఆర్థర్ సర్వ్‌పై సుమిత్‌కు సెట్ పాయింట్ లభించినప్పటికీ, దానిని మరోసారి సద్వినియోగం చేసుకోలేక, సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత ఫ్రెంచ్ ఆటగాడు టైబ్రేక్‌లో అద్భుతంగా రాణించి, దానిని 7-4 తేడాతో సునాయాసంగా గెలుచుకొని, సుమిత్ నాగల్‌పై స్ట్రెయిట్‌సెట్స్ విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.



# స్టార్ ప్లేయర్లు రీ ఎంట్రీకి రెడీ

## అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్ సిరీస్‌లే టీమిండియా లక్ష్యం

**న్యూఢిల్లీ:** గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న పలువురు స్టార్ ప్లేయర్లు టీమిండియాలోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇందుకు టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్,శ్రీలంక జట్ల మధ్య టెస్ట్‌సిరీస్ జరుగుతుండగా, మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా గాయం నుంచి వేగంగా కోలుకుంటూ శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్‌బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని, ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే త్వరలోనే భారత వైట్‌బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# లంకకు తప్పని ఫాలో ఆన్

## గెలుపు ముంగిట భారత్!

**కొలంబో:** కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టు బిగించి గెలుపు ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 290 పరుగులకు ఆలౌట్ చేసింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసి 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25



పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు.

కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా, శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈవికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా, శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.



# 50 వేల ఉద్యోగులపై వోక్స్‌వ్యాగన్ వేటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 26:** ఆటో దిగ్గజం వోక్స్‌వ్యాగన్ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. అమ్మకాలు తగ్గడం, చైనా కంపెనీల నుంచి పోటీ పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికంగా ఉండటంతో భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 50 వేల వరకు ఉద్యోగాలు తగ్గించేముప్పుఉంది. దీంతో జర్మనీలో ఉద్యోగుల ఆగ్రహం తీవ్ర స్థాయికి చేరింది. ఫోక్స్‌వ్యాగన్ ప్రధాన కార్యాలయం ఉన్న వోల్ఫ్స్‌బర్గ్‌లో 10 వేల మందికి పైగా కార్మికులు గుమికూడారు. సంస్థను పోటీకి తగినట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందని సీఈవో ఒలివర్ బ్లూమ్ వారికి చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బ్లూమ్ ప్రసంగానికి కార్మికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. కొందరు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 50 వేల ఉద్యోగాల కోతపై యాజమాన్యం చర్చిస్తోంది. ఇందులో సగం వరకు జర్మనీలో ఉండొచ్చని తెలుస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణ, ముందస్తు రిటైర్‌మెంట్, కొత్త నియామకాలపై ఆంక్షల ద్వారా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోంది. జర్మనీలోని పలు ప్లాంట్ల భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొంది. ఒస్నాబ్రూక్ ప్లాంట్‌లో వచ్చే ఏడాది ఉత్పత్తి నిలిచిపోనుంది. మరో నాలుగు ప్లాంట్ల భవిష్యత్తు 2030 తర్వాత ఎలా ఉంటుందన్నది స్పష్టంగా లేదు. ఫోక్స్‌వ్యాగన్‌కు చైనా కార్ల తయారీ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో చైనా కంపెనీలు వేగంగా ఎదుగుతున్నాయి. చైనాలో ఫోక్స్‌వ్యాగన్ అమ్మకాలు కూడా తగ్గాయి. అమెరికా టారిఫ్‌లు, అధిక ఉత్పత్తి వ్యయాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. కంపెనీ వ్యయాలు కొంతమంది పోటీదారుల కంటే 30 శాతం అధికంగా ఉన్నాయని బ్లూమ్ తెలిపారు.

# ప్రపంచ ఆర్థికవ్యవస్థలో టగ్‌ఆఫ్ వార్!

## -ఐఎంఎఫ్ ఎండి క్రిస్టలినా జార్జియేవా



**న్యూయార్కు,ఆగస్టు 26:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక భారీ టగ్ ఆఫ్ వార్ స్థితిని ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా వ్యాఖ్యానించారు. ఒకవైపు పశ్చిమాసియాలో ఇంధన సరఫరా ఆటంకాలతో తలెత్తిన ప్రతికూలతలు, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడుల వెల్లువతో పెరిగిన డిమాండ్ ఈ రెండు పరస్పర విరుద్ధ శక్తుల మధ్య గ్లోబల్ ఎకానమీ నలిగిపోతోందని ఆమె విశ్లేషించారు. జీ20 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశానికి ముందు వాషింగ్టన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రపంచం ఊహించిన దానికంటే మెరుగ్గానే తట్టుకోగలిగిందని జార్జియేవా తెలిపారు. చమురు, గ్యాస్ నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకోవడం, గల్ఫ్ యేతర దేశాల నుంచి సరఫరాలు పెరగడం, ఇంధన వినియోగం తగ్గడం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం వృద్ధి చెందడం వంటి అంశాలు దీని ప్రభావాన్ని తగ్గించాయని ఆమె వివరించారు. ఏఐ రంగంలో పెట్టుబడుల జోరు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని ఆమె నొక్కి చెప్పారు. అమెరికాలో ప్రారంభమైన ఏఐ విప్లవం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారుతోంది. ఇతర దేశాలు సైతం డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం భారమై, వడ్డీ రేట్లను తగ్గించకుండా సెంట్రల్ బ్యాంకులు కఠిన వైఖరిని అవలంబించే ముప్పు ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఆధారపడే పేద దేశాలపై రుణ భారం మరింత పెరగవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో 2% వాటా విక్రయం


**ముంబయి,ఆగస్టు26:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో 2 శాతం వాటాను ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించనుంది. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.2,964 కోట్ల నుంచి రూ.3,122 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఈ బ్లాక్ డీల్‌లో సుమారు 98.85 లక్షల షేర్లు చేతులు మారనున్నాయి. ఒక్కో షేర్‌కు రూ.2,998-రూ.3,158 ధరను ఆఫర్ ధరగా నిర్ణయించినట్లు సమాచారం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ముగింపు ధరతో పోలిస్తే ఈ ఆఫర్ ధర సుమారు 2-7 శాతం డిస్కౌంట్‌తో ఉంది. ఇది పూర్తిగా సెకండరీ షేర్ సేల్ కావడంతో కంపెనీ నుంచి కొత్తగా ఎలాంటి షేర్ల జారీ ఉండదు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రమోటర్ అయిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్‌కు కంపెనీలో 34.59 శాతం వాటా ఉంది. 2 శాతం వాటా విక్రయం అనంతరం ఆ వాటా తగ్గనుంది. ఈ విక్రయం ద్వారా వచ్చే మొత్తం కంపెనీకి కాకుండా షేర్లను విక్రయిస్తున్న ప్రమోటర్‌కు చేరుతుంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సంస్థ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 25.5 శాతం పెరిగి రూ.965 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.769 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం 20.2 శాతం పెరిగి రూ.1,745 కోట్లకు చేరింది. బుధవారం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ షేరు 2.1 శాతం తగ్గి రూ.3,222.80 వద్ద ముగిసింది.

వాణిజ్యం



# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 26:** దేశీయ ఈక్విటీ సూచీలు బుధవారం నష్టాలతో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం, అమెరికా జూలై వ్యక్తిగత వినియోగ వ్యయాల ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మార్కెట్లు అప్రమత్తంగా ఎదురుచూడటం ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలకంగా పరిగణించే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రానున్న రోజుల్లో వడ్డీ రేట్లపై ఫెడ్ నిర్ణయాలకు సంబంధించి కొత్త సంకేతాలను అందించనున్నాయి. ఎన్‌విడియా ఫలితాలపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి. ఎఐ రంగంలో వ్యయాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయి, టెక్నాలజీ ఆధారిత మార్కెట్ ర్యాలీ నిలకడగా ఉంటుందా అనే అంశాలపై ఈ ఫలితాలు స్పష్టత ఇవ్వనున్నాయి. దీంతో ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.44 శాతం పడిపోవడం కూడా సూచీలపై ఒత్తిడి పెంచింది. మరోవైపు ఫైనాన్షియల్ షేర్లు, ప్రైవేట్ బ్యాంకులు లాభపడగా, సిమెంట్, మెటల్ షేర్లు కూడా పురోగమించాయి. ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత మద్దతునిచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల దిగువకు పడిపోయింది. నిఫ్టీ 50 సూచీ 126.80 పాయింట్లు నష్టపోయి 24,207.75 వద్ద ముగిసింది. ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 183.15 పాయింట్లు తగ్గి 77,472.94 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభాల్లోనే కొనసాగాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.56 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,375 షేర్లులాభపడగా, 1,944 షేర్లు నష్టపోయాయి. మరో 231 షేర్లలో ఎలాంటి మార్పులేదు. అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.24 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 85.03 డాలర్లకు చేరింది. అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్‌కు ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.43 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,62,115 వద్ద నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 0.11 శాతం పెరిగి 98.95కు చేరింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.47 శాతం పడిపోయింది. ప్రధానంగా ఇన్ఫోసిస్ 2.10 శాతం, టెక్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.52 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 1.50 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31 శాతం, ఎంఫాసిస్ 1.31 శాతం, టీసీఎస్ 1.14 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 1.14 శాతం, కోఫోర్జ్ 0.68 శాతం చొప్పున నష్టపోయాయి. ఇతర షేర్లలో అద్వైత్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ 3.71 శాతం, ఎంటీఏఆర్ టెక్నాలజీస్ 1.92 శాతం లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 1.51 శాతం పడిపోయింది. ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.29 శాతం, సాయి పేరెంటరల్స్ 0.71 శాతం పెరగగా, సుబెక్స్ 0.39 శాతం, ఎన్‌బీసీసీ0.32 శాతం నష్టపోయాయి.



# ఉల్లిధరల నియంత్రణకు కేంద్రం జోక్యం

## రూ.35 సబ్సిడీ ధరకే విక్రయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** దేశవ్యాప్తంగా ఉల్లిపాయల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో గురువారం నుంచి దేశ రాజధాని ఢిల్లీలో కిలో ఉల్లిపాయలను రూ.35 సబ్సిడీ ధరకు విక్రయించనుంది. నగరాల్లో ఉల్లిపాయల రిటైల్ ధరలు కిలోకు రూ.55-60 వరకు చేరాయి. కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ఈ సబ్సిడీ విక్రయాలను ప్రారంభించనున్నారు. 2026 కోసం ఉత్పత్తి రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న 1.21 లక్షల టన్నుల బఫర్ స్టాక్ నుంచి ఉల్లిపాయలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థల ద్వారా రిటైల్ విక్రయాలు చేపట్టనున్నారు. ఎన్‌సీసీఎఫ్ వద్ద ప్రస్తుతం 62 వేల టన్నుల ఉల్లిపాయల బఫర్ నిల్వ ఉంది. ఇందులో నుంచి మహారాష్ట్రలోని నాసిక్ నుంచి 400 టన్నుల ఉల్లిపాయలను కాండా ఎక్స్‌ప్రెస్ ద్వారా ఢిల్లీకి తరలిస్తున్నారు.

కేంద్రీయ భండార్‌కు చెందిన 100 స్టోర్ల ద్వారా ఉల్లిపాయలను విక్రయించనున్నారు. మదర్ డెయిరీకి చెందిన 300 ఔట్‌లెట్ల ద్వారా కూడా విక్రయించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రైల్వే రేక్‌ల ద్వారా వచ్చే ఉల్లిపాయలను చండీగఢ్, లూధియానా, వారణాసి తదితర నగరాల్లో కూడా విక్రయించనున్నారు. నాఫెడ్ వద్ద 55 వేల టన్నుల కంటే తక్కువ ఉల్లిపాయల బఫర్ స్టాక్ ఉంది. ఈ సంస్థ కూడా ఢిల్లీతో పాటు కొచ్చి, గువాహటి తదితర ప్రాంతాల్లో ఉల్లిపాయలను విక్రయించనుంది. గత నెల రోజులుగా ఉల్లిపాయల ధరలు గణనీయంగా పెరిగాయి. 25న దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ధర కిలో రూ.44.72కు చేరింది. జూలై 25న ఇది రూ.34.80గా ఉంది. అంటే నెల వ్యవధిలో 28 శాతానికి పైగా పెరిగింది. ఏడాది క్రితం కిలో ఉల్లిపాయ ధర రూ.28.67గా ఉండగా, ప్రస్తుతం 56 శాతం పెరిగింది. పలు మెట్రో నగరాల్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. బుధవారం చెన్నై, కోల్‌కతాలో కిలో ఉల్లిపాయ రూ.60, ఢిల్లీలో రూ.55, ముంబైలో రూ.48, రాంచీలో రూ.38గా నమోదయ్యాయి.

ఏడాది క్రితం ఇదే సమయంలో చెన్నైలో రూ.35, కోల్‌కతాలో రూ.32, ఢిల్లీలో రూ.33, ముంబైలో రూ.32, రాంచీలో రూ.25గా ధరలు ఉన్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో పెరిగాయి. ఆగస్టు 25న సగటు హోల్‌సేల్ ధర కిలో రూ.36.73గా ఉంది. ఏడాది క్రితం రూ.22.54తో పోలిస్తే ఇది 63 శాతం అధికం. దేశంలో ఉల్లిపాయల ఉత్పత్తి 307.37 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14